www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 07 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ మార్గశిర శుద్ధ చతుర్దశి
25-31 డిసెంబర్ 2023
వెల : ₹20/-



## కశ్మీరీ పండిట్ల ఘోష మీద 'తీర్పు'



## బయటపడుతున్న అదృశ్య 'హస్తం'?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# ప్రకృతి అందాల సిరి సిక్కిం









ఈశాన్య భారతంలో అతి చిన్న రాష్ట్రం సిక్కిం. అయితేనేం... దేశంలోనే అతి అరుదైన గౌరవం దక్కించుకుంది. 2024లో సందర్శించదగిన చల్లని ప్రదేశాల్లో జాతీయ భౌగోళిక సంస్థ ఎంపిక చేసిన జాబితాలో ఇది అగ్రస్థానంలో నిలిచింది. 1975లో దేశంలో 22వ రాష్ట్రంగా అవతరించిన సిక్కిం ప్రకృతి సౌందర్యానికి నెలవు. సుమారు ఏడు వేల కి.మీ.విస్తీర్ణం గల రాష్ట్రంలో 40 శాతంపై చిలుకు అడవులతో ప్రకృతి రమణీయత వెల్లివిరుస్తోంది. దేశంలో గుర్తించిన 1450 సీతాకోక చిలుక జాతుల్లో రమారమి 700 రకాలు రాష్ట్రంలోనే ఉన్నాయి. హిందూ, బౌద్ధ మతాల సమ్మేళనంతో ప్రత్యేకతను నింపుకుని సేంద్రియ వ్యవసాయం పాటించే తొలి రాష్ట్రంగా గణనకెక్కింది. ఆంగ్ల పాలకుల హయాంలో వలసల ప్రోత్సాహంతో నేపాలీలు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. జనాభాలో మూడింట రెండు వంతులకుపైగా వారే ఉన్నారు. నేపాలీయ అధికారభాష. సిక్కిమీస్, ఆంగ్లం,హిందీ తదితర భాషలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.



# సర్వవేద మందిరమిది



ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబర్ 18న వారణాసిలో ప్రారంభించిన సర్వవేద మందిరమిది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యానమందిరం. ఏడు అంతస్తుల ఈ మందిరంలో ఒకేసారి 20,000 మంది ధ్యానం చేయవచ్చు. సద్గురు సదాఫల్ దేవ్‌జీ మహరాజ్ స్థాపించిన విహంగ యోగ్ సంస్థాన్ శత వార్షికోత్సవం సందర్భంగా ఈ విశిష్ట ధ్యానమందిరాన్ని నిర్మించారు. 17వ తేదీ రాత్రి ప్రధాని మోదీ కాశీ–తమిళ సంగమం కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040–27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/–** (వారానికి రూ. 12/–) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/– చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/– చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040–27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్–500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

ఉన్న రాష్ట్రాలు కూడా చేజారి పోవడంతో కాంగ్రెస్‌కు దిక్కు తోచడం లేదు. 2024 సాధారణ ఎన్నికలలోను బీజేపీదే హవా అంటూ ఇప్పుడే ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సర్వేలతో కాంగ్రెస్‌తో పాటు, మిగిలిన ఇండీ కూటమికీ ఊపిరి సలపడం లేదు. దీని ఫలితమే పార్లమెంట్‌లో గందరగోళం. భారత పార్లమెంట్ చరిత్రలో, ఒకే సమావేశాలలో 92 మంది సభ్యులు సస్పెండ్ కావడం ఇదే మొదటిసారి అన్న వార్త విన్నాక ఎన్నో ప్రశ్నలు తలెత్తడం సహజం. ఒకింత బాధ కూడా కలుగుతుంది. డిసెంబర్ 18న ఒకేరోజు 78 మంది సభ్యులు ఉభయ సభల నుంచి సస్పెండయ్యారు. చాలాచిత్రంగా లోక్‌సభ నుంచి 33 మంది, రాజ్యసభ నుంచి 45 మంది సస్పెన్షన్‌కి గురి కావడం తీవ్రంగా ఆలోచించేటట్టు చేస్తుంది. సస్పెన్షన్లు లోక్‌సభ కంటే పెద్దల సభలో ఎక్కువగా ఉండడం అవాంఛనీయం.

పార్లమెంట్ చూసిన డిసెంబర్ 13 నాటి భద్రతా వైఫల్యం ఎవరికైనా ఆవేదన కలిగిస్తుంది. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు దేశం మొత్తం విచారం వ్యక్తం చేసింది. కానీ ప్రతిపక్షాల వైఖరి పార్లమెంట్ భద్రతా వైఫల్యం కంటే, వాటి సమీప భవిష్యత్తు మీద బెంగనే ఎక్కువ ప్రతిబింబిస్తున్నది. హోంమంత్రి సమాధానం, రాజీనామా నినాదాలతో సభ్యులు గందరగోళం సృష్టించారు. ఇందులో నిజాయితీ ఎంత? హేతుబద్ధత ఎంత అన్నదే ఇప్పుడు ప్రశ్న. సస్పెన్షన్‌కు గురైన సభ్యుల సంఖ్యను బట్టి తమ ఉనికికి బీజేపీయే అతి పెద్ద ముప్పు అని భావిస్తున్న పార్టీల నిర్వాకమే ఇదంతా అన్న నిర్ధారణకు రాక తప్పదు. ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు, సభా కార్యకలాపాలకు అడ్డు తగలడం వంటి కారణాలతోనే వీరందరినీ లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు కె. జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖాలిక్ స్పీకర్ పోడియం ఎక్కి నినాదాలు చేశారు. వీరి వ్యవహారం సభా హక్కుల కమిటీకి నివేదించవలసి వచ్చింది. ప్లకార్డుల ప్రదర్శనను పరిహరించాలని అన్ని పార్టీలు కలసి తీసుకున్న నిర్ణయం. అయినా ఆ ఏకాభిప్రాయాన్ని కూడా విపక్షాలు మరచిపోయాయి. లోక్‌సభ నుంచి

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ మార్గశిర శుద్ధ చతుర్దశి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**కశ్మీరీ పండిట్ల ఘోష మీద 'తీర్పు'** 6లో



దుశ్చర్య
**బయటపడుతున్న అదృశ్య 'హస్తం'?** 12లో



ప్రత్యేక వ్యాసం
**కొమ్రెల్లి మల్లన్నకు కోటి కోటి దండాలు** 26లో

# జాగృతి

## సంపాదకీయం

సస్పెండైన వారిలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధరి, ఉపనేత గౌరవ్ గొగొయ్ కూడా ఉన్నారు. డీఎంకే సభ్యులు పది మంది, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు తొమ్మిది మంది, కాంగ్రెస్ సభ్యులు 8 మంది సస్పెండయిన వారిలో ఉన్నారు. ఈ తీవ్ర గందరగోళం నడుమనే తపాలా, టెలీ కమ్యూనికేషన్ల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకుంది.

డీఎంకే గందరగోళం వెనుక ఉద్దేశం ఏమిటో గ్రహించడం పెద్ద కష్టం కాదు. తమిళనాడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకి పెరుగుతున్న ఆదరణ,

## సస్పెన్షన్లు ఏం చెబుతున్నాయి?

డీఎంకే తిరోగమనం సుస్పష్టం. మమతా బెనర్జీ బీజేపీని ఆగర్భ శత్రువుగానే పరిగణిస్తారు. ఈ క్రమంలోనే ఆమె తాజాగా వామపక్షాలు, కాంగ్రెస్‌తో కూడా పశ్చిమ బెంగాల్‌లో పొత్తు సాధ్యమేనని ప్రకటించారంటేనే అర్థం చేసుకోవచ్చు. ఈ రెండు ప్రాంతీయ పార్టీలకు మించిన అస్తిత్వ బాధ కాంగ్రెస్‌ను పట్టి పీడిస్తున్నది. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో అధికారం కోల్పోయి, హిందీ భాషా ప్రాంతాలలోనే పెద్ద లోటును ఆ పార్టీ ఎదుర్కొంటున్నది. ఈ మూడు పార్టీలు తమ దుగ్ధను పార్లమెంట్ వేదికగా ఈ విధంగా తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

పార్లమెంట్‌లో సస్పెన్షన్‌లు కొత్త కాదు. మార్చి 15, 1989లో 63 మంది ఎంపీలను ఒక దఫా సమావేశాలలో సస్పెండ్ చేసిన చరిత్ర ఉంది. నాటి ప్రధాని ఇందిర హత్య కేసుపై జస్టిస్ ఠక్కర్ కమిటీ నివేదిక సభకు సమర్పించిన సందర్భంలో ఈ పరిణామం జరిగింది. 2015లో కూడా, అంటే నరేంద్ర మోదీ మొదటి ప్రభుత్వంలో వెల్‌లోకి దూసుకువచ్చి, ప్లకార్డులు ప్రదర్శించనందుకు గాను 25 మంది సభ్యులను నాటి స్పీకర్ సుమిత్రా మహాజన్ సస్పెండ్ చేశారు.

కొందరు సభ్యుల వ్యవహార సరళి పార్లమెంట్ మర్యాదకు పూర్తి భంగకరంగా మారిందని ఎవరైనా అంగీకరించవలసి ఉంటుంది. టీఎంసీ సభ్యుడు (రాజ్యసభ) డెరిక్ ఓబ్రిన్ సరళి ఇందుకు ఉదాహరణ. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఇంతకు ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్. ఆ కాలంలో ధన్‌ఖడ్ అక్కడి ప్రాంతీయ పార్టీ తృణమూల్‌తో నిత్యం సంఘర్షించవలసి వచ్చింది. డెరిక్ సరళిలో అందుకు ప్రతీకారం తీర్చుకునే ధోరణే కనిపిస్తున్నది. రాజ్యాంగబద్ధంకాని వ్యాఖ్యలను కూడా సభలో వినిపించే ప్రయత్నం చేస్తున్న సభ్యులను నివారించే ప్రయత్నం కూడా వాక్ స్వాతంత్ర్యాన్ని నిరోధించే చర్యగా విపక్షాలు అభివర్ణిస్తున్నాయి. ఆఖరికి భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పుల మీద కూడా ప్రతికూల వ్యాఖ్యలు చేయడానికి భారత అత్యున్నత చట్టసభను వేదికగా చేసుకునే ప్రయత్నం ప్రజాస్వామ్యానికి మేలు చేసేది కాదు. కశ్మీర్‌పై చర్చ వేళ జాతులకు స్వయం నిర్ణయాధికారం ఉంటుందంటూ ఈవీ రామస్వామి నాయకర్ చేసిన వ్యాఖ్యలను డీఎంకే సభ్యుడు సభలో ప్రస్తావించడానికి చేసిన ప్రయత్నం దారుణం. ఆ వ్యాఖ్యలను నిరోధించడానికి రాజ్యసభ చైర్మన్ ఎంతో కష్టపడవలసి వచ్చింది. పార్లమెంట్‌లో మెజారిటీ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్నీ, కోర్టు సమర్ధించిన దానినీ బాహాటంగా విమర్శించడం ఏమి మర్యాద?

పార్లమెంట్ నిర్వహణకు ఒక్క నిమిషానికి అయ్యే ఖర్చు రూ. 2 లక్షలు. కానీ ప్రజా సమస్యల ప్రస్తావన పేరుతో సభా కార్యకలాపాలకు అడ్డుతగలడమే ఇవాళ ప్రతిపక్షాలు చేస్తున్న పని. ఇంతకీ పార్లమెంట్‌కు పొగ పెట్టే పనిలో దుందుడుకుగా వ్యవహరించిన వారి జాతకాలు నెమ్మదిగా బయటపడడం, కాంగ్రెస్‌తోను, రైతుల ధర్నాతోను సంబంధం ఉన్నవారి పని అని తేలడం విపక్షాలను కంగారు పెడుతున్నట్టే ఉంది. ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




38లో

కథ


**గతి తప్పిన అక్షరం**

- దాట్ల దేవదానం రాజు





| | | |
|---|---|---|
| మూడు రాష్ట్రాలకు ముచ్చటైన ఎంపికలు (కొత్త ముఖాలు) | - | 15 |
| ప్రజల విశ్వాసమే నా విజయ రహస్యం! (ముఖాముఖీ) | - | 20 |
| తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం! (ముఖాముఖీ) | - | 22 |
| వ్యతిరేక వెల్లువతో ఓటమి భీతి (ఆంధ్రప్రదేశ్) | - | 28 |
| ప్రజాస్వామ్య విలువలకు పాతర (జాతీయం) | - | 30 |
| సాహసోపేత సుచేత (మహిళ) | - | 32 |
| భారత టెన్నిస్ దిగ్గజాలకు అరుదైన గౌరవం! (క్రీడ) | - | 43 |
| తెలుగు సినిమాకు దెయ్యం వదిలేదెప్పుడు!? (సినిమా) | - | 50 |



'ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ ఆగస్ట్ 5,2019న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ సమగ్రతను సుసంపన్నం చేసేదే గాని విచ్ఛిన్నం చేసేది కాదు. అంతేకాదు, ఆ ఆర్టికల్ తాత్కాలికమైనదేనని కేంద్రం సరిగానే గుర్తించింది కూడా.' డిసెంబర్ 12, 2023న భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో ఇదే కీలకం. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆ ఆర్టికల్‌ను రద్దు చేయడం చెల్లదని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల మీద సుప్రీం కోర్టు కీలకమైన ఈ తీర్పును వెల్లడించింది. ఈ తీర్పు చరిత్రాత్మకమైనది. పండిత్‌ల హత్యాకాండ గురించి దర్యాప్తు చేయించాలంటూ గత కొద్దికాలంగా ఆ వర్గం చేస్తున్న న్యాయపోరాటం కూడా ఈ తీర్పుతో ఒక కొలిక్కి వచ్చినట్టయింది. 1989 నాటి ఆ హత్యాకాండపై దర్యాప్తు సాధ్యం కాదని అత్యున్నత న్యాయస్థానమే గతంలో పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇప్పుడు దర్యాప్తు బృందాన్ని నియమించక తప్పదు.

# కశ్మీరీ పండిట్లు

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు లేదా ఎన్నికల ద్వారా దేశ ప్రజానీకం ఇచ్చిన తీర్పు దేనినీ అంగీకరించడానికి కాంగ్రెస్ సహా ఏ విపక్షమూ దేశంలో సిద్ధంగా లేదు. ఆ తీర్పుల మీద తమ అంతరంగాలను వెల్లడించడం వేరు. వ్యతిరేకంగా 'పోరాటం' చేయడం వేరు. 370, 35 (ఎ) అధికరణాలను రద్దు చేస్తూ రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులకు ఉన్న రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ ఎందరో అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తను తీర్పును ఏకగ్రీవంగానే వెల్లడించింది. ఏడుగురు సభ్యులు ఉన్న ఉన్నత ధర్మాసనానికి కేసును పంపడానికి సుప్రీం కోర్టు మార్చి 2,2020న నిరాకరించిన విషయం గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు ఇద్దరు న్యాయమూర్తులు మాత్రం తాము ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పుతో ఏకీభవిస్తూనే విడిగా తీర్పులు ఇచ్చారు. అందులో జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ ఇచ్చిన తీర్పు పండిత్‌లు, కశ్మీర్ ఉగ్రవాద బాధితులకు వరప్రసాదమే. ఈ కేసులో ఆగస్ట్ 2,2023 నుంచి రోజువారి విచారణ ఆరంభమైంది.

తమ వాదనలకు అరవై గంటల సమయం అవసరమవుతుందని పిటిషనర్‌ల తరుపున ఒక విన్నతి ధర్మాసనానికి చేరింది. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్ (ట్రిపుల్ తలాక్ నిషేధానికి వ్యతిరేకంగాను, హిజాబ్‌కు అనుకూలంగాను కేసులలో వాదించినది కూడా ఈయనే), గోపాల్ సుబ్రమణియం, రాజీవ్ ధావన్, దుష్యంత్ దవే, శేఖర్ నఫాడే, దినేశ్ ద్వివేది, జఫార్ షా, సీయూ సింగ్, ప్రశాంత్‌చంద్ర సేన్, సంజయ్ పారిఖ్, గోపాల్ సుబ్రమణియన్, మేనకా గురుస్వామి, నిత్యా రామకృష్ణన్, పీవీ సురేంద్రనాథ్ పిటిషనర్ల తరపున వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలైనాయి. రాజకీయ పక్షాలు, ప్రైవేటు వ్యక్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పిటిషన్లు దాఖలు చేసినవారిలో ఉన్నారు. 370 రద్దు తరువాత అక్కడ కొత్తగా అమలవుతున్న రిజర్వేషన్లు, సాధించిన పురోగతి, మెరుగుపడిన శాంతిభద్రతలు, సుస్థిరత వంటి అంశాలతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి ఒక అఫిడవిట్ కూడా సమర్పించింది. జమ్ముకశ్మీర్ శాసనసభా స్థానాల పునర్ వ్యవస్థీకరణ, రిజర్వేషన్ల అంశం మీద ఇటీవల రాజ్యసభలో చర్చ జరిగిన సమయంలో కేంద్ర హోంమంత్రి వెల్లడించిన అంశాలు ఆ వాస్తవాన్ని నిర్ధారిస్తున్నాయి. లోయలో వీధివీధినా సాగిన అల్లర్లు, రాళ్లు విసిరే సంఘటనలు తగ్గుముఖం పట్టాయని, ఇవన్నీ వేర్పాటువాదులు, ఉగ్రవాదులు చేయించినవేనని ఆయన చెప్పారు. ఇప్పుడు అదంతా గతమని కూడా అన్నారు. రాళ్లు విసిరే సంఘటనలు 2018లో 1767 నమోదు కాగా, 2023 నాటికి ఒక్కటి కూడా జరగలేదని ఆయన చెప్పారు.

పిటిషనర్ల అన్ని వాదనలను నిరాకరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాల మీద ఒక విహంగ వీక్షణం చేయాలి. 370, 35(ఎ) అధికరణాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగబద్ధమే. ఆ అధికరణాలను కాలగర్భంలో కలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడమూ చెల్లుబాటు అవుతుంది.

అలాగే, 370 అధికరణాన్ని రద్దు చేస్తూ 370(3) కింద ప్రకటన వెలువరించే అధికారం భారత రాష్ట్రపతికి ఉందని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రపతి అనుమతి తీసుకోవలసిన అవసరం కూడా లేదని ఆయన వివరించారు. జమ్ముకశ్మీర్ విలీనం తాత్కాలికమే వంటి వాదనలతో ఏకీభవించడం లేదని




# ఘోష మీద 'తీర్పు'

కూడా ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు.

ఇదంతా కేంద్ర ప్రభుత్వ విజయంగానో, వేరే వారి పరాజయంగానో భావించడం కంటే, దేశ సమగ్రతకు లభించిన విజయంగా పేర్కొనడం సబబు. దాదాపు ఏడున్నర దశాబ్దాలుగా కుహనా మేధావులు, బుజ్జగింపు ధోరణులు చేస్తున్న వాదాలకు మాత్రం చెంపపెట్టు. జమ్ముకశ్మీర్ రాజ్యాంగ పరిషత్ ఉనికిలో లేదు కాబట్టి 370 అధికరణం రద్దు చేసే అధికారం ఎవరికీ లేదని చెప్పడం వింతేననిపిస్తుంది. అలా అయితే భారత రాజ్యాంగ పరిషత్ లేదు కాబట్టి రాజ్యాంగంలో రద్దు చేసిన అంశాలు, సవరణలు చెల్లవని చెప్పడం సాధ్యమా? దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు జమ్ముకశ్మీర్ భిన్నమైనది కాదని కూడా ప్రధాన న్యాయమూర్తి తేల్చి చెప్పారు. అంటే దానికి ప్రత్యేక సార్వభౌమత్వం అంటూ ఏమీ లేదు. అసలు కశ్మీర్ సంస్థానాధీశుడు హరిసింగ్ కశ్మీర్‌ను విలీనం చేసినప్పుడు సార్వభౌమత్వం కొనసాగుతుందన్న షరతులేమీ పెట్టలేదని కూడా ప్రధాన న్యాయమూర్తి గుర్తు చేశారు. అసలు నవంబర్ 25, 1949న జమ్ముకశ్మీర్ విడుదల చేసిన ప్రకటనలో భారత రాజ్యాంగమే తమకు సర్వోన్నతమనే పేర్కొన్నది. అది భారత్‌లో ఒక రాష్ట్రమని ఆర్టికల్ 1 కూడా తెలియచేసింది. వచ్చే సంవత్సరం సెప్టెంబర్‌కు అక్కడ నిర్వహించాలని కోర్టు ఆదేశించింది.

తీర్పును దాదాపు బీజేపీ వైరి పక్షాలన్నీ వ్యతిరేకించడం విశేషం. ఇటీవలనే బీజేపీకి దగ్గరయ్యారని అంతా భావించిన గులాం నబీ అజాద్ కూడా తీర్పు విచారకరమే అయినా, అంగీకరిస్తామని స్పష్టం చేశారు. యథాప్రకారం నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ తీర్పు పట్ల అసహనమే ప్రకటించారు. తీర్పు దారి తీర్పుదే. మన పోరాటం మనదే అన్నట్టే మాట్లాడారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వి ఈ తీర్పును తాము ఆమోదించడం లేదనే ప్రకటించారు. డీఎంకే అయితే తాము అధికారంలోకి వస్తే (బహుశా ఇండియా కూటమి) 370ని పునరుద్ధరిస్తామని ఉచిత హామీ ఒకటి పడేసింది. ఈ అంశం మీద కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రసంగానికి వంకలు పెట్టేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నించడం పెద్ద వికృతి. చరిత్రను తిరగ రాయవద్దని ఆయన వ్యాఖ్య. కానీ '370 అధికరణం సంధికాలపు ఏర్పాట్లలో ఒకటి మాత్రమే. ఆ సంగతిని ఈ సభ గుర్తుంచుకోవాలి' అని నవంబర్ 27,1963న లోక్‌సభ చర్చలో ప్రకటించిన సంగతి కూడా చరిత్రలోనే ఉంది. ఆ సంగతి రాహుల్ తెలుసుకోవాలి.

ప్రధాని మోదీ వ్యాఖ్య దేశ సమగ్రత పునాదిగానే ఉంది. 'ఏక్ భారత్, శ్రేష్ట భారత్' స్ఫూర్తికి సుప్రీం కోర్టు తీర్పు మద్దతునిచ్చిందని మోదీ శ్లాఘించారు. మోదీ వ్యాఖ్య ఆయన గాఢంగా విశ్వసిస్తున్న రాజకీయ సిద్ధాంతాన్ని ప్రతిబింబించేది మాత్రమే కాదు. నాటి రాజ్యాంగ సభ పరమోద్దేశం కూడా. భారతీయ జనసంఘ్ మొదటి నుంచి జమ్ముకశ్మీర్ సంపూర్ణ విలీనం పేరుతో జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేసింది. జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆ క్రమంలోనే జమ్ముకశ్మీర్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించారు కూడా. జనసంఘ్ కావచ్చు, తరువాత దాని పునాదులపై ఏర్పడిన బీజేపీ కావచ్చు. కశ్మీర్‌ను కేవలం పాలనా విధానంలో భాగంగానో, రాజకీయ ప్రయోజనంగానో పరిగణించలేదు. అదొక ఉద్విగ్న అంశంగానే, సమగ్ర భారత నిర్మాణంలో భాగంగానే పరిగణించాయి. శ్యామాప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజపేయి, ఇప్పుడు నరేంద్ర మోదీ కశ్మీర్ అంశం గురించి ఒక అవిశ్రాంత పోరాటమే చేశారు. బీజేపీ ఏం చేసినా దానిని బుజ్జగింపు రాజకీయాల చట్రం నుంచి చూసే విపక్షాలు కశ్మీర్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. కానీ బీజేపీకి ఉన్న సిద్ధాంత పటిమ, సిద్ధాంతానికి కట్టుబడి ఉండే తత్వం మూలంగా ఇప్పుడు భారత్ పరిధి వరకు జమ్ముకశ్మీర్ భారత్‌లో పూర్తి స్థాయిలో అంతర్భాగమైంది. నిజానికి భారత పార్లమెంట్ నిర్ణయంతో అది 2019లోనే జరిగినా,

భారత అత్యున్నత న్యాయస్థానం తాజా తీర్పుతో ఆ నిర్ణయం తిరుగులేనిదిగా చరిత్రలో స్థానం సంపాదించుకుంది.


ఇదంతా ఒక ఎత్తయితే, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వేరుగా ఇచ్చిన తీర్పునకు ఉన్న విశేషమైన ప్రాధాన్యం మరొక ఎత్తు. లోయలో జరిగిన పండిత్‌ల హత్యాకాండ, అక్కడ నుంచి వారు వేలాదిగా తరలిపోవడం గురించి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను 2020 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో జస్టిస్ కౌల్ తీర్పు వారికి సాంత్వన కలిగించేదే. సెప్టెంబర్ 1990లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల చేతులో హతమైన టికాలాల్ టప్లూ కుమారుడు అశుతోష్ టప్లూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనినే జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇలాంటి మరొక పిటిషన్‌ను అప్పటికి ఒక వారం ముందే సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తన వ్యాజ్యాన్ని స్వీకరించకపోవడంతో అశుతోష్ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. 1989–2003 మధ్య జరిగిన హిందువులు, సిక్కుల ఊచకోతలపై ప్రత్యేక దర్యాప్తు నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించ వలసిందని ఈ పిటిషన్‌లో అశుతోష్ కోరారు. మూడు దశాబ్దాల కాలం ముగిసింది కాబట్టి ఇప్పుడు దర్యాప్తు సాధ్యం కాదని, సాక్ష్యాలు సాధ్యం కాదని కోర్టు అభిప్రాయపడింది. నిజానికి జూలై, 2017లో కూడా కశ్మీరీలు ఇలాంటి ప్రయత్నం ఇంకొటి కూడా చేశారు. రూట్స్ ఇన్ కశ్మీర్ అనే సంస్థ పండిత్‌ల హత్యలపై సిట్‌ను నెలకొల్పేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరింది. చాలా చిత్రం 27 సంవత్సరాల తరువాత ఇలాంటి దర్యాప్తు జరపడం గురించి కోర్టు అనుమానాలు వ్యక్తం చేసింది. పైన



పేర్కొన్న టికాలాల్ టప్లూను జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ శ్రీనగర్‌లోని ఆయన ఇంట్లోకి చొరబడి హత్య చేసింది. వృత్తికి న్యాయవాది అయిన టప్లూ అప్పుడు బీజేపీ సభ్యుడు కూడా. అదే సంవత్సరం (1989) నవంబర్ 4న మక్బూల్ భట్‌కు మరణశిక్ష విధించిన జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి నీలకంఠ గంజూను ఆ కోర్టు ప్రాంగణం దగ్గరే చంపారు. జనవరి 4, 1990న శ్రీనగర్ కేంద్రంగా వెలువడే దినపత్రిక ఆఫ్తాబ్ ఒక దారుణమైన ప్రకటన వెలువరించింది. హిజ్బుల్ ముజాహుదీన్ హిందువు లంతా లోయను వీడి పోవాలంటూ ఇచ్చిన ప్రకటన అది. ఏప్రిల్ 14,1990న అల్ సఫా అనే మరొక పత్రిక కూడా ఇదే విధమైన ప్రకటన జారీ చేసింది. ఇలాంటి హత్యలు, బెదిరింపుల మూలంగా 90,000 నుంచి 1,00,000 మంది పండిత్‌లు లోయ వీడి పోయారు. మొత్తం పండిత్‌ల జనాభా 1,20,000 నుంచి 1,40,000. మూడు దశాబ్దాలలో 1764 మంది హిందువులను వేటాడి ఉగ్రవాదులు చంపారు. వారిలో 90 మంది వరకు పండిత్‌లు. అయితే ఈ లెక్క ఒకే విధంగా లేదు. లోయను వీడిని పండిత్‌లు మూడు లక్షలని కూడా చెబుతారు. అలాగే మరణాలు కూడా ప్రభుత్వం చెబుతున్నదాని కంటే ఎక్కువే.


తాజాగా జస్టిస్ కౌల్ ఇచ్చిన తీర్పునకు పూర్తి స్థాయి మానవ హక్కుల హననం కోణం ఉంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు సాగించిన మానవ హక్కుల హననం మీద ప్రత్యేక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని 121 పేజీల తన తీర్పులో జస్టిస్ కౌల్ రాశారు: 1980 దశకంలో కశ్మీర్ లోయలో క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఉండేవి. అందువల్ల చాలామంది సొంత ఇళ్లను వదిలి వలసపోవలసి వచ్చింది. పండిత్‌ల వలస వల్ల కశ్మీర్‌లో సాంస్కృతిక వాతావరణం మారిపోయింది. నాటి పరిస్థితుల తీవ్రత వల్ల ఒక దశలో భారత సార్వభౌమాధికారం కూడా సందిగ్ధంలో పడిపోయింది. సమైక్యత ప్రశ్నార్థకమైంది. సైన్యాన్ని రంగంలోకి దింపవలసి వచ్చింది. ఆ రాష్ట్రంలోని చిన్నారులు, స్త్రీలు, పురుషులు అంతా చాలా నష్టపోయారు. ఈ గాయాలను మానిపించవలసిన సమయం వచ్చింది.

విచారణ సంఘం ఏర్పాటు చేయడం వల్ల, బాధితులు తమ దుఃఖం గురించి చెప్పుకునే అవకాశం వస్తుంది. దానితో దోషులు తమ తప్పును తెలుసుకునే అవకాశం ఉంటుందని జస్టిస్ కౌల్ అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికాలో ఇలాంటి ట్రూత్ రికన్సియలేషన్ మంచి ఫలితాలను ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. జస్టిస్ కౌల్ తీర్పు మీద కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించవలసిన అవసరం ఉంది. కశ్మీరీల హృదయం గెలుచుకోవా లని పదే పదే చెప్పే ఉదారవాదులు ఏనాడూ పండిత్‌ల దుస్థితి గురించి మాట్లాడలేదు. ★



డి.అరుణ

# నెత్తుటి ఛాయలో ఆకుపచ్చ లోయ



పునరావాస కేంద్రంలో కశ్మీరీ మహిళ

**కశ్యప మహాముని భూమి, శైవసిద్ధాంతానికి అగ్రపీఠం, గొప్ప సారస్వత-వైదిక నాగరికతలకు పుట్టిల్లుగా పరిఢవిల్లిన సుందర కశ్మీర్ నుంచి హిందువుల తరిమివేత కొన్ని దశాబ్దాల కింద మాత్రమే ప్రారంభమైంది కాదు. కశ్మీర్ అంటే నేడు మనం మ్యాప్‌లలో చూస్తున్న భౌగోళిక ప్రదేశమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని కొన్ని ప్రదేశాలు, గిల్గిత్‌బల్తిస్తాన్, ఖైబర్‌ఫక్తూన్వా సహా లద్దాఖ్ వరకు ఉన్న ప్రాంతం. అందుకే, దండయాత్రలకు వచ్చిన ముస్లిం పాలకులు హిందూఖుష్ పర్వతాల మీదుగా ముందుగా అడుగుపెట్టేది కశ్మీర్‌లోనే. కనుక, నేడు పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న ఆక్రమిత కశ్మీర్‌ను కూడా కలుపుకుంటే, ఆ విస్తృతిలో విలసిల్లిన ఒక నాగరికతను ముస్లిం రాజులు, మతమౌఢ్యులు ఏ విధంగా అణచివేశారో అర్థం అవుతుంది. అంటే, మనం 1990వ దశకంలో చూసింది శతాబ్దాల కింద ప్రారంభమైన అనాగరిక బీభత్స చర్యకు కొనసాగింపే.**

ఈ ప్రక్రియ క్రీ.శ.1339లో తొలి ముస్లిం ఆక్రమణదారు షా మీర్ కాలంలోనే ప్రారంభమైంది. హింసాత్మక పద్ధతుల ద్వారా అనేకమంది కశ్మీరీ పండిట్‌లను ఇస్లాంలోకి మార్చడమే కాదు, సుప్రసిద్ధ ఆలయాలను, వారసత్వాన్ని, సంస్కృతిని విధ్వంసం చేసే పనికి శ్రీకారం చుట్టాడు. తర్వాత వచ్చిన తైమూర్ నాడు మెజారిటీగా ఉన్న హిందువులకు, మైనార్టీ ముస్లింలకు మధ్య చిచ్చుపెట్టడమే కాదు, కశ్మీరీ పండిట్లను హింసించేందుకు చట్టాలు ప్రవేశపెట్టాడు. తర్వాత వరుసగా వచ్చిన ఇస్లామిక్ పాలకులు పండిట్లను, హిందూ సంస్కృతిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం, వాటిని కాపాడుకునేందుకు పండిట్లు లోయ నుంచి పారిపోవడం ప్రారంభమైంది. తొలి వలసలు మొదలైంది షా మీర్ హింసలు భరించలేకే.

రెండవ విడత క్రీ.శ.1506 నుంచి 1585 వరకు పండిట్ల వలసలు సాగాయి. తర్వాత కశ్మీర్ పాలకులుగా వచ్చిన షా మీర్ సైన్యానికి చెందిన 'చక్‌లు' నిర్దాక్షిణ్యంగా హిందూ మందిరాలను, ఇతర ప్రదేశాలను ధ్వంసం చేసి, లోయలో పూర్తిగా హిందుత్వను తుడిచిపెట్టాలని ప్రయత్నం చేశారు. అందుకే ఈ కాలాన్ని కశ్మీర్ చరిత్రలో 'అంధ యుగమ'ని పేర్కొంటారు. అనేక బ్రాహ్మణ కుటుంబాలకు చెందినవారిని వారు హింసించి మరీ ఇస్లాంలోకి మార్చారు. ప్రతి రోజూ వెయ్యిమంది హిందూ పండిట్లను హింసించడం, వారిని ఇస్లామ్ మతంలోకి తీసుకువచ్చేందుకు బలవంతంగా గోమాంసం తినిపించడం చేసేవారు. వేలాది గోవులను ప్రతివారం వధించేవారు. ఈ హింసను, అకృత్యాలను భరించలేకపోయిన పండిట్లు పెద్ద సంఖ్యలో లోయను వదిలి వలసమార్గం పట్టారు.

మూడవ విడత వలసలు మొగలుల పాలనా కాలంలో క్రీ.శ. 1585 నుంచి 1753 మధ్య చోటు చేసుకున్నాయి. ఉదారవాది, అత్యంత గొప్పవాడని మనం చరిత్రలో చదువుకున్న అక్బర్ దీన్-ఇ-ఇలాహిని స్థాపించిన తర్వాత కశ్మీరీ పండిట్లు తిరిగి కశ్మీర్‌కు వెళ్లి తమ మతాన్ని అనుసరించేందుకు అనుమతిచ్చాడు. తిరిగి వెళ్లిన పండిట్లు తమ జన్మ భూమికి వచ్చిన ఆనందాన్ని పూర్తిగా అనుభవించక ముందే, అతడి కుమారుడైన జహంగీర్ తిరిగి వారిపై అత్యాచారాలను ప్రారంభించాడు. ఆ తర్వాత వచ్చిన షాజహాన్, ఔరంగజేబులు కూడా కశ్మీరీ పండిట్ల సామూహిక హత్యలు, హింసలకు అనుమతించారు. క్రూరుడైన ఔరంగజేబు ఈ మతమార్పిడి కార్యక్రమాలకు అడ్డుపడతారనే భావనతో హిందూ పండితులను చంపించాడు. దీనితో వేలమంది మతం మార్చుకోవడమో లేక ఆ ప్రాంతాన్ని వదిలి పారిపోవడమో జరిగింది. ఫలితంగా కశ్మీరీ పండిట్ల సంస్కృతిని ఇస్లామిక్ పాలకులు ధ్వంసం చేస్తున్న క్రమంలో తమ ధర్మాన్ని, మతాన్ని కాపాడుకునేందుకు పండిట్లు కశ్మీర్‌ను వదిలి పారిపోయారు.

నాలుగవ విడత వలసలు 1753లో ఆఫ్ఘాన్ గవర్నర్ల పాలనా కాలంలో చోటు చేసుకున్నాయి. ఆటవిక పద్ధతుల్లో, నిర్దాక్షిణ్యంగా వారు పాల్పడిన హింస కారణంగా కశ్మీరీ పండిట్లు ఉద్వేగపూరితమైన, ఆధ్యాత్మికమైన ఆవేదనను అనుభవించవలసి వచ్చింది. ముఖ్యంగా కశ్మీరీ బ్రాహ్మణులను మతం మార్చేందుకు వారు అత్యంత క్రూరమైన, అమానవీయమైన, బర్బరీకమైన పద్ధతులను అవలంబించారు. వారి కిరాతక పద్ధతులు ఏ స్థాయికి చేరాయంటే హిందువులను గోనె సంచుల్లో కట్టేసి దాల్ సరస్సులో సజీవంగా విసిరివేసేంత వరకూ వెళ్లాయి. భీతిల్లిన, బాధిత హిందువులు దేశం వదిలిపారిపోవడమో, మరణించడమో లేక ఇస్లాంను స్వీకరించడమో జరిగేది. ఆ బర్బరీకుల కళ్లు తమ కుమార్తెల మీద ఎక్కడ పడతాయో అని హిందూ తల్లిదండ్రులు తమ కుమార్తెల ముక్కు, చెవులు కోయడం, గుండు గీయించడం వంటివి చేసేవారట. కశ్మీర్‌లోని సారస్వత బ్రాహ్మణులను కూడా గడ్డం పెంచుకోవాలని




ఒత్తిడి చేయడమే కాక తిలక ధారణను అడ్డుకున్నారు. అఫ్ఘాన్ గవర్నర్ల పాలనను అంతం చేస్తూ సిక్కులు కశ్మీర్‌పై విజయం సాధించిన తర్వాత ఈ వలసలు ఆగడమే కాదు కాస్త శాంతి ఏర్పడింది.

ఐదవ విడత వలసలు 1900 మొదటి కాలంలో చోటు చేసుకున్నాయి. సిక్కులు అధికారాన్ని చేపట్టిన తర్వాత పండిట్ బీర్బల్ ధర్ కారణంగా మహారాజా రంజిత్ సింగ్ జమ్ము, కశ్మీర్‌లో హిందూ ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పాటు చేయగలిగాడు. ఈ సమయంలో మతసామరస్యం కొనసాగింది. ఇదే కాలంలో అనేకమంది ఇస్లామిక్ పాలకులు తిరగబడి ఒక సంస్థను ఏర్పాటు చేశాయి. దీనికి తర్వాత కాలంలో ముస్లిం రీడింగ్ రూమ్ అన్న పేరు వచ్చింది.

వారంతా కూడా విద్యావంతులైన కశ్మీరీ పండిట్లు ప్రభుత్వంలో ఉన్నత స్థాయి పదవుల్లో ఉండి, మంచి జీవితాన్ని అనుభవిస్తున్నందుకు అసహనానికి, అసూయకు లోనయ్యారు. ఫలితంగా జులై 13,1931 కశ్మీరీ పండిట్ల జీవితంలో ఒక చీకటి దినం అయింది. కశ్మీరీ ముస్లింలు శ్రీనగర్‌లోని పండిట్ల ఇండ్లపై దాడి చేసి, లూటీ చేసి, హత్యలు చేసి వారి ఆస్తులను చేజిక్కించుకున్నారు. దీని ఫలితంగా తర్వాత డోగ్రా పాలకులు అధికారంలోకి వచ్చినప్పటికీ కశ్మీరీ పండిట్లకు ఏ హక్కులూ లేకుండా పోయాయి.

స్వాతంత్ర్యానంతరం కూడా దేశమంతా వేడుకలు జరుపుకుంటున్నా, కశ్మీరీ పండిట్లు ఆ పని చేయలేకపోయారు. అందుకు కారణం కశ్మీర్‌పై పాకిస్తాన్ దాడి చేయడమే. ఫలితంగా వేలాదిమంది కశ్మీరీ పండిట్లు తమ స్వంత ఇళ్లను వదిలి శ్రీనగర్‌లో తలదాచుకోవడానికి వచ్చారు. స్వాతంత్ర్యానంతరం కూడా ఈ వలసలు ఏదో ఒకస్థాయిలో కొనసాగు తూనే ఉండటానికి కారణం వారికి కశ్మీర్‌లో ఎటువంటి హక్కులు, అవకాశాలు లేకపోవడమే.

ఆరవ విడత వలసలకు కారణాలు కూడా భిన్నమైనవి కావు. నాటి పాలకుడైన గుల్‌షా పాలనలో కర్ఫ్యూ విధించిన కాలమే ఎక్కువ కావడంతో, అతడిని తర్వాతి కాలంలో 'గుల్ కర్ఫ్యూ' అని పిలిచేవారట. తమ పరిస్థితిపై కశ్మీరీ హిందువుల నిరసన ప్రదర్శించిన ప్రతిసారీ వారిపై హింస, ఆలయాల ధ్వంసం జరిగేవి. ఈ ఘటనలతో కశ్మీర్ అనేది ముస్లింల భూమి అయిందని, అక్కడ ఉండటం కశ్మీరీ హిందువులకు సురక్షితం కాదని వారికి అర్థం అయింది. ఈ క్రమంలోనే వారి వలసలు ప్రారంభం అయ్యాయి. ఈసారి వారు ఢిల్లీ, అలహాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లారు. అనేకమంది లోయ నుంచి కాలినడకన వెళ్లారు.

మనం చెప్పుకోబోయే ఏడవ విడత వలసలే ముందు తరానికి, ఈ తరానికి తెలిసిన వలసలు. కారణాలు శతాబ్దాల కిందటివే.. అదే ప్రవృత్తి అక్కడి ముస్లింలలో కొనసాగడం. అందుకు పాకిస్తాన్ వత్తాసు పలికి, తోడ్పాటు ఇవ్వడం. పాక్ ముస్లిం దేశం కనుక తామంతా ఒక తానులో ముక్కలమనే భావన కశ్మీరీ ముస్లింలలో బాగా నింపడంతో ఆధునిక కాలంలో అనేక ఆటవిక, అమానవీయ, క్రూర, నిర్దాక్షిణ్య ఘటనలు చేసుకున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాన్ని వదిలి పారిపోయిన పండిట్ల సంఖ్యపై అనేకవాదనలు ఉన్నప్పటికీ, స్థూలం 3లక్షల 50వేల మంది 1990లో తమకున్నదంతా వదిలివేసి, తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పారిపోయారు.

కశ్మీర్‌కు భారత్‌నుంచి విముక్తి కల్పించాలన్న భావనను నాటి యువత బుర్రల్లోకి పాక్ ఎక్కించిన ఫలితంగా అక్కడ హింస నిత్యకృత్యమైంది. 'జాలిమ్ ఓ కాఫిరో, కశ్మీర్ హమారా ఛోడ్ దో' (దయలేని కాఫిరులారా మా కశ్మీర్‌ను వదిలిపొండి); 'కశ్మీర్ మె అగర్ రెహనా హై, అల్లా హొ అక్బర్ కెహనా హొగా' (స్థూలంగా దీనర్థం – ఇక్కడ ఉండాలంటే ఇస్లాం మతం పుచ్చుకో), 'లా షర్కియా లా ఘర్బియా, ఇస్లామియా! ఇస్లామియా! (తూర్పు నుంచి పశ్చిమం వరకూ ఇస్లాం మాత్రమే ఉంటుంది); 'ముసల్మానోం జాగో, కాఫిరో భాగో' (ముస్లింలలారా నిద్రలేవండి, కాఫీర్లలారా పారిపొండి), 'కశ్మీర్ బనేగా పాకిస్తాన్' (కశ్మీర్ పాకిస్తాన్ అవుతుంది), 'పాకిస్తాన్ సె క్యా రిష్తా? లా ఇలాహ్–ఎ–ఇల్లాహ్ ( పాకిస్తాన్‌తో మా సంబంధాన్ని ఇస్లాం నిర్వచిస్తుంది); దీనితో పాటు కశ్మీరీ పండిట్ పురుషులు కాకుండా వారి మహిళలతో కలిపి కశ్మీర్‌ను పాకిస్తాన్‌గా మారుస్తాం, మనసులో అల్లా చేతిలో కలష్నికోవ్ వంటి అనేక నినాదాలతో కశ్మీరీ పండిట్లపై అంతిమ దాడి ప్రారంభమైంది.

పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, టర్కీ, సూడాన్ సహా అనేక దేశాలకు చెందిన క్రూరులైన ఉగ్రవాదులు రకరకాల సంస్థల పేర్లతో లోయలోకి ప్రవేశించారు. కాగా, అఫ్తాబ్ అనే స్థానిక ఉర్దూ పత్రికలో జనవరి 4, 1990న కశ్మీరీ పండిట్లంతా లోయను తక్షణమే విడిచివెళ్లాలంటూ హిజ్బుల్ ముజాహిదీన్ ప్రకటన విడుదల చేసింది. తర్వాత అల్ సఫా అనే మరొక స్థానిక పత్రిక ఇదే హెచ్చరికను ప్రచురించింది. అనంతరం, ముసుగులతో, ఖలష్నికోవ్‌లు ధరించిన తీవ్రవాదులు సైనిక తరహా కవాతులను వీధులలో నిర్వహించడం ప్రారంభించారు.

బాంబు పేలుళ్లు, కశ్మీరీ పండిట్ల హత్యలు, పండిట్ మహిళలపై అత్యాచారాలు నిత్యకృత్య మయ్యాయి. దీనితోపాటుగా, మసీదుల నుంచి మైకుల ద్వారా రెచ్చగొట్టే ఉపన్యాసాలు విరామం లేకుండా రోజంతా ప్రసారం కావడం ప్రారంభమైంది. ఇటువంటి ప్రచారాన్ని కలిగిన ఆడియో కేసెట్లను లోయంతా వినిపించి, అప్పటికే భయంతో వణికిపోతున్న కశ్మీరీ పండిట్ సమాజాన్ని మరింత భీతిల్లేలా చేశారు. ఈ వార్తలు వస్తున్నప్పటికీ, హిందువులను కాపాడకుండా ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం చేతులు ఎత్తేసింది.



కశ్మీరీ పండిట్ల జీవితంలో జనవరి 19, 1990 కాళరాత్రి. క్రూర అఫ్ఘాన్ పాలకుల హింస తర్వాత అంత ఆటవికంగా కశ్మీరీ పండిట్ల మనసులపై ప్రతికూల ముద్రవేసిన ఘట్టం ఇదే. ఆ రాత్రి లోయలో ఉండి ఆ భయాన్ని అనుభవించిన వారెవరూ కూడా తమ జీవితకాలంలో దానిని మరచిపోలేరని బాధితులు చెబుతుంటారు. ఆ భయాన్ని అనుభవించి, పారిపోయి వచ్చినప్పటికీ మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నవారు, ఇప్పటికీ పీడకలలను కనేవారు ఉన్నారు. ఈ ఘటనల క్రమంలో నాటి ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా పరిస్థితులను అదుపులోకి తెచ్చి, నిందితులను శిక్షించే పని చేయకుండా, తన పదవికి రాజీనామా చేసేసి చేతులు దులిపేసుకున్నారు.





Hundreds of people joined the funeral procession of assassinated BJP leader, Mr. Tika Lal Taploo, in Srinagar on Friday. Inset: body of the deceased. —KT Photo

**Tearful farewell to Taploo**

అప్పుడే జగమోహన్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని కొంత అదుపులోకి తెచ్చేందుకు కర్ఫ్యూను విధించినప్పటికీ, దాని ప్రభావం లేకుండా పోయింది. పండిట్లకు వ్యతిరేకంగా జిహాద్ చేసేందుకు బయటకు రావలసిందిగా మసీదు నుంచి ప్రకటనలు ప్రారంభం అయ్యాయి. జెకెఎల్‌ఎఫ్ సాయుధదళాలు వీధిలో కవాతు చేస్తూ లోయలో మైనార్టీలు అయిన అటు హిందువుల, ఇటు సిక్కులనూ తీవ్రభయాందోళనలకు గురి చేశారు. ఆ రాత్రి ఇస్లామిస్టుల నినాదాలతో లోయ దదరిల్లిపోయింది. హిందూ, ముస్లిం వర్గాల మధ్య ద్వేషాన్ని రగిల్చే, ముస్లింలను హిందువులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే నినాదాలతో, పాటలతో లోయలో మరణమృదంగం మోగింది.

సెక్యులర్, ఉదారవాద, శాంతియుత, సంస్కార వంతమైన, విద్యావంతమైన కశ్మీరీ ముస్లింలంటూ, భారతీయ మేధావులు, మీడియా వర్గాలు అభివర్ణించే వీరంతా కూడా ఈ సామూహిక ఉన్మాదంలో తమ ముఖానికి తగిలించుకున్న మాస్కులను పీకి అవతల పడేశారు. ఏళ్ల తరబడి పక్క పక్క ఇళ్ల లోనే జీవించినా పండిట్లు ఎవరో తమకు తెలియనట్టుగా అనేకమంది కశ్మీరీ ముస్లింలు వ్యవహరించారు. స్వతంత్ర భారతదేశంలో ఉన్మాదంతో కూడిన తీవ్రవాద మూకలు చుట్టుముట్టగా అనాథలులాగా తమ జన్మభూమిలో కశ్మీరీ పండిట్లు ఆ కాళరాత్రిని వెళ్లదీయవలసి వచ్చింది. ఈ రాత్రే వారు సహనం లేని ఇస్లాం తీవ్రవాద వాస్తవ ముఖాన్ని చూశారు. మేధావులు ప్రచారం చేసే 'కశ్మీరియత్' అన్న సంప్రదాయానికి పూర్తి విరుద్ధమైన ప్రవర్తనను వారు చూశారు. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం, ఏజెన్సీలు, సైన్యం, పారామిలటరీ దళాలూ కూడా ఈ మొత్తం గందరగోళంలో తాము కలుగచేసుకోలేమన్నట్టుగా వ్యవహరించాయి. ముఖ్యంగా, సైనిక దళాలు తమ ఎదుటే అంత అమానవీయ ఘట్టాలు చోటు చేసుకుంటున్నా, తమకు ఉత్తర్వులు జారీ కాలేదన్న సాకుతో కలుగచేసుకోలేదంటే అర్థం ఏమిటి?

ఇస్లామిక్ తీవ్రవాదులకు చిక్కకుండా, ప్రాణాలరచేతిలో పెట్టుకుని కంటిమీద రెప్పవేయ కుండా ఒకరికొకరు అన్నట్టుగా తెల్లవారే వరకూ జాగారం చేసిన పండిట్లు లోయవదిలి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే అనేకమంది తీవ్రవాద మూకల చేతిలో ప్రాణాలు విడిచారు. తెల్లారేసరికి కశ్మీరీ ముస్లింల ఉద్దేశం వారికి మరింత విశదంగా అర్థమైంది. ఏ గోడల మీద 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ కశ్మీర్' అంటూ పెద్ద అక్షరాలతో రాతలు, లోయను ఇస్లామీకరిస్తామంటూ దినపత్రికల్లో పెద్ద పెద్ద ప్రకటనలతో బలవంతంగా పండిట్లు లోయ వదిలి వెళ్లిపోయేలా బెదిరించారు.

కశ్మీరీ పండిట్ల నిర్మూలన, మారణహోమానికి పాక్ ఉగ్రవాదులతో కలిసి ఇక్కడి రాజకీయ నాయకులు చేసిన దుర్మార్గాలను దేశం పట్ల ప్రేమ, మానవత్వం, మానవహక్కుల పట్ల గౌరవం కలిగిన ఎవరూ మరచిపోరు. ఇస్లామిక్ తీవ్రవాదులు పెట్టే హింసలను, అత్యాచారాలను తాళలేక అన్నీ వదులుకొని వచ్చిన కశ్మీరీ పండిట్లు అనేకమంది ఢిల్లీలోని శరణార్థ శిబిరాలలో జీవితం వెళ్లదీస్తు న్నారు. ఆర్థిక స్థితి బాగున్నవారు, బంధువులు, స్నేహితులు సాయం చేసినవారు కొంత మెరుగైన జీవితాన్ని గడుపుతున్నా, శిబిరాలలో వారి పరిస్థితి అమానవీ యమే. తమ పరిస్థితిని పట్టించుకోమని వారు ఎన్ని విజ్ఞప్తులు చేసినా, మొన్నటి వరకూ అధికారంలో ఉన్న ఏ రాజకీయ పార్టీ పట్టించుకో లేదు. ఆఖరుకు దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా తమపై జరిగిన అత్యాచారాలను విచారించమని కోరినా చాలాకాలం గడిచిపోయిందనే సాకుతో తిరస్క రించింది. చిత్రమేమిటంటే, లోయలో 1947లో 10శాతంగా ఉన్న కశ్మీరీ పండిట్ల శాతం 1989 నాటికి 5శాతానికి పడిపోగా, నేడు 0.5 నుంచి 1 శాతం మధ్య ఊగిసలాడుతోంది. కానీ ఈ వాస్తవాలు ఎవరికీ పట్టకపోవడం అతిపెద్ద విషాదం.

యూదులపై జరిగిన మారణహోమం ఒక కాలం మలుపులో జరిగినదే. అనంతర కాలంలో వారికి జరిగిన అన్యాయాలను ప్రపంచం విన్నది, అర్థం చేసుకున్నది, వాస్తవమని బాధితులకు ఊరటనిచ్చింది. కానీ శతాబ్దాలుగా కశ్మీరీ హిందువు లపై దాడులు, అత్యాచారాలు, మారణహోమాలు జరుగుతున్నా ప్రపంచం సరే, నేటికీ వామపక్ష మేధావులు సహా మానవహక్కుల కోసం పని చేస్తున్నా మని చెప్పుకునేవారు ఎవరూ మాట్లాడకపోవడం దురదృష్టకరం. ★




పండిట్ల నిర్మూలన, మారణహోమానికి పాక్ ఉగ్రవాదులతో కలిసి ఇక్కడి రాజకీయ నాయకులు చేసిన దుర్మార్గాలను దేశం పట్ల ప్రేమ, మానవత్వం, మానవహక్కుల పట్ల గౌరవం కలిగిన ఎవరూ మరచిపోరు.


**దుశ్చర్య**

**నరేంద్ర ప్రభుత్వం పట్ల కంటగింపుగా ఉన్న వారి కుట్రలు తారస్థాయికి చేరుతున్నాయని చెప్పడానికి సరైన ఉదాహరణ డిసెంబర్ 13, 2023న లోక్‌సభలో జరిగిన ఉదంతం. 22 ఏళ్ల క్రితం 2001లో సరిగ్గా ఇదే రోజున పార్లమెంట్ బయట నుంచి పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాదులు దాడి చేశారు. ఇప్పుడు బీజేపీ, మోదీ వ్యతిరేక శక్తులు లోపలికి ప్రవేశించి అల్లరి సృష్టించాయి. ఇది నిస్సందేహంగా భద్రతా వైఫల్యమని ప్రధాని మోదీ అంగీకరించారు. బుద్ధితక్కువ ప్రణాళికతో పెద్ద ప్రయోజనం సాధించడానికి వేసిన చౌకబారు ఎత్తు ఇది.**



# బయటపడుతున్న

కానీ అది అత్యున్నత చట్టసభకు అసలు పొగబాంబు విసరడం కాకుండా, ఒంటికి నిప్పంటించుకుని పెద్ద గందరగోళానికే దుండగులు పథకం వేశారని ఢిల్లీ పోలీసులు బయటపెట్టారు. నిప్పంటించుకున్న తరువాత కరపత్రాలు వెదజల్లాలని అనుకున్నారని కూడా పోలీసు శాఖ తెలియచేసింది. కేవలం నిరుద్యోగం, యువతలో అసంతృప్తి వంటి అంశాలనే దేశం దృష్టికి తీసుకురావాలన్నదే ఆగంతకుల ఉద్దేశమే అయితే, రాజస్తాన్‌లోని నాగౌర్ వెళ్లిన దర్యాప్తు బృందానికి ధ్వంసం చేసిన ఆధారాలు ఎందుకు దొరికాయి? ఈ కేసులో కీలకంగా ఉన్న లలిత్ ఝా రాజస్తాన్‌లోని మరొక అనుమానితుడు మహేశ్ కుమావత్ దగ్గరకు తీసుకువెళ్లినప్పుడు ఆధారాలు ధ్వంసమైన విషయం బయటపడింది. ఈ కేసులో ఎప్పటిలాగే విపక్షం అత్యంత హీనంగా, బాధ్యతా రాహిత్యంతోనే వ్యవహరించింది. లోక్‌సభ మీద పొగబాంబులతో దాడికి దిగడం కేవలం నిరసన కిందకే వస్తుందా? అది ఉగ్రవాదం అనిపించుకోదా? ఇది కూడా గుర్తించకుండా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దుండగుల తరఫున వత్తాసు పలుకుతున్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో విపక్షాలు యథాప్రకారం రాజకీయం చేస్తున్నాయి. మోదీని గద్దె దింపడమే లక్ష్యంగా సాగిన రైతు ఉద్యమంలో కనిపించిన వారు, ఎస్ఎఫ్ఐ కార్యకర్త, తీస్తా సెతల్వాద్ సన్నిహితులు వీరి వెనుక ఉన్నట్టు ప్రాథమిక దర్యాప్తులోనే తెలిసిపోయింది. ముందు ముందు ఎన్ని భయానక వాస్తవాలు బయట పడతాయో!




**రాజనాల బాలకృష్ణ**
సీనియర్ జర్నలిస్ట్


ప్రస్తుతానికి ఇది నిర్ధారణ కానీ నిజం. అనుమానం మాత్రమే కావచ్చును. కానీ, డిసెంబర్ 13 లోక్‌సభ లోపల, పార్లమెంట్ ప్రాంగణంలో ఆగంతకులు సృష్టించిన అలజడికి సంబంధించి, సోషల్ మీడియా సాక్షిగా మెజారిటీ ప్రజలు ఇది 'అదృశ్య హస్తం' పనే అనే నిర్ధారణకు వచ్చారు. దేశ వ్యాప్తంగా అన్ని టీవీ చర్చల్లో వ్యక్తమవుతున్న అభిప్రాయాలను, సాగుతున్న విచారణను గమనిస్తే, అనుమానాలను నిజాలుగా నిరూపించే ఆధారాలు వెలుగు చూస్తున్నాయి.

పార్లమెంట్ ఘటనకు సంబంధించి విభిన్న కోణాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నా, ఈ వ్యాసం రాసే సమయానికి, ఆ ఘటనకు సంబంధించి, అధికారికంగా ఎలాంటి స్పష్టత రాలేదు. ఏదీ ఇదమిత్థంగా నిర్ధారణ కాలేదు. అయితే, వ్యక్తమవుతున్న అనుమానాలు పూర్తిగా నిరాధారమైనవా? అంటే కాదు. అన్నీ కాకపోయినా, కొన్ని నిర్దిష్ట అనుమానాలకు బలమైన ఆధారాలే కనిపిస్తున్నాయి. అందుకే పార్లమెంట్ ఘటనకు వెనక, 'అదృశ్య హస్తం' ఉందనే అనుమానాన్ని, మామూలు జనం మొదలు మేధావుల వరకు ప్రతి ఒక్కరు రుజువు కాని నిజంగా గుర్తిస్తున్నారు. ఇందులో అత్యంత నీచంగా కనిపిస్తున్న అంశం– మహాత్యాగి భగత్‌సింగ్ పేరును కుట్రదారులు ఉపయోగించుకున్నారు. దీనిని ఖండించడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు.

**అదొక దుర్దినం**

డిసెంబర్ 13 అంటేనే, అదొక దుర్దినం. 22 ఏళ్ల క్రితం 2001లో ఇదే డిసెంబర్ 13, పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగింది. ఆ రోజున భద్రతా దళాల వేషంలో వచ్చి దుండగులు తొమ్మిది మంది సిబ్బందిని పొట్టన పెట్టుకున్నారు. ఆ గాయాలు ఇంకా మాయనే లేదు. ఆ మచ్చలు ఇంకా మిగిలే ఉన్నాయి. ఇంతలోనే, ఈ డిసెంబర్ 13న, ఆనాటి అమరవీరులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సారథ్యంలో జాతి మొత్తం నివాళులు అర్పించిన కొద్దిసేపటికే, పాత గాయాన్ని మళ్లీ రేపారు. పార్లమెంట్ భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ ఆగంతకులు పార్లమెంట్ లోపల వెలుపల అల్లరి సృష్టించారు. ఆనాటి విషాదాన్ని గుర్తుకు తెచ్చిన ఈ ఘటన సహజంగానే, అందరిలో ఆందోళన కలిగించింది. 'ఇది మరో ఉగ్రదాడి కాదు కదా' అనే అనుమానాలకు ఆస్కారం కల్పించింది. మరోవంక, డిసెంబర్ 13న లేదా అంతకు ముందుగా, 2001 డిసెంబర్ 13 పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడిని గుర్తు చేస్తామంటూ ఖలిస్తానీ తీవ్రవాది పన్నూ ఇటీవల చేసిన హెచ్చరిక అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది. అయితే, ప్రాథమిక సమాచారం మేరకు, లోక్ సభ

# అదృశ్య 'హస్తం'?

ఘటనకు, ఆ తీవ్రవాది హెచ్చరికకు సంబంధం లేదని తెలుస్తోందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉగ్రవాద కోణం లేదని కాదు కానీ లేక పోవచ్చును అంటూ ఊరడించారు.

**గతంలోనూ ...**

ఇలాటి ఘటనలు జరగడం ఇదే మొదటిసారి కాదు. గతంలో 1994లో, ఒకే సంవత్సరంలో రెండుసార్లు ఇదే తరహాలో లోక్‌సభలో దుండగులు, సందర్శకుల గ్యాలరీ నుంచి సభలోకి దూకి అలజడి సృష్టించారు. అప్పటి ప్రభుత్వం, ప్రతిపక్షం కూడా ఆ ఘటనలను పెద్దగా పట్టించుకోలేదు. తొలిసారి ఆగంతకుని గట్టిగా మందలించి వదిలేశారు. రెండోసారి రెండురోజుల కారాగార శిక్ష విధించి తిహార్ జైలుకు తరలించారు. అంతేకానీ, ఆ ఆగంతకులు ఎవరు? ఏమిటీ? అంశాలపై లోతైన న్యాయనిపుణులు చెపుతున్నారు. అందరూ అనుకుంటున్నట్లుగా, విపక్షాలు ఆరోపిస్తున్నట్లు ప్రభుత్వం ఈ ఘటనను తేలిగ్గా తీసుకోలేదు. కఠిన చర్యలకు నడుం బిగించింది. సమస్య శాశ్వత పరిష్కారం వైపుగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఆగంతకులకు సందర్శకుల పాస్ ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ విషయంలోనూ చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు వెనకాడేది లేదని, బీజేపీ నాయకత్వం స్పష్టం చేసింది. ఒక విధంగా చూస్తే, ఈ విషయంలోనూ పార్లమెంట్ ఉభయసభల్లో అనవసర రాద్ధాంతం చేసిన విపక్షాలు, ఆనవాయితీ తప్పకుండా భంగపాటును కొనితెచ్చు కున్నారు.

**పకడ్బందీ వ్యూహంతో దాడి**

ఈ ఘటనపై విచారణ రేపు ఏ మలుపు తిరుగు తుందో! ఎలాంటి విషాద నిజాలు బయటకు వస్తాయో! అనే భయం అందరిలో వ్యక్తమవుతోంది.

మేధావుల వరకు 'అదృశ్య హస్తం'పై అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ప్రాథమిక విచారణలో వెలుగు చూసిన విషయాలు, ముఖ్యంగా తెరపై కనిపిస్తున్న ఆ ఆరుగురు ఆగంతకుల రాజకీయ, ఆర్థిక, సామాజిక నేపథ్యాన్ని పరిశీలిస్తే అనుమానాలు మరింతగా బలపడుతున్నాయని అంటున్నారు.

**తీగ లాగితే..**

ఈ మొత్తం వ్యవహారానికి సూత్రధారిగా అనుమానిస్తున్న, లలిత్ ఝాకు నక్సల్స్‌తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. పీయూసిఎల్(పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) పూర్వ బంధాలతో పాటుగా, పశ్చిమ బెంగాల్‌లోని జంగల్ మహల్ ప్రాంతంలో చాలావరకు చల్లారిన నక్సల్స్ అగ్గిని తిరిగి రగిల్చేందుకు, ఎన్జీఓల ముసుగులో సాగుతున్న ప్రయత్నాల్లో ఈ 'మాస్టర్జీ'కి భాగస్వామ్యం ఉన్నట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. విద్యార్థులను ఆకర్షించే లక్ష్యంతో కోల్‌కతాలో రద్దీగా ఉండే రవీంద్ర రోడ్‌లో 'ట్యూషన్' ఇనిస్టిట్యూట్ నడిపిన లలిత్ ఝాను అక్కడి ప్రజలు 'మాస్టర్జీ' అని పిలుస్తారు. ట్యూషన్స్ పేరుతో విద్యార్థులను చేరదీసి,



సాగర్ శర్మ



మనోరంజన్



నీలంసింఘ్



అమోల్ షిండే



లలిత్ ఝా

విచారణ జరగలేదు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలపై దృష్టి పెట్టలేదు.

ప్రస్తుతానికి వస్తే, నరేంద్రమోదీ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయాల్సిందిగా కేంద్ర హోంశాఖ కార్యదర్శికి స్పీకర్ లేఖ రాశారు. ఈ మేరకు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీశ్ దయాళ్ సింగ్ నేతృత్వంలో కేంద్ర హోంశాఖ దర్యాప్తు సంఘాన్ని నియమించింది. అంతే కాదు. మళ్లీ ఇలాంటి దుశ్చర్యలకు ఆస్కారం లేకుండా ఢిల్లీ పోలీసులు దుండగులపై, చట్ట వ్యతిరేక కార్య కలాపాల నిరోధక చట్టం (యుఏపీఏ) కింద కేసులు పెట్టి, ఒక్కొక్కరినీ కోర్టు ఎదుట హాజరు పరిచారు. కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకున్నారు. చీకటి కోణాలను వెలికి తీస్తున్నారు. మరో వంక ఈ చట్టం పరిధిలో, బెయిల్ రావాడానికి కనీసం ఆరునెలల నుంచి సంవత్సరం వరకు ఆగవలసి ఉంటుందని జరుగుతున్న పరిణామాలను గమనిస్తే, డిసెంబర్ 13 ఘటన అల్లరి చిల్లర వ్యవహారం కాదని అనిపిస్తుంది. పకడ్బందీ వ్యూహంతో పాత్రధారులను ముందుపెట్టి, వెనకనుంచి సూత్రధారులు జరిపించిన రాజకీయ కుట్రగానే ఈ ఘటనను చూడవలసి ఉంటుంది. అందుకే, ఎన్ని కోణాల్లో చర్చ జరిగినా, ఇప్పడు దేశంలో ప్రధానంగా ఒకటే ప్రశ్న వినిపిస్తోంది. 'పార్లమెంట్' ఘటనకు ఎవరు బాధ్యులు? తెరపైన కనిపిస్తున్న ఆగంతకులే ఇంతటి సాహసం చేశారా? లేక తెర వెనక ఇంకెవరైనా ఉన్నారా? ఉంటే ఆ 'అదృశ్య హస్తం', ఎవరిది..? అనే ప్రశ్నే ఇప్పుడు దేశం ముందు ప్రధానంగా నిలిచింది.

ప్రజాస్వామ్య దేవాలయంగా, దేశ సార్వ భౌమత్వానికి ప్రతీకగా భావించే పార్లమెంట్ ప్రతిష్టను దిగజార్చే దుర్మార్గానికి పూనుకున్నది ఎవరు? ఆ ఆగంతకుల ఆర్థిక, సామాజిక స్థితిగతులు వెలుగు లోకి వచ్చిన నేపథ్యంలో సామాన్యుల నుంచి

వారిని అడవి బాట పట్టించే, రిక్రూట్‌మెంట్' బాధ్యతలో 'మాస్టర్జీ' ఉన్నారనే నిజం అప్పట్లో పెద్దగా ఎవరికీ తెలిసినట్లు లేదు. వచ్చిపోయేవాళ్లు అందరూ విద్యార్థులో, వారి తల్లి తండ్రులో అనుకున్నారు కానీ, వారిలో అడవి అన్నలు, అర్బన్ నక్సల్స్, సానుభూతి పరులు ఉన్నారనే విషయాన్ని గుర్తించలేదు. మీడియా కథనాలను బట్టి ఇప్పుడిప్పుడే 'మాస్టర్జీ' లీలలు వెలుగులోకి వస్తున్నాయి.

పార్లమెంట్ ప్రాంగణంలో అలజడి సృష్టించిన 42 ఏళ్ల జేఎన్‌యూ 'శాశ్వత' విద్యార్థిని నీలమ్ రైతుల ఆందోళన, మహిళా రెజ్లర్ల ఆందోళనలో కీలక భూమిక పోషించినట్లు వస్తున్న ఫొటో ఫీచర్స్ సూచిస్తున్నాయి. ఆందోళనలను వృత్తిగా ఎంచుకున్న ఆమె జేఎన్‌యూ తుకడే తుకడే గ్యాంగ్ సాగించే దేశ ద్రోహ కార్యక్రమాలలోనూ క్రియాశీల పాత్రను పోషిస్తున్నారని, ఇటు సోషల్ మీడియాలో అటు మెయిన్ స్ట్రీమ్ మీడియాలోనూ కథనాలు వస్తున్నాయి.

అమోల్ షిండే విషయానికి వస్తే, చాలా విచిత్రమైన లింకులు బయటకు వస్తున్నాయి. ప్రత్యక్షంగా కాకపోయినా షిండేకు పరోక్షంగా తీస్తా సెతల్వాద్‌తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. తీస్తా సెతల్వాద్ ఎవరో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. గుజరాత్ అల్లర్ల నేపథ్యంలో నాడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని జైలుకు పంపేందుకు శతవిధాలా ప్రయత్నించిన న్యాయవాది, సామాజిక కార్యకర్త. అంతేకాదు, జాతీయవాద శక్తులను సమూలంగా తుడిచి వేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కుట్రలో ఆమె కీలక పాత్ర పోషించారు. తప్పుడు సాక్ష్యాలు సృష్టించి జైలుకు కూడా వెళ్లారు. ఆమెకు సన్నిహితంగా పనిచేసే పూణే న్యాయవాది అసిం సరోరే, పార్లమెంట్ ఘటనలో ముద్దాయిగా ఉన్న అమోల్ షిండే తరపున వాదించేందుకు స్వచ్ఛందంగా ఆయన ముందు కొచ్చారు. ఈ న్యాయవాదికి తీస్తా సెతల్వాద్‌తోనే కాదు.. రాహుల్ గాంధీతోనూ సంబంధాలున్నట్లు, రాహుల్ భారత జోడో యాత్రలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. తీగలాగితే డొంకంతా కదలడం అంటే ఇదేనేమో! ఈ అన్ని సంబంధ బాంధవ్యాలపై విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది.

**రాజకీయ కుట్ర**

లోక్‌సభ ఘటనకు సంబంధించి తెరపై కనిపిస్తున్న, సాగర్ శర్మ, మనోరంజన్, విక్కీ శర్మల ఇతర ఆగంతకులు రాజకీయ, సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని గమనిస్తే, అందులో ఏ ఒక్కరికి కూడా స్థిరమైన జీవనోపాధి లేదు. ఆర్థిక స్థిరత్వం లేదు. ఈ అన్నిటినీ మించి, అనేక ప్రాంతాలు అనేక రాష్ట్రాలకు చెందిన ఈ వ్యక్తులను ఎవరు కలిపారు? ఎలా కలిపారు? అనే కీలక ప్రశ్న లోతుల్లోకి వెళితే కుట్ర కోణం స్పష్టంగా బయటకు వస్తుంది. అందుతున్న సమాచారాన్ని తులనాత్మకంగా విశ్లేషిస్తే, ఈ దాడి వెనక జాతీయవాద వ్యతిరేక, బీజేపీ, మోదీ వ్యతిరేక, కాంగ్రెస్, రాహుల గాంధీ అనుకూల శక్తుల హస్తం ఉందనే అనుమానాలకు మరింతగా బలం చేకూరు తుంది. అందుకే, చాలా చిన్న ఘటనగా కనిపిస్తున్న పార్లమెంట్ ఘటన వెనక చాలా పెద్ద కుట్ర ఉందనే అనుమానాలు రోజు రోజుకు బలపడు తున్నాయి.




ప్రాథమిక విచారణలో వెలుగు చూసిన 'నిజాలు' అనుమానాలకు మరింత బలం చేకూరుస్తు న్నాయి.

అదృశ్య హస్తానికి, ఇప్పుడే నామకరణం చేయడం కుదరక పోవచ్చును. కానీ, పార్లమెంట్ ఘటన ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్, ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించిన తీరు గమనిస్తే, విపక్షాలు జాతీయ సమస్యలను రాజకీయ కోణంలో చూస్తున్నాయి. జాతి ప్రయోజనాల కంటే, రాజకీయ ప్రయోజనాలకే ఎత్తుపీట వేస్తున్నాయి అనే అభిప్రాయం బలపడుతోంది. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ అన్నట్లుగా, కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం దేశం ఏమైనా పర్వాలేదనే ధోరణిని అవలంబి స్తోందనే అభిప్రాయానికి ఈ దుర్ఘటన మరో కోణంలో అద్దం పడుతోంది. జేపీ చెప్పింది, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల గురించే అయినా, దేశ భద్రత విషయంలో అయినా, పార్లమెంట్ ప్రతిష్టను కాపాడే విషయంలో అయినా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ విషయంలో అయినా హస్తం పార్టీ పోకడ ఒకే తీరుగా ఉంటుందనేందుకు దీనిని మరో ఉదాహరణగా పేర్కొనవచ్చును.


**'రాగా' స్వరం మారింది**

అదలా ఉంటే, తాజాగా రాహుల్ గాంధీ స్వరం మారింది. ఇంతవరకు, పార్లమెంట్ భద్రతపై ఆందోళన వ్యక్తపరిచిన హస్తం పార్టీ ఆశాజ్యోతి రాగా, స్వరం మార్చి కొత్త రాగం ఎత్తుకున్నారు. 'సురక్షా బ్రీక్ హుయి హై.. వో హై...' అంటూ నాలుక మడతేసి తడబడుతూ కొత్త రాగం ఎత్తుకున్నారు. పార్లమెంట్ భద్రతకు భంగం కలిగిన మాట నిజమే కానీ, అందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విధానాలు కారణమని ప్లేటు ఫిరాయించారు. ఇంతవరకు పార్లమెంట్ భద్రతపై కన్నీళ్లు కార్చిన రాహుల్, ఇప్పుడు మోదీ విధానాల కారణంగా నిరుద్యోగం, ధరలు పెరిగిపోవడం వల్లనే యువత ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, ఆగంత కులను చర్యను పరోక్షంగా సమర్ధించారు. ఇక్కడ మరో విషయం ఏమంటే ... ఆయన నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ఫోకస్ పెట్టి, త్వరలో మరో విడత భారత జోడో యాత్రకు బయలుదేరుతున్నారు. ఇప్పుడు, ఆ యాత్రకు ముందు, జరిగిన పార్లమెంట్ ఘటనను, రాహుల్ గాంధీ యాత్ర ప్రచార అంశాలను జోడించి చూస్తే, పార్లమెంట్ ఘటన వెనుక పరోక్ష మద్దతు ఎవరిదో అంచనా వేయవచ్చు.

**కుట్ర అయినా ...**

అయితే, ఇది ఎవరి కుట్ర అయినా, ఈ కుట్ర వెనక ఎవరి హస్తం ఉన్నా, జరిగిన ఘటన పార్లమెంట్ భద్రతకు సంబంధించి, అనేక అనుమానాలకు ఆస్కారం కల్పించింది. అందుకే ..ఇది చిన్న విషయం కాదు. చిన్న తప్పిదం కాదు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో, ఆగంతకులు సభ లోపల వెలుపలా సృష్టించిన అలజడి, భద్రతా లోపాలను పట్టి చూపుతోంది.

ఆగంతకులు, పార్లమెంట్ ప్రాంగణంలో ప్రవేశించి, భద్రతా వలయాలను దాటు కుంటూ సందర్శకుల గ్యాలరీని చేరుకోవడం' ఆపైన, 17 అడుగుల ఎత్తు నుంచి సభలోకి దూకి అలజడి సృష్టించడం సామాన్య విషయంకాదు. నిస్సం దేహంగా, అది భద్రతా లోపం. అందులో మరో అభిప్రాయానికి ఆస్కారమే లేదు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే, పైపై పూతలతో పని కాదు. అవసరం అయితే, శస్త్ర చికిత్సకు అయినా సిద్ధం కాక తప్పదు. ★



అదృశ్య హస్తానికి, ఇప్పుడే నామకరణం చేయడం కుదరక పోవచ్చును. కానీ, పార్లమెంట్ ఘటన ప్రతిపక్షాల, ముఖ్యంగా కాంగ్రెస్, ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పందించిన తీరు గమనిస్తే, విపక్షాలు జాతీయ సమస్యలను రాజకీయ కోణంలో చూస్తున్నాయి. జాతి ప్రయోజనాల కంటే, రాజకీయ ప్రయోజనాలకే ఎత్తుపీట వస్తున్నాయి అనే అభిప్రాయం బలపడుతోంది.

రాజకీయాల్లో ఆశ్చర్యకర పరిణామాలు కొత్త కాదు.. కానీ కొన్ని అమితాశ్చర్యానికి గురి చేస్తాయి. మూడు రాష్ట్రాల్లో విజయకేతనం ఎగరేసిన బీజేపీ వాటి ముఖ్యమంత్రుల ఎంపికను కూడా ఆశ్చర్యానికి గురి చేసే విధంగానే చేసింది. సీనియర్ నేతలను కాదని కొత్త ముఖాలను తెర మీదకు తీసుకువచ్చింది. రాజస్తాన్‌లో భజన్‌లాల్ శర్మ, మధ్యప్రదేశ్‌లో మోహన్ యాదవ్, ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్ సాయ్‌లను ముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడంలో ఆసక్తికర అంశాలు కనిపిస్తున్నాయి.







# మూడు రాష్ట్రాలకు ముచ్చటైన ఎంపికలు

ముఖ్యమంత్రుల ఎంపిక కోసం బీజేపీ కాస్త సమయం తీసుకోవడం విశ్లేషకులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా సీఎంలు ఎవరన్నదానిపై స్పష్టత రాకపోవడం నేతలు, కార్యకర్తలను సందిగ్ధంలో పడేసింది. ఎందుకంటే ఆ రాష్ట్రాల్లో ఇప్పటికే ముఖ్యమంత్రులుగా పని చేసిన అనుభవం ఉన్న దిగ్గజాలు ఉన్నారు. అయినా సీఎంల ఎంపికలో ఆచితూచి వ్యవహరించింది జాతీయ నాయకత్వం. చివరకు అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ ఒక్కో రాష్ట్ర ముఖ్యమంత్రిని అధిష్ఠానం ప్రకటిస్తుంటే విస్తుపోవడం ప్రతిపక్షాల వంతయింది. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా తమ మార్కు చూపించారు. ఈ ఎంపికను గమనిస్తే అన్ని సమీకరణాలను పరిగణనలోకి తీసుకొని 2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**సామాజిక సమతూక మంత్రం**

మధ్యప్రదేశ్‌లో ఓబీసీ.. రాజస్థాన్‌లో బ్రాహ్మణుడు.. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనుడు.. బీజేపీ ముఖ్యమంత్రులుగా కొలువు దీరారు. బీజేపీ చెప్పే 'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' మంత్రానికి నిర్వచనం ఈ ఎంపిక.

మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాల్లో బలహీనవర్గాల ప్రభావం ఎక్కువ. మధ్యప్రదేశ్ జనాభాలో ఓబీసీ జనాభా యాభై శాతానికిపైనే. అందులో అరవై శాతం యాదవులే. బీజేపీ బీసీలకు సమున్నత స్థానం కల్పిస్తోందన్న సందేశం ప్రజల్లోకి వెళ్లేందుకు వీలుగా మధ్యప్రదేశ్‌లో బీసీ సామాజిక వర్గానికి చెందిన మోహన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసింది. పొరుగున ఉన్న ఉత్తర్ ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేశ్ యాదవ్, బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్‌కు చెందిన లాలు ప్రసాద్‌యాదవ్ బలమైన నాయకులుగా ఉన్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన వీరి ప్రభావం ఈ రెండు రాష్ట్రాలపై ఎక్కువగా ఉంది. ఇప్పుడు మధ్యప్రదేశ్‌కు మోహన్ యాదవ్‌ను ఎంపిక

## చాయ్‌వాలా కుమారుడు ముఖ్యమంత్రిగా..



మోహన్ యాదవ్

మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా దక్షిణ ఉజ్జయిని ఎమ్మెల్యే మోహన్ యాదవ్ (58) బాధ్యతలు చేపట్టారు. శివరాజ్‌సింగ్ మంత్రివర్గంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా మోహన్ యాదవ్ సేవలందించారు. శివరాజ్ ప్రతిపాదన మేరకు శాసనసభాపక్ష నేతగా యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరసగా నాలుగోసారి ఓబీసీ నేతకే మధ్యప్రదేశ్ పాలనాపగ్గాలు అప్పగిస్తున్నట్లయింది. విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టిన మోహన్ అనతికాలంలోనే ఉన్నత స్థానానికి ఎదిగారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టే స్థాయికి చేరారు. మోహన్ యాదవ్ మార్చి 25, 1965న ఉజ్జయినిలో జన్మించారు. పూనమ్‌చంద్ యాదవ్‌కు ఐదుగురు సంతానం. వీరిలో మోహన్ యాదవ్ చిన్నవాడు. వ్యవసాయ కుటుంబం. పూనమ్‌చంద్‌కు మాలిపురలో ఓ చిన్నపాటి చాయ్ దుకాణం ఉండేది. ఆర్థిక పరిస్థితి అంతంతే ఉన్నప్పటికీ అందర్నీ చదివించారు. ఆర్‌ఎస్‌ఎస్ శాఖకు క్రమం తప్పకుండా వెళ్లేవారు మోహన్ యాదవ్. స్థానిక మాధవ్ సైన్స్ కాలేజీలో విద్యార్థి సంఘ కార్యదర్శిగా 1982లో ఎన్నికైన మోహన్ 1984లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1991లో ఏబీవీపీ జాతీయ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 'మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వంపై మీడియా ఆలోచనాధోరణి' అన్న అంశం మీద 2008లో పరిశోధన చేశారు. మోహన్ 2013లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. 2018 ఎన్నికల్లో నెగ్గి, మరోసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2020లో శివరాజ్ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ బాధ్యతలు నిర్వహించారు. తాజా ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించారు. ★

# తొలిసారి ఎన్నికైన ఎమ్మెల్యేకు పగ్గాలు


భజన్‌లాల్ శర్మ

రాజస్తాన్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసిన భజన్‌లాల్ శర్మ తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. శర్మ ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. నాలుగు సార్లు ఆయన ఈ పార్టీ పదవి చేపట్టారు. ఇప్పటివరకు పార్టీలో సంస్థాగతంగా కీలక వ్యవహరించిన భజన్‌లాల్ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. సంగనేర్ నుంచి పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 48వేల ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న భజన్‌లాల్ గతంలో ఏబీవీపీ నేత. 56ఏళ్ల భజన్‌లాల్ పీజీ పూర్తి చేశారు. ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. ముఖ్యమంత్రి పేరు ప్రకటించడానికి కొద్ది నిమిషాల ముందు కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులు గ్రూప్ ఫోటో దిగారు. అందులో ప్రముఖులు, సీనియర్ నాయకులు తొలి వరుసలో కూర్చొని ఉండగా భజన్‌లాల్ చివరివరుసలో ఓ మూలన నిల్చొని కనిపించారు. సీఎం అభ్యర్థిపై కమిటీ సభ్యులు చర్చిస్తున్న సమయంలోనూ ఆయన ఎక్కడో వెనుక వరసలో కూర్చున్నారని వార్తలు వచ్చాయి. అక్కడికి నిమిషాల వ్యవధిలోనే ఆయన పేరును ముఖ్యమంత్రిగా ప్రకటించడం, కమిటీలో సభ్యుడిగా ఉన్న రాజ్‌నాథ్ సహా పలువురు కీలక నేతలు అభినందించడం వరుసగా జరిగిపోయాయి. భజన్‌లాల్‌కు సైతం ఆ షాక్ నుంచి తేరుకునేందుకే కొద్ది సమయం పట్టింది. ★

చేసి అఖిలేశ్, లాలులకు గట్టి సవాలు విసిరింది.

రాజస్తాన్ ముఖ్యమంత్రి ఎంపిక విషయంలోనూ బీజేపీ అధిష్ఠానం సామాజిక వర్గాన్ని కీలకంగా తీసుకుంది. రాజస్తాన్‌తోపాటు ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో జాట్‌లు, రాజ్‌పుత్‌ల ప్రభావం ఎక్కువ. బ్రాహ్మణులు కూడా కీలకమే. ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన నేతకు, మధ్యప్రదేశ్‌లో ఓబీసీ నాయకుడికి అవకాశం కల్పించిన క్రమంలో రాజస్తాన్‌లో ఇలాంటి నిర్ణయానికి మొగ్గుచూపినట్లు విదితమవుతోంది.

ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో గిరిజన ఓటర్లు ఎక్కువ. వీరందరికీ బీజేపీ మద్దతుగా నిలుస్తుందని చెప్పేలా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా ఆ తెగలకు చెందిన విష్ణుదేవ్ సాయ్‌ని ఎంపిక చేశారు. గతంలో జార్ఖండ్‌లో బీజేపీ అధికారం చేపట్టినప్పుడు రఘుబర్‌దాస్ ముఖ్యమంత్రిగా చేశారు. ఆదివాసీ రాష్ట్రం కాబట్టి ఆ వర్గానికి చెందిన వారినే నియమించాలని అక్కడి విపక్షాలు ఆందోళన చేశాయి. వీరికి సమాధానంగా ఛత్తీస్‌గఢ్‌లో ఆ వర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత విష్ణుదేవ్ సాయ్‌కు ముఖ్యమంత్రి స్థానాన్ని కట్టబెట్టారు. దేశ జనాభాలో 9 శాతం మేర ఉన్న గిరిజనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది బీజేపీ. ఇప్పటికే ద్రౌపదీ ముర్ముతో దేశానికి తొలి గిరిజన రాష్ట్రపతిని అందించిన బీజేపీ ఆ వర్గంతో ఓట్ల బంధాన్ని బలోపేతం చేసుకుంటోంది.

ఈ మూడు రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రి పదవులను సైతం ఎన్నికల రాజకీయాల్లో ప్రాధాన్యం కలిగిన వర్గాల నేతలకే కట్టబెట్టింది. మధ్యప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రులుగా రేవా ఎమ్మెల్యే రాజేంద్ర శుక్లా, మాజీ మంత్రి జగదీశ్ దేవ్‌రాలకు అవకాశం కల్పించారు. రాజస్తాన్‌లో ఉప ముఖ్యమంత్రులుగా దియా సింగ్ కుమారి, ప్రేమ్‌చంద్ బైర్వా ప్రమాణ స్వీకారం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావో, ఎమ్మెల్యే విజయ్ శర్మలకు ఉప ముఖ్య మంత్రి బాధ్యతలు అప్పగించారు. మాజీ ముఖ్య మంత్రి రమణ్‌సింగ్‌కు అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు అప్పగించారు.

**నూతన నాయకత్వానికి అవకాశం**

బీజేపీ విజయం సాధించిన మూడు రాష్ట్రాల్లో హేమాహేమీలైన నాయకులు ఉన్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్‌కు నాలుగు సార్లు, 15 ఏళ్లకు పైగా ముఖ్యమంత్రి. రాజస్తాన్‌లో వసుంధర రాజే, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్ ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తాజాగా వీరే కాకుండా సీఎం పదవి కోసం అనేక మంది పోటీ పడ్డారు. అయినా కొత్త ముఖాలనే బీజేపీ ఎంచుకుని, కొత్త నాయకత్వానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఉంటుందన్న సందేశాన్ని పంపింది. మరోసారి ముఖ్యమంత్రి పదవి దక్క నందుకు వసుంధర రాజేలో అసంతృప్తి ఉండవచ్చు. కానీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారు. కొత్త ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ పేరును అధికారి కంగా వసుంధరే ప్రతిపాదించారు. గవర్నర్‌ను కలవడానికి సైతం భజన్‌లాల్ వెంట వెళ్లారు. పదవీ ప్రమాణ స్వీకారం తరవాత సచివాలయంలోని సీఎం కార్యాలయానికి స్వయంగా తీసుకెళ్లారు. 2018లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరవాత రమణ్‌సింగ్ ప్రాధాన్యం కోల్పోయారు. ఇటీవలి ఎన్నికలదాకా తెరచాటునే ఉండిపోయారు. తాజా ఎన్నికల్లో భారీ ఆధిక్యంతో గెలవడంతో ఆయన పాత్ర కూడా ఉండటంతో మరోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టవచ్చని భావించారు. కానీ, స్పీకర్‌గా అవకాశం కల్పించారు.


ఎన్నికల ప్రచారంలో ఏ రాష్ట్రంలోనూ ముఖ్య మంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. అంతర్గతంగానూ దానిపై అసలు చర్చే నడవకుండా జాగ్రత్త పడింది. ఫలితంగా వర్గ విభేదాలు తలెత్తకుండా చూసుకుంది. ఎన్నికల ప్రచారంలో స్థానిక సమస్యలను ప్రస్తావించి నప్పటికీ, మోదీ పాలన, దేశాభివృద్ధినే ఆయుధాలుగా మార్చింది. సామాజిక, రాజకీయ పరమైన కోణాలతోపాటు సీఎం అభ్యర్థి ఎంపిక విషయంలో ఆర్ఎస్ఎస్ మూలాలను కూడా బీజేపీ పరిగణనలోకి తీసుకుంది. కొత్త ముఖ్యమంత్రులు ముగ్గురూ ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్నవారే. తద్వారా సంఘ్‌పరివార్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్నామన్న సంకేతాన్ని పంపినట్లయింది.

వ్యక్తులకన్నా వ్యవస్థ గొప్పది అని బీజేపీ సిద్ధాంత


అమిత్ షా, మోదీ

వ్యక్తులకన్నా వ్యవస్థ గొప్పది అని బీజేపీ సిద్ధాంత కర్తలు చెబుతారు. ఈ సత్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తుంటుంది జాతీయ నాయకత్వం. సీనియర్లను పక్కన పెట్టినంతమాత్రన వారి సేవలు అవసరం లేదని చెప్పడం కాదు. కొత్త తరానికి వారు మార్గదర్శ కులుగా ఉండాలని సూచించింది.

# సర్పంచి నుంచి సీఎం వరకు..



విష్ణుదేవ్ సాయ్

ఫిబ్రవరి 21,1964న జన్మించిన విష్ణుదేవ్ సాయ్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. గిరిపుత్రుడైన విష్ణుదేవ్ సాయ్ సర్పంచిగా ప్రస్థానం ప్రారంభించారు. రాష్ట్ర బీజేపీలో కీలక నాయకునిగా ఎదిగారు 1999, 2004, 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌గఢ్ నియోజకవర్గం నుంచి వరుసగా ఎన్నికయ్యారు. 1990, 2023లో శాసనసభకు ఎన్నికయ్యారు. 2020 నుంచి 2022 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో జాష్పూర్ జిల్లాలోని కుంకురి నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కయ్యారు. 2014లో ప్రధాని మోదీ తొలి కేబినెట్‌లో కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌కు విష్ణుసాయ్ అత్యంత సన్నిహితుడు. రాష్ట్రంలో ఆదివాసీలు 32 శాతం. దీంతో సీఎం ఎంపికలో అధిష్ఠానం ఆయనవైపు మొగ్గు చూపింది. జాష్పూర్ జిల్లా జార్ఖండ్, ఒడిశాలతో సరిహద్దులు పంచుకుంటోంది. దీంతో రానున్న ఎన్నికల్లో ఈ మూడు రాష్ట్రాల్లోని ఆదివాసీల మన్ననలు, విశ్వాసాన్ని చూరగొనేందుకు ఈయనను ఎంపిక చేసిందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేగా విష్ణుదేవ్‌ను గెలిపిస్తే.. అధికారంలోకి వచ్చాక ఆయనకు పెద్ద పదవి వచ్చేలా చూస్తామని అమిత్‌షా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒక సభలో చెప్పడం గమనార్హం. ★

కర్తలు చెబుతారు. ఈ సత్యాన్ని ఎప్పటి కప్పుడు గుర్తు చేస్తుంటుంది జాతీయ నాయకత్వం. సీనియర్లను పక్కన పెట్టినంతమాత్రన వారి సేవలు అవసరం లేదని చెప్పడం కాదు. కొత్త తరానికి వారు మార్గదర్శ కులుగా ఉండాలని సూచించింది. రాజకీయాల్లో తరాల మార్పే కాక అధికార మార్పిడి సైతం సాఫీగా సాగేలా చూసుకుంది. దేశంలో 60 ఏళ్లు ఆ పైబడ్డ ఓటర్లు 15 నుంచి 20 శాతమే అని లెక్కలు వినిపిస్తున్న వేళ పెరుగుతున్న యువ ఓటర్లను ఆకర్షించే నవతరం నేతలను భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు తీర్చిదిద్దే పథకరచనకు విజయవంతంగా శ్రీకారం చుట్టింది.

**వారు కొత్తవారు కాదు: మోదీ**

ఇంతకీ హేమాహేమీలను పక్కన పెట్టి కొత్తవారికి బీజేపీ అవకాశం ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమిటి? ఈ ప్రశ్నకు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సమాధానం ఆసక్తిని కలిగించింది. 'మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్య మంత్రులు కొత్తవారని చాలా మంది భావిస్తున్నారు. వారు కొత్తవారు కాదు. ఎంతోకాలం ప్రజల కోసం కష్టపడ్డారు. అనుభవం ఉంది. చాలా కాలంగా మీడియా దృష్టి కొన్ని కుటుంబాలపైనే ఉండి పోయింది. దీంతో కష్టపడి పనిచేసే వారి గురించి పెద్దగా ఎవరికీ తెలియలేదు. ఇలాంటివి ప్రతి రంగంలోనూ జరుగుతాయి' అన్నారు మోదీ.

**ప్రతి విషయంలోకూ లెక్కలుంటాయి**


మన ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలమే ప్రధానం. సభా నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సభ్యులకు ఉంటుంది. అయితే ఇది పార్టీల అంతర్గత వ్యవహారం. ఈ అంశంలో ఆ పార్టీల అధిష్ఠానాలు ముందుచూపును ప్రదర్శిస్తాయి. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయం ఈ కోవలోనిదే. ఈ రాష్ట్రాల్లో పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు అక్కడి అగ్రనాయకులు ఎంతో చెమటోడ్చి కష్టపడ్డారు. కాదనలేం. అయితే దేశ వ్యాప్తంగా ఏడాది పొడవునా, ప్రతినిత్యం శ్రమించే జాతీయ నాయకత్వానికి ఉండే లెక్కలు వేరు.


విస్తృత రాజకీయ, సైద్ధాంతిక వ్యూహంతో పాటు రాష్ట్రాలు, ప్రాంతాలు, సామాజిక వర్గాల బలాబలాలను బేరీజు వేసుకొని సమతూకం పాటిస్తూ.. కొత్త ముఖ్యమంత్రుల ఎంపికకు వ్యూహరచన చేశారని స్పష్టమవుతోంది. ముగ్గురు కొత్త సీఎంలు కూడా హిందూత్వ వాదులే. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నవారే.. బీజేపీకి అత్యంత విశ్వాసంతో సేవలు అందిస్తున్నవారే. ఇంతకు మించిన లెక్కలు ఇంకేముంటాయి?

**విపక్ష వ్యూహానికి చెక్**

బీజేపీ జాతీయవాదాన్ని, హిందుత్వను ఎదుర్కోవ డానికి సామాజిక సమీకరణాలనే నమ్ముకుంది కాంగ్రెస్ పార్టీ. ఇతర విపక్షాలు, ప్రాంతీయ పార్టీలు కూగా విభజన రాజకీయాలను నమ్ముకున్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు కులాన్ని ఒక వ్యూహంగా భావించింది విపక్ష 'ఇండీ' కూటమి. ముఖ్యంగా రాహుల్ గాంధీ కులగణన కోసం గట్టిగా డిమాండు చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఇటీవల రాష్ట్రంలో కులగణన నిర్వహించి వివరాలు బయట పెట్టారు. కర్ణాటకలో గతంలో సిద్ధరామయ్య ప్రభుత్వం కులగణన చేపట్టింది. ఆ సర్వే శాస్త్రీయంగా నిర్వహించలేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెబుతున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**






# 6 భరత వర్ష అమూల్య కానుక రామాయణం

భౌతికవాదంలో పడి సామ్రాజ్య విస్తరణకై వేలాది మానవులను క్రూరంగా హత్యచేయడానికి సైతం సంకోచించని ప్రపంచం నేడు ఆశతో భారత్‌వైపు చూస్తోంది. శీల నిర్మాణానికే తన శక్తిని వినియోగించి ఆర్థికమైన దోపిడీ పాపమని భావించే మర్యాదా పురుషోత్తముడైన రామచంద్రుని వంటి సమ్రాట్టు కానుకయే భారతవర్షం ప్రపంచానికి ఇచ్చే అమూల్య బహుమతి. భౌతికవాదాన్ని ఆరాధించే జాతులు చేసినదేమిటి? అధికారంపైన, సంపదపైన, సుఖంపైన నాకు తప్ప మరొకరికి అధికారంలేదని విర్రవీగే మానవుడిని ఇచ్చే కర్మాగారాన్ని స్థాపించాయి. అది అనాది కాలం నుండి ప్రారంభమయింది. ఎన్నటికీ అంతంకానిదది. కాని నైతిక నియమాలను పాటించడానికై 'నేను అధికారాన్ని, సంపదను, సుఖాన్ని కూడ వదులుకుంటా'నని ప్రకటించే అద్భుత మానవుని ప్రపంచానికి ప్రసాదించే దేశం ఒక్క భారతదేశమే. భౌతికత వికాసాన్ని గురించి ఎంతటి భారీ ప్రచారాలు జరిగినా, దానిలో మానవుణ్ణి పశువునుగా చేసే పనిమాత్రమే జరుగుతోందనేది స్పష్టం. దానిలో మానవోచితములైన శ్రేష్ఠమూల్యాల సంరక్షణ అసంభవం. ఇంత కొద్ది కాలంలోనే రెండు మహా యుద్ధాలను ప్రసాదించింది ఈ భౌతికవాదం. రానున్న మూడవ ప్రపంచ యుద్ధం కూడ ఆ ప్రేరణ ఫలితమే అవుతుంది. భయంకరమైన ఈ వినాశనం నుండి ప్రపంచాన్ని ఎలా రక్షించాలని పెద్ద పెద్ద తత్వవేత్తలు తికమకపడుతున్నారు. మానవాళిని వేధిస్తున్న ఈ విషమ సమస్యకు పరిష్కారాన్ని వాల్మీకి మహర్షి దివ్య ప్రతిభయే ఇవ్వగలుగుతుంది. ఏకైకమైన ఆశాకిరణం అదే. వాల్మీకి వర్ణించిన దివ్యజీవనం నేటి యంత్రయుగం మానవాళికి ఒక శాపంగా కాక వరప్రసాదంగా పరిణమించ గలదు. మదోన్మత్తమైన నేటి ప్రపంచానికి ఈ వరాన్ని గురించి తెలియకపోవచ్చు. కాని భస్మాసురునివలె ఆత్మ వినాశనం అనే అగ్నిలో అది భస్మం కావడం ప్రారంభించినప్పుడు భారత్‌కు చెందిన ఈ వరాన్ని శరణుజొచ్చడం తప్ప మరో మార్గం ఉండబోదు.

మానవ జీవనంలోని శాశ్వతమైన సిద్ధాంతాలను రామాయణ రూపంలో ప్రకటించిన దివ్య ప్రతిభ కలిగిన వాల్మీకి మహర్షి మన దేశంలో జన్మించాడనే భావన భారతీయుల అంతఃకరణలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని, పూరిస్తుంది. కాని ఈ దృష్టి నేటి భారతీయులలో లేకపోవడం దురదృష్ట కరం. గత 150 ఏండ్ల భావదాస్యం భారతీయ సాహిత్యాన్ని పరిశీలించే దృష్టికోణాన్ని ఎంతగా వికృతము, సారహీనముచేసిందంటే తేజోమయమైన ఈ సాహిత్యంలోని రత్నాల ప్రకాశం వారికి కానరావడంలేదు.

* * *

రామాయణమనే మహా సాగరంలో రత్నాలు కోకొల్లలుగా ఉన్నమాట నిజమే. అయితే ఆ రత్నాలను సంపాదించడానికి ఒక ప్రత్యేకమైన దివ్యదృష్టి అవసరం.

**భారతీయ పరిశోధనలో విపరీత దృష్టి**

కాని గత 150 ఏండ్ల పరాయి పాలనలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన విద్యా విధానం కారణంగా ఏర్పడిన భావదాస్యం ప్రభావంవల్ల మనం మన సాంస్కృతిక సాహిత్యాన్ని సరిగా అంచనా వేయడానికి అసమర్థులుగా తయారయినాము. తన స్వరూపానికి విరుద్ధమైన జ్ఞానం మానవునికి సర్వాధికమైన శత్రువు. పాశ్చాత్యుల పరిశోధనా శాస్త్రం. ప్రయత్నపూర్వకంగా భారతీయ సాహిత్య పరిశోధన విషయంలో విపరీత దృష్టిని నిర్మాణం చేసింది. ఫలితంగా మన దేశంలోని పెద్ద పెద్ద విద్వాంసులు సైతం వారి సిద్ధాంతాలనే ప్రమాణాలుగా స్వీకరించసాగారు. ఈ పాశ్చాత్య సిద్ధాంతాలను పరీక్షించి చూడాలనే ఉద్దేశ్యమే ఎవరికీ కలుగలేదు. కనుకనే రామాయణంవంటి సాంస్కృతిక ఇతిహాస గ్రంథాన్ని పఠించవలసిన దృష్టి లోపించింది. దీని ఫలితంగా విచిత్రము. హృదయ విహీనము, విపరీతము అయిన అనేక కల్పనలు జనించ సాగాయి.

**– బాలశాస్త్రి హరదాస్**

***'జాగృతి' 04.05.1964***

***08.06.1964 సంచికల నుంచి***

ఆధ్యాత్మికం



# సర్వం ఎరిగినా... 'నిన్ను' తెలుసుకో...!!

శ్రీ రమణ భగవాన్ సన్నిధికి ఒక వేద విద్వాంసుడు ఏతెంచి సకల వేదసార భూతమైన ఉపనిషత్తుల సారాన్ని ఉపన్యాసించాడు. భగవాన్ ఆయన ప్రసంగాన్ని విని నిదానంగా ఆయనతో 'ఇన్ని తెలుసుకున్నా (విషయాలు) మీరు మిమ్ములను గూర్చి మీరు తెలుసుకున్నారా!' అని వాకబు చేశారు. ఆ విద్వాంసుడు విచారంతో తల వంచుకొని శ్రీ రమణ సమక్షంలో కూచుండి పోయాడు. రమణ భగవాన్ ఆ పండితుడిని కరుణతో చూస్తూ, 'నేను' ఎవరిని అని మిమ్ములని మీరు ప్రశ్నించుకోండి. ఆధ్యాత్మిక సోపాన పథంలో చివరి మెట్టూ, మొదటి మెట్టూ అదే' అని ఉద్బోధించి పండితుడికి ఊరట కలిగేట్లు చెప్పారు. ఆ పండితుడు భగవాన్ ఉపదేశానికి మిక్కిలి సంతోషించాడు.

శ్రీ రమణుల భక్తుడైన సుందరేశయ్యర్ రెండో కుమారుడు ఒట్టి సోమరి. పరీక్షల కోసం పాఠ్యభాగాలను చదవడు. ఒకసారి తాను కొత్తగా కొన్న ఫౌంటెన్ పెన్నుతో శ్రీ రమణ భగవాన్‌ను దర్శించి 'భగవాన్! మీరు ఈ కలంతో ఏదైనా రాసి ఇవ్వండి' అని భగవాన్ పట్ల అచంచల విశ్వాసం,

# మహాభారతము
# ప్రజా పరిస్థితి

**6**




**రా**జునకు ప్రజ శరీరము

**రాజు ప్రజకు నాత్మగాన, రాజుం బ్రజయున్**
**రాజోత్తమ యన్యోన్య వి**
**రాజితులై యుండవలయు రక్షార్చనలన్**
**(శాంతి. 2.27)**

రాజ్యాంగమునకు వలయు ముఖ్యాంగములు పాలకులును, పాలితులును, వారి సంబంధ మిట నుటంకింపబడినది. ప్రజ శరీరము, తద్గతాత్మ రాజు. ఆత్మారాధనతత్పరులు ప్రజ గావలెను. 'శరీర మాద్యంఖలు ధర్మసాధనమ్' అనుటచేత ప్రజారక్షణ కార్యమును రాజు నిర్వహించవలెను. ఇట్టి అన్యోన్య సంబంధము సమ్యక్పద్ధతిలో నెలకొనిననే యిరువురును విరాజిల్లుదురు.

పైన భీష్ములు చెప్పినట్లు భారతదేశమున రాజులును, ప్రజలును రక్షార్చనా వ్యాపారదక్షులు, తత్కారణముచే నుశోభితులు. ప్రపంచము నందంతటను ఉన్నట్లే భారతదేశముననను రాజు నిరంకుశుడనియు, ప్రజనోరులేని మేకల మంద యనియ భ్రమించుటకు అవకాశము గలదు. రాజు, దైవాంశ సంభూతునిగానే యిచ్చటను భావింప బడినాడు కాని, అతడు విజ్జివీగక, ప్రజా ప్రేరణమునందు నిమగ్నుడయ్యెడివాడు. నమ్యగ్వి వేచనమువలన ఇది తేటతెల్లమగును.

మహాభారతమున పాలక పాలిత సంబంధము బహుధా వర్ణింపబడినది. భారత రాజవంశ మునకును పౌర జానపద సమూహమునకును ఉన్న సంబంధము విశిష్ఠమైనది. భారత కాలమున రాజు నిరంకుశు డు గాదు; ప్రజయును మూగవారు గాదు. రాజును, ప్రజలును 'అల్లియుఁదామరవోలె' అనగి పెనగి యుండిరి, వారిలో వారికి పొరపొచ్చెములు మచ్చున కైనను లేవు. రాజు తానే కార్యమును తలపెట్టినను, ప్రజాభిప్రాయమును గోరి, వారి యనుమతితోడనే చేయుచుండెడి వాడు.

మహాభారత యుద్ధానంతరము యుధిష్ఠిరుడు రాజ్యపాలనము గావించు చుండెను. ప్రణష్టపుత్ర పాత్రవర్గుడును, జరాభార పీడితుడును అగు ధృతరాష్ట్రుడు బహుకాలము పాండవుల వంచనే పడియుండెను. రాజు ఆతనిని సగౌరవముగా సాభిమానముగా చూచుచునే యుండెను. యువరాజగు భీమునిచే కొన్ని కలతలు కలిగినను, వానికి ధృతరాష్ట్రుడు అలవడియే కాలము కడపెను కాని జ..

**'......రాజవంశజునకు**
**సమర మరణమొందె విమలతప**
**మునకుఁ**
**జొచ్చి యందు నిలిచి చచ్చుటొండె**
**వలయు...**
**(ఆ.శ్ర 1.27)**

అని వానప్రస్థాశ్రమ స్వీకారమునకై రాజగు ధర్మరాజును అనుమతి వేడినాడు. అచ్చటికి విజయం చేసిన తమ యాచార్యుడు వేదవ్యాసుని యనుమతియు గోరినాడు. ధర్మజుడు అంగీకరింపక తప్పలేదు. దీనితో ధృతరాష్ట్రుడు తృప్తుడుగాలేదు. ప్రజలను గూడ అనుమతిని ప్రసాదింపుడని వేడినాడు. శంఖమున బోసినగాని తీర్థము గాదుగదా!

**'కౌరవ కోటియు మీరుఁ బెద్దయుఁ గాల**
**మనిఁగి పెనంగి యన్యోన్యసంభృ**
**తాధిక స్నేహులరై ప్రవర్తించితి**
**రసఘవర్తనులార! వినుడు నాదు**
**పలుకు వృద్ధునకుఁ దపశ్చరణంబున**
**కై వనంబున కేగుఁ టర్హకర్మ**
**ముచిత కృత్యంబుల యోజ మీరెఱెంగిన**
**యదియకా మది ముదమార మీం**
**లెల్ల నా కనుజ్ఞ యిచ్చి కానకుఁబుచ్చు**
**డనుడు సర్వజనులు నశ్రుపిహిత**
**దృష్టులగుచు గద్గదిక నెలుంగెడలఁగ**
**నార్తిఁదోప వేడ్కి రధిపముఖ్య**
***(ఆ.శ్ర... 1.85)***

కౌరవరాజులును ప్రజలును అసగిపెసగి అన్యోన్య నంభృతాధిక స్నేహులై ప్రవర్తించిరి. కన్నతండ్రి వలెనే అందరు రాజులును పాలించిరి. తానైనను ప్రేగుతీపిని తెంపు కొనలేక వంశక్షయమునకు కారకుడయ్యెనేగాని, ప్రజలను ఆవంతయైనను అలజడి పెట్టలేదు.

**– డా॥ చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి**
**'జాగృతి' 19-07-1965 సంచిక నుంచి**



**అక్కిరాజు రమాపతిరావు**

భక్తి ప్రపత్తులతో అర్థించాడు. భగవాన్ 'ఎందుకూ ... ఈ అభ్యర్థ'న అని యువకుణ్ణి అడగగా 'మీ చేతితో నాకు కలం ఇస్తే పరీక్ష సులభంగా గట్టెకుతాను' అని నివేదించుకున్నాడు. అప్పుడు భగవాన్ 'కష్టపడి చదివిన వారు పరీక్షల్లో కృతార్థులవుతారు. కానీ పుస్తకం తెరవనే తెరవకుండా నీవు పరీక్ష రాసి ఎట్లా గట్టెక్కుతావు?'అని అని సుందర మందహాస వదనారవిందంతో ఆ బాలుణ్ణి ప్రశ్నించారు. అప్పుడా కుర్రవాడు 'మీ దయ ఉంటే చాలు కదా! నేను సులభంగా నా పరీక్ష పాసై పోతాను' అని చెప్పాడు. భగవాన్ నవ్వుతూ అతడు తెచ్చిన కాగితం మీద 'అరుణాచల' అని సంతకించి ఆ కలం కుర్రవాడికి తిరిగి ఇచ్చారు. అతడు పరీక్షలో కృతార్థుడైన సంగతి మరి వేరే చెప్పటం ఎందుకూ! ఆ కుర్రాడికి శ్రీ రమణ భగవాన్ పట్ల ఉన్న విశ్వాసం సఫలమైందని వేరే చెప్పటం ఎందుకు? శ్రీరమణ భగవాన్ లీలా మానుష విగ్రహుడు కదా? సందేహమెందుకు భక్తుల ఆర్తి తీర్చటానికే వారు ఈ భూమిపై అవతరించారు కదా!


'నీ కొక్కడికే బాధలు అనుకుంటావు ఒకసారి నేను కొండ నిలువుగా ఎక్కబోతూ కాలుజారి కిందపడ్డాను. శరీరమంతా దెబ్బలు. కష్టసుఖాలు ప్రారబ్ధాధీనాలు. అవి అందరికీ సమానమే' అని శ్రీ రమణ భగవాన్ బోధనలను ఆలకిస్తే ఆనందమయ జీవితం సాధ్యమే. ★

## వివేకానంద సూక్తిశతి



**Always talk and hear and reason about the Atman.**
**by continuing to practise in this way, you will find that the lion will wake up in you too**

ఆత్మగూర్చి వినుడి ఆత్మగూర్చి మనుడి
ఆత్మ శక్తి మిన్న అవనిపైన
ఆత్మశక్తి యున్న అందరు సిహాలు
వినుడి స్వామి సద్వివేక వాణి



**బండిరాజుల శంకర్**

# ప్రజల విశ్వాసమే నా విజయ రహస్యం

## కామారెడ్డి చరిత్రాత్మక విజేత కాటిపల్లితో జాగృతి ముఖాముఖి

**నిశబ్దంగా తన పని తను చేసుకుపోతూ, తుపాను ముందు ప్రశాంతత ఎలా ఉంటుందో ప్రతిపక్షాల అనుభవానికి తెచ్చిన నాయకుడాయన... ఎన్నికల సమయానికి పెనుతుపానులా మారి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి రేవంత్‌రెడ్డినీ అనూహ్యరీతిలోనే అయినా అంతా ఊహించినట్టే ఓడించి కామారెడ్డి నియోజకవర్గం మీద బీజేపీ జెండాను ఎగరేసిన నేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి. ఏ ప్రభావమూ లేని ఎన్నికల యుద్ధంలో 'జెయింట్ కిల్లర్'. తన గెలుపు వ్యూహం గురించి, భవిష్యత్ కార్యాచరణపైన ఆయన 'జాగృతి' వారపత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ –**

**ఇది చరిత్రాత్మకం. ఈ ఘట్టానికి నేపథ్యంగా ఉన్న మీ రాజకీయ ప్రస్థానం గురించి వివరిస్తూ, మీ ఘన విజయాన్ని ఎవరికి ఆపాదిస్తారో కూడా చెబుతారా?**

నేను 1990వ దశకం నుంచే రాజకీయాలలో ఉన్నాను. అయినప్పటికీ, 2018లో బీజేపీ టిక్కెట్టుపై ఎమ్మెల్యేగా పోటీ చేసి పరాజయం పాలైన తర్వాతే నేనొక త్రిముఖ వ్యూహాన్ని రూపొందించుకున్నాను. 1. పార్టీ శ్రేణులను బలోపేతం చేయడం. 2. బీఆర్ఎస్ వ్యతిరేక నిరసనలు. 3. ఓటర్ల ధ్రువీకరణ. వీటితో పాటే అసలు డబ్బు, మద్యం పంచకుండా, ఓటర్లను ప్రలోభపెట్టకుండా ఎన్నికలలో గెలవాలన్నది కూడా నా ప్రాధాన్యాలలో ఒకటిగా పెట్టుకున్నాను. అంతిమంగా ఓటర్ల విశ్వాసాన్ని చూరగొనడంలో విజయవంతమయ్యాను. ఈ విజయం ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. సమష్టిగా, టీంవర్క్‌తో రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బీజేపీ నాయకత్వానికి స్వచ్ఛమైన హృదయంతో తోడ్పడడమిది. గత ఐదు సంవత్సరాలలో నేను కేవలం ఆరుసార్లు నా నియోజకవర్గానికి దూరంగా ఉన్నాను. అదైనా పార్టీ పని కోసమే. నేను ప్రతి ఒక్కరికీ ఎప్పుడూ అందుబాటులో ఉన్నాను. వారి సమస్యలను అర్థం చేసుకొని, పరిష్కారాలను లేదా మార్గాలను వెదకడం అప్పుడూ ఇప్పుడూ కూడా నా ప్రాథమిక దృష్టిగానే ఉంది.

**ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు**

డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ధరణి (డిజిటల్ భూ యాజమాన్య వ్యవస్థ), ఉద్యోగిత, కామారెడ్డి బృహత్ ప్రణాళిక, వరి కొనుగోలు, రేషన్ సరఫరా, వృద్ధులకు పింఛన్లు, భూకబ్జాలు, అవినీతి వంటి సమస్యలు బీఆర్ఎస్ చెత్త పాలన కారణంగా పునరావృతమవుతూ, నిరంతరం చర్చల్లో ఉన్నాయి. సంక్షేమ పథకాలు, సెటిల్మెంట్లలో పాత్ర, చట్టవ్యతిరేక, ఫోర్జరీ భూహక్కు పత్రాలు, అధికారులలో అవినీతి వంటివన్నీ ప్రతి ప్రభుత్వ రంగంలోనూ కనిపించడమే కాదు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గంపా గోవర్ధనరెడ్డి, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి షబ్బీర్ అలీ అహంకారం కూడా వారి పట్ల ప్రజానీకంలో వ్యతిరేకతను పెంచింది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకునే నేను ప్రజాదర్బార్లు నిర్వహించేవాడిని. తర్వాత వేలమంది బాధితులను ముందుపెట్టి నేను, నా అనుచరులు వారి వెనుక నిలబడి ఈ సమస్యలపై ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను నిర్వహించి, మీడియా దృష్టికి తీసుకువెళ్లేవాళ్లం. ఈ కార్యకలాపాల కారణంగా నెమ్మదిగా ప్రజలు నా మాటలను, చేతలను విశ్వసించడం మొదలుపెట్టారు. నిరసన ప్రదర్శనల సమయంలో నేను కేవలం జనాన్ని కదిలించడానికీ, ఆహార సరఫరాలకూ మాత్రమే పరిమితమయ్యేవాడిని. కేవీఆర్ ఉంటే, న్యాయం దక్కుతుందని ఇప్పుడు వారు నమ్ముతారు.



**ఓటర్ల ధ్రువీకరణ**

వారిలో విశ్వాసం దృఢపడిన తర్వాత, ఆలయాలపై ప్రత్యేక దృష్టితో ఓటర్ల ధ్రువీకరణ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపడం ప్రారంభించాను. ఆ క్రమంలోనే విభిన్న వర్గాలకు చెందిన, నిర్మాణం పూర్తికాని 700 ఆలయాలపై మా దృష్టి పడింది. వివిధ కారణాలవల్ల ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలలో ఆటంకాలు, నిర్మాణంలో ఆలస్యం లేదా నిలిపివేత వంటి సమస్యలు తలెత్తినట్టు మా దృష్టికి వచ్చింది. వీటికి పరిష్కారంగా ప్రత్యక్ష ఆర్థిక సహాయం కాకుండా అవసరమైన అత్యవసర సామాగ్రిని వారికి అందించడం ద్వారా నేను, నా బృందం ఈ సమస్యను చురుకుగా, శ్రద్ధగా పరిష్కరించాం. ఆలయాలకు వచ్చి తమ కోరికలను భగవంతుడికి చెప్పుకోవడం భక్తులకు గొప్ప ఊరట, సంతృప్తి. అందుకు తగిన వాతావరణం కల్పించాలన్నది నా లక్ష్యం. ఈ ఆధ్యాత్మిక లక్ష్యం ప్రజానీకంలో అపూర్వమైన సాహసాన్ని నింపి, దాదాపు ఒక దశాబ్దకాలం పాటు

పరివర్తనాత్మక ప్రక్రియను రగిల్చింది. ఆలయాలను నిత్యం సందర్శించి, ప్రార్థనలు చేయడం అన్నది ప్రేరణకు మూలమై, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాదు, ఆ భగవంతుడు సర్వవ్యాపకుడనే నమ్మకాన్ని సుదృఢం చేసి, వ్యక్తులు తమ ఆకాంక్షలను సాధించుకునేందుకు తోడ్పడింది.

కమ్యూనిటీ హాళ్లు కొనసాగించడానికీ, అవి ఆర్థికంగా నిలదొక్కుకునేటట్టు చేసేందుకు నేను కట్టుబడి ఉన్నాను. నిత్యం నా నియోజకవర్గ ప్రజలతో సంప్రదింపులు, సంపర్కం అన్నవి వారి బంధువులను మించి నా వైపు నుంచి ఉండేవి. వారంతా కూడా హైదరాబాదులోనూ, ఇతర ప్రాంతాలలో ఉన్న తమ సమీప బంధువుల కన్నా ఎక్కువగా నాతో సన్నిహితంగా ఉంటూ సమస్యలను పంచుకునేవారు.

ఆర్థిక సహాయం అన్నది నా పద్ధతిలో భాగం కాదు. నేను వారిని పెయింటింగ్, రెయిలింగ్‌లు ఏర్పాటు చేయడం, ఫ్లోరింగ్, సెంటరింగ్, సీలింగ్ పని వంటి వివిధ ఆచరణాత్మక కార్యాలలో నిమగ్నం చేయడంలో తోడ్పాటునిచ్చాను. తక్షణ సమస్యలను పరిష్కరించడమే కాక, వారి సమగ్ర సంక్షేమం, సమాజ సభ్యులలో సానుకూల పరివర్తనకు దోహదం చేయడం అన్నది ఈ సాయం వెనుక లక్ష్యం.

బీఆర్ఎస్ నాయకులు, షబ్బీర్ అలీ శుక్రవారం ప్రార్థనల సమయంలో మసీదులకు హాజరయ్యేవారు. ఇది ఇక్కడి ప్రజలకు నచ్చలేదు. ఈ క్రమంలో రాజకీయ ప్రచారాల సందర్భంగా ఆలయాలు, మసీదుల సందర్శన అన్నది పక్కన పెట్టి తీరాలంటూ ఒక నిమిషం వీడియో రూపొందిస్తే బాగుంటుందని పించి, చేశాను. దీనికి ముస్లింల నుంచి కూడా సానుకూల స్పందన వచ్చింది.

**శాసనసభ్యునిగా వచ్చే ఐదేళ్లకు మీ ప్రణాళికలు ఏమిటి? పార్టీలో మీ భూమిక ఎలా ఉండబోతున్నది?**

ఎమ్మెల్యేగా కొన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాను. అవి– 1.రేషన్ కార్డు 2.పింఛన్లు 3.భూ పట్టాపుస్తకం 4. గృహ నిర్మాణం (ప్రధానమంత్రి ఆవాస్ యోజన) వంటి సౌకర్యాలు నా నియోజకవర్గంలో అవసరమైన వారికి చేరేలా చూడడం. వీటితో పాటు పొగ తాగకూడని, పార్కింగ్ చేయకూడని జోన్లలాగా కామారెడ్డిని అవినీతిరహిత జోన్‌గా తీర్చిదిద్దడం. నా నియోజకవర్గంలోని అవినీతి అధికారులు వారే బదలీ చేయించుకొని వెళ్లడమో లేక అవినీతికి తావు లేకుండా సేవ చేయడమో నిర్ణయించుకునేలా చేయడం. మద్యం లేదా ధన ప్రలోభాలకు లోనుచేయనప్పుడు, తప్పు చేసేవారిని గట్టిగా ఆత్మగౌరవంతో ప్రశ్నించడమే కాదు, ఏదైనా తప్పు జరిగితే అధికారులకు వ్యతిరేకంగా నిలబడే గట్టి సాహసం ఓటర్లలో ఉంటుంది. ప్రజలు అవినీతిని నివారించి, కొన్నింటికి తామే స్వచ్ఛందంగా స్వంత డబ్బు ఖర్చుపెట్టుకున్నప్పుడు ఒక బలమైన గొంతుగా ఉండేందుకు వారికి అన్నిరకాలుగా హక్కు ఉంటుంది.

ముఖ్యమంత్రి నిధుల పట్ల నేను ఎప్పుడూ సానుకూల వైఖరినే కలిగి ఉంటాను. కానీ, కావలసిన ఫలితాలను సాధించడంలో విఫలమైతే బీఆర్ఎస్‌తో చేసినట్టే తిరిగి ఉద్యమ పంథాలోకి వెడతాను. బీజేపీకి చెందినవారం కాబట్టి మాకు కేంద్ర ప్రభుత్వ నిధులు అందుబాటులో ఉంటాయి. నైపుణ్యాలు లేని యువత గల్ఫ్‌కు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, ఈ ప్రాంతంలో ఆదాయాన్ని, ఉద్యోగితను పెంచేందుకు పర్యావరణ అనుకూల పరిశ్రమలను తీసుకురావాలన్న ప్రణాళికలు నాకున్నాయి.

నాకిచ్చిన ఏ బాధ్యతనయినా స్వీకరిస్తూ, పార్టీ ఆదేశిస్తే పని చేసేందుకు సదా అందుబాటులో ఉంటాను. నన్ను ఏ మేరకు ఉపయోగించుకోవాలో పార్టీ నిర్ణయించాలి. చేస్తున్న పని పట్ల దార్శనికత, స్పష్టత నాకు ఉన్నాయి.

**నిజామాబాద్‌లో ఇటీవలే నిషేధిత ఉగ్రవాద సంస్థ పిఎఫ్ఐ సభ్యులను ఎన్ఐఎకు పట్టుబడ్డారు. ఈ రాడికల్ ఇస్లామిక్ శక్తులను మీరు ఎలా చూస్తారు?**

నాకిచ్చిన ఏ బాధ్యతనయినా స్వీకరిస్తూ, పార్టీ ఆదేశిస్తే పని చేసేందుకు సదా అందుబాటులో ఉంటాను. నన్ను ఏ మేరకు ఉపయోగించుకోవాలో పార్టీ నిర్ణయించాలి. చేస్తున్న పని పట్ల దార్శనికత, స్పష్టత నాకు ఉన్నాయి.



నా అభిప్రాయంలో ఈ అంశం దారిద్ర్యం, సమాజంలోని దుష్టశక్తులు ముస్లింలను సమాజ వ్యతిరేక, జాతి వ్యతిరేక వైఖరిని తీసుకోవాలని బోధించి, తర్ఫీదునివ్వడం కారణంగా ఉత్పన్నమవుతున్నది. ఒక సాధారణ ముస్లిం, రాడికల్ ఇస్లాం బాధితుడవుతున్నాడు. సంపన్న కుటుంబాల నుంచి వచ్చిన కొందరు ముస్లింలకు చిన్న వయసులోనే బ్రెయిన్‌వాష్ చేయడం, వారు వైద్యులుగా, ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలలో విద్యార్థుల ముసుగులో చెలామణీ అవుతూ కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ, ముస్లింలలో దారిద్ర్యం మాత్రం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ముస్లింలు సంక్షోభంలో ఉన్నప్పుడు ఈ రాడికల్ శక్తులు వీరిని చేరుకుని, సాంత్వన కల్పించి, తర్వాత వారిని తీవ్రవాదం దిశగా మళ్లేలా ప్రభావితం చేస్తారు. దారిద్ర్యాన్ని నిర్మూలించి, వారికి మంచి విద్యనందించడం అన్నది వారిని తీవ్రవాదం నుంచి దూరంగా ఉంచుతుంది.

**మీకు స్ఫూర్తి ఎవరు?**

నా తండ్రి రాజారెడ్డి. 60లు, 70ల కాలంలో 25 సంవత్సరాల పాటు సమితి ప్రెసిడెంట్ హోదాలోనే పని చేస్తూ, రాజకీయ భూమికలకు అతీతంగా ఇద్దరు ఎమ్మెల్యేలు చూపగలిగేటంత ప్రభావాన్ని ఆయన కలిగి ఉండేవారు. అదే నేను రాజకీయాలలోకి రావడానికి ప్రేరణ. పాలనారంగంలో ఎన్‌టీఆర్ తెచ్చిన పునర్వ్యవస్థీకరణ, సంక్షేమ పథకాలు, రాజీవ్ గాంధీ రాజకీయ వ్యూహం, హిందువులకు ధైర్యాన్ని ఇస్తూ అద్వానీజీ చేపట్టిన రామ జన్మభూమి రథయాత్ర, మోదీజీ అభివృద్ధి నినాదం– ఇవన్నీ కూడా నా రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేశాయి.

**మీ వెనుక ఉన్న శివాజీ విగ్రహానికి ఉన్న ప్రతీకాత్మక ప్రాముఖ్యం కాకుండా మీ వ్యక్తిగత జీవితంలో ఉన్న ప్రాధాన్యం ఎలాంటిది?**

ధర్మసంరక్షకుడిగా, బలమైన రాజ్యాన్ని ఏర్పరచినవాడిగా శివాజీ వారసత్వాన్ని ప్రతిబింబించేదే ఈ మూర్తి. ఇక ఈ ప్రతిమ ఇచ్చే సందేశం మన చూపే సామాజిక బాధ్యత, అందించే సామాజిక సేవలో ఇమిడి ఉందని నేను భావిస్తాను. భిన్న విశ్వాసాలను గౌరవించడం, విద్యను, విలువలను ప్రోత్సహించడం అన్న సూత్రాలపై ఆయన తన రాజ్యాన్ని నిర్మించారు. అవి నేటికి కూడా సహేతుకమైనవి, ఉచితమైనవి. ప్రతి మలుపులోనూ స్వీయ లబ్ధి కోసం ప్రయత్నించకుండా, మనమంతా కూడా సామాజిక సంక్షేమపరంగా ఆలోచించాలి. అనేకమంది ప్రజలు గ్రామాలలో పెరిగి, నగరాలకు వలస వెళ్లిన తర్వాత వారు తమ మూలాల నుంచి విడవడి, తమ సమాజాలను నిర్లక్ష్యం చేస్తుంటారు. సరిగ్గా ఇక్కడ శివాజీ ఉదాహరణ ముఖ్యమైంది. తన స్థాయి ఏదైనా, ఆయన తనని తాను ప్రజలకు అంకితం చేసుకున్నాడు. ఎమ్మెల్యే లేదా ఎంపీ నిధులపై ఆధారపడడం అన్నది విషయం కాదు. వైద్యులు, ఇంజినీర్లు, విద్యావేత్తలు, ప్రొఫెషనల్స్ కూడా తమ ఆదాయంలో చిన్న భాగాన్ని ఇవ్వడం ద్వారా తమ గ్రామాల సంక్షేమానికి దోహదం చేయవచ్చు. తాము వచ్చిన మూలాలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ తిరిగి సమర్పించుకోవడం ప్రారంభిస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించండి! ప్రతి గ్రామం కూడా శివాజీ చేసిన సేవలకు మించి మెరుగుపడుతుంది.

ఇంటర్వ్యూ : కె. సురేందర్



# తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం!

## జాగృతితో ముఖాముఖీలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

పుట్టిన గడ్డను, మూలాలను మరచిపోవడమంటే వ్యక్తి తన అస్తిత్వాన్ని విస్మరించడమే. ఇప్పుడు విస్తృతంగా కనిపిస్తున్న ఈ అవలక్షణంతోనే దేశంలోని గ్రామాలు నిర్లక్ష్యానికి, దారిద్ర్యానికి లోనవుతున్నాయి. తమ సమస్యల గురించి అడిగే నాథుడు లేక, తమను ఆ దుస్థితి నుంచి బయటకు తెచ్చేవారు కానరాక తల్లడిల్లుతున్న అలాంటి వారికి తోడ్పడేందుకు, అభివృద్ధిపథంలో నడిపించేందుకు ముందుకు వచ్చిన నేత పైడి రాకేశ్‌రెడ్డి. సమాజసేవ, ధార్మికతలను సమానంగా చూడగలుగుతున్న అరుదైన రాజకీయ నాయకుడు. సగం జీవితం కుటుంబానికి ఇచ్చాక, మిగిలిన సగం సమాజ సేవలో గడిపేందుకు వచ్చారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో ఆర్మూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా ఘనవిజయం సాధించిన ఆయన తన నియోజకవర్గాన్ని సుసంపన్నం చేయాలనే తపనతో ఉన్నారు. రాజకీయాలలోకి తాను రావడానికి ఉన్న నేపథ్యం, భవిష్యత్ కార్యాచరణపై ఆయన 'జాగృతి' పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ –

**చిన్నప్పుడు కష్టాలు చూశారు. తర్వాత పారిశ్రామికవేత్తగా నిలబడ్డారు. అట్లాంటిది మిమ్మల్ని రాజకీయాల వైపుగా నడిపించిన శక్తి ఏది?**

కనిపిస్తున్న పరిస్థితులు, పరిణామాలే. దేశమంటే మనుషులోయ్ అన్నాడొక కవి. కానీ దేశమంటే మనీ అనే రీతిలో ఉంది పరిస్థితి. సగం జీవితాన్ని నా కోసం, నా కుటుంబం కోసం వెచ్చించాను. మిగిలిన సగాన్ని సమాజ సేవకోసం వెచ్చించాలని నిర్ణయించుకున్నాను.

**అనేక పార్టీలు ఉన్నాయి. కానీ మీరు బీజేపీని ఎంచుకోవడానికి కారణం?**

ఇక్కడ ప్రధానంగా మూడు పార్టీలే ఉన్నాయి. ఇంకా ఉన్నా అవి కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. బీఆర్ఎస్, టీఆర్ఎస్– రెండూ ఒకటే. తనకు మంత్రి పదవి రానందుకు కల్వకుంట్ల చంద్రశేఖరరావు పెట్టుకున్న పార్టీ అది. సమాజం పట్ల ఎటువంటి ప్రేమ లేకున్నా, ఇక్కడ రగులుతున్న ఒక సమస్యను తీసుకుని ప్రాంతీయ పార్టీ పెట్టారాయన. నేను వేరే సందర్భంలో కూడా చెప్పాను, అది ఒక కుటుంబం కోసమే పెట్టిన పార్టీ.

ఇక కాంగ్రెస్ పార్టీ. దేశ విచ్ఛిన్నమంతా దానితోనే కదా! అన్ని అవలక్షణాలూ ఉన్న వ్యక్తిని తొలి భారత ప్రధానమంత్రిని చేసింది. అది జరిగిన మరురోజే దేశ విభజన వల్ల లక్షలాది హిందువుల మీద నరమేధం, అత్యాచారాలు జరిగాయి. నేను పుట్టకముందే అవన్నీ జరిగినా, అవి చదివినప్పుడు నా మనసుకు తగిలిన గాయాలింకా ఉన్నాయి. ఖలిస్తాన్ సమస్య మరొకటి. భింద్రన్‌వాలేని పెంచి పోషించడం కావచ్చు, కశ్మీరీ పండిట్ల నరమేధం కూడా నన్ను కలచివేశాయి. ఈ వాస్తవాలే నన్ను ఆ పార్టీ వైపు పోకుండా నిలువరించాయి.

మూడవది బీజేపీ. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెగ్డెవార్ పూర్వీకులది మా జిల్లా (నిజామాబాద్)యే. కందకుర్తి గ్రామం. అలాంటి మహాత్ముడు పుట్టిన గడ్డ మీదే పుట్టాను నేను. ఆ నేలపై పుట్టడమే అదృష్టం. విద్యార్థిదశలో కొంతకాలం స్వయంసేవకుడిగా ఉన్నాను. నిరంతరం ధర్మం గురించి, దేశం గురించి ఆలోచించే సంస్థ ఆరెస్సెస్. దానితో పాటు జనసంఘ్. తర్వాతి పరిణామాలు, భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం ఇవన్నీ తెలిసిందే. భారతదేశంలో ఒకే ఒక్క పార్టీ– దేశం కోసం పుట్టిన పార్టీ. దేశ రక్షణ కోసం తపించే పార్టీ. ఎన్ని మతాలు, జాతులున్నా, ఇబ్బందులున్నా దేశాన్ని కాపాడుకోవాలని చెప్పే ఏకైక పార్టీ. దేశంతో పాటు ధర్మం, న్యాయం, విలువల పరిరక్షణ ఆశయంతో పుట్టిన పార్టీ. ప్రపంచానికి ఈ మూడే కావాలి. దేశానికి భద్రత ఉండాలి. నియమాలతో బతకడానికి ధర్మం ఉండాలి. ధర్మం సంస్కారాన్ని నేర్పుతుంది. అవన్నీ బీజేపీలో ఉన్నాయి. కానీ మిగిలిన పార్టీలలో ఒకటి కుటుంబ కేంద్రితం, ఇంకొటి వ్యక్తి కేంద్రితం. కాబట్టి సిద్ధాంతాన్ని బట్టి భారతదేశం ఉన్నంతవరకూ అఖండ జ్యోతిలా వెలుగుతుందనే నమ్మకంతో భారతీయ జనతా పార్టీలోకి వచ్చాను.

**మీ ఎన్నికల విజయాన్ని ఎలా అంచనా వేస్తారు? ఎవరికి అంకితం చేస్తారు? మీ సిద్ధాంతం గెలిపించిందా? సేవా కార్యక్రమాలా? మోదీ కీర్తిప్రతిష్ఠలా?**

దేశవ్యాప్తంగా మోదీగారి కీర్తికి ఎక్కడా లోటులేదు. ఆయన ప్రభావం ఉన్నప్పటికీ, నా గెలుపునకు కారణమైన ఆర్మూరు నియోజకవర్గంలోని 87 గ్రామాల ప్రజలకు ఈ విజయాన్ని అంకితం చేస్తాను. నేను రాజకీయాలలోకి వచ్చి నాలుగు నెలలైంది. నేను ఎక్కడ పుట్టానో, ఎవరో తెలియదు. కానీ మాజీ ఎమ్మెల్యే చేసిన అరాచకాలు, అహంకారం, అవినీతి కారణంగా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న వారంతా నన్ను తమ కుటుంబ సభ్యుడిగా భావించారు. నా మాటలను విశ్వసించి నాకు ఓటు వేశారు. వారే నా కుటుంబం. నా గెలుపు కోసం ఎందరో అజ్ఞాతంగా పని చేశారు.

ఈ ఎన్నికల సమయంలోనూ హిందూధర్మాన్ని పార్టీలు అవమానించాయి. ఒక రాష్ట్ర స్థాయి నాయకుడేమో, మైనార్టీలు అడక్కపోయినా హిందూ

ఆలయాల భూములు అమ్మి సంక్షేమం చేపడతానని చెప్పాడు. ఇంకొకరు కాంగ్రెస్ అంటేనే ముస్లింల పార్టీ అంటూ విజ్ఞతను మరచి మెజారిటీలను అవమానించారు. ఇవన్నీ నేను భరించలేకపోయాను. ధర్మమే లేకపోతే ఎటుపోతారు, ఎక్కడ బతుకుతారు అని నా ప్రజలకు చెప్పాను. ఈ ప్రపంచం మొత్తంలో హిందువులకు ఉన్నది ఒకటే ఇల్లు (భారత్). దీనిని కూడా తగులబెట్టుకుంటే, ధ్వంసం చేసుకుంటే భవిష్యత్ తరాలకు కష్టం అని చెప్పగలిగాను. అలాగే, దేశమే లేకపోతే తెలంగాణ ఎక్కడ ఉంటుంది? తెలంగాణ లేకపోతే ఆర్మూరు ఎక్కడుంటుంది? వారు దానిని స్వీకరించారు. నన్ను ఎన్నికల్లో ఓడించాలని ఎందరో భావించినా నేను నమ్ముకున్నది ఒకటే– ధర్మం, దైవం. దైవమాశీర్వదించాడు, ధర్మం గెలిచింది. అదే నా గెలుపు!

**బీజేపీ అంటే అటు ప్రగతి, సేవనూ ఇటు ధర్మాన్నీ కాపాడడమన్న విధానం కనిపిస్తోంది. ఇది మీ భవిష్యత్ ప్రణాళికలో ఎలా ఉండబోతోంది?**

ప్రధాని చక్కటి దిశా నిర్దేశం చేశారు దేశానికి. ఒక జాతికి మణులు, మాణిక్యాల కన్నా ప్రధానమైంది ఆత్మగౌరవం. దానిని ఆయన నిలబెట్టారు. రెండవది దేశం దీర్ఘకాలిక సమస్యలతో కొట్టుమిట్టాడకూడదు. 370 లాంటి ఆర్టికల్ అలాంటిదే. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. దుర్మార్గమైన కాంగ్రెస్ పార్టీ హిందువులను, దేశాన్ని తిరిగి ముక్కలు ముక్కలు చేయాలని ఒక దురాలోచనతో పెట్టిన ఆర్టికల్ అది. మోదీగారు ఆ అధికరణాన్ని రద్దు చేశారు. మూడవది, ఐదు వందల సంవత్సరాల నుంచి రగులుతున్న సమస్య అయోధ్య. మర్యాదా పురుషోత్తముడు పుట్టిన చోటు కోసం ఐదు వందల ఏళ్లు పోరాటం చేయవలసి వచ్చిందంటే, హిందువుల పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి. ఆ సమస్యను భారత న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించగలిగారు మోదీ.

అలాగే, అభివృద్ధి. నేడు భారతదేశమంటేనే అభివృద్ధి. ఒకప్పుడు ఆత్మనిర్భరత లేదు. అది వాక్సిన్స్ కావచ్చు, ప్రపంచాన్ని కరోనా చుట్టుముట్టినప్పుడు దేశంలోని మేధావులందరినీ ఒక చోట కూర్చోబెట్టి, మనుషులే పోతే దేశమెందుకన్నాడు. అంత స్వల్పకాలంలో వాక్సిన్ రావడం అన్నది ప్రపంచ రికార్డు. వాక్సిన్ తేవడమే కాదు 140 కోట్లమంది ప్రజలను కాపాడుకున్నాడు. ప్రపంచాన్ని కూడా బతికించాలని ఇరుగు పొరుగుకు ఉచితంగా పంపిన ధీరోదత్తుడు. అందువల్ల మేము, అద్వానీ, వాజ్‌పేయి అడుగుజాడల్లో వారెలా నడుస్తున్నారో, రేపటితరం మోదీ ఆశయాలను పుణికి పుచ్చుకొని, బంగారు భారతదేశం నిర్మించాలని కలలు కంటున్నాను.

**తెలంగాణలో బీజేపీ సిద్ధాంతం పట్టు సాధించే అవకాశం ఉంది. దాని గురించి మీ అభిప్రాయమేమిటి?**

దేశంలో అందరికంటే ముందు అధికారంలోకి రావల్సింది తెలంగాణలోనే. బీజేపీ ఎదుర్కొన్న మొదటి సార్వత్రిక ఎన్నికలలో రెండే రెండు సీట్లు వచ్చాయి. అందులో హనుమకొండ ఒకటి. బీజేపీ హిందూత్వ భావాలు, దేశాన్ని ప్రేమించే తత్వాన్ని స్వాగతించే మనుషులు ఇక్కడ ఉన్నారు. ఆ సిద్ధాంతాన్ని గుండెలకు హత్తుకునే గడ్డ తెలంగాణ. రానున్న ఐదు సంవత్సరాలలో ప్రజల మద్దతుతో, అభిమానంతో అఖండ మెజారిటీతో బీజేపీ గెలుస్తుంది. రామరాజ్యం స్థాపిస్తాం.

**పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ తెలంగాణకు నిజంగా చేసిందేమిటి?**

ఏమీలేదు. నిజం చెప్పాలంటే 50 ఏళ్లు వెనక్కి నెట్టింది. 1948 సెప్టెంబర్‌లో ఎంత వెనకబడి ఉన్నామో ఇప్పుడూ అంతే. ఏడు లక్షల కోట్ల అప్పులు, 20 లక్షల కోట్లు అవినీతి. ఎకరా వరి పండించడానికి ఖర్చు 13 లక్షలు. ఆదాయం పదివేలు. ఇంజినీరింగ్ నిపుణుల సలహా లేకుండా చేసిన నిర్మాణం. దాని పరిణామంగానే ఇప్పుడున్న మంత్రిగారు మేడిగడ్డ, కాళేశ్వరం కూలిపోతుంటే మిగిలిన సగం ఎట్లా అంటూ ఎల్అండ్‌టి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రపంచస్థాయి దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి, దోషులను చట్టం ముందు నిలబెట్టాలి. అమాయక తెలంగాణ ప్రజల భవిష్యత్తు తాకట్టు పెట్టిన డబ్బును రికవర్ చేయాలి. ధ్వంసమైన తెలంగాణను అభివృద్ధి చేసుకోవాలి.

**వారం కిందట కాంగ్రెస్ పాలన మొదలైంది. రేపెలా ఉంటుంది తెలంగాణ?**

ప్రస్తుత ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడు. 'బీఫాం' (కాంగ్రెస్) ఉంటేనే నిధులు వస్తాయని అన్నాడు. ముఖ్యమంత్రిగారూ ఒకసారి గమనించండి! మీరూ మా లాగానే ఎమ్మెల్యే. మీకెలాంటి హక్కులుంటాయో, మాకూ అంతే. మీకెన్ని నిధులు కావాలో, మా నియోజకవర్గాలకు అన్నే నిధులు కావాలి. లేకపోతే భారత న్యాయవ్యవస్థ తలుపు తడతాం. రాజ్యాంగాన్ని గౌరవించండి. రాజ్యాంగం మీద ప్రమాణం చేశారు, రాజధర్మం ప్రకారం నడవాలి. అలాంటి ప్రసంగాలు చేయకూడదు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం.

**మొత్తంగా రాజకీయ వ్యవస్థ ఆశాజనకంగా లేదు. బీజేపీ లాంటి గొప్ప సిద్ధాంతం ఉంటే తప్ప, మీ లాంటి గొప్ప ఆశాజనకమైన భావనగల వారు ఉంటే తప్ప, ఈ వ్యవస్థను మార్చడం గురించి మీ సొంత అభిప్రాయం ఏమిటి?**

ప్రయత్నం ఎక్కడో ఒక చోట మొదలు పెట్టాలి. నిరాశ జాతికి, అసలు ఏ వ్యవస్థకీ మంచిది కాదు. నాకైతే గాఢమైన విశ్వాసం ఉంది. భారతజాతి చాణక్యుడు, అశోకుడు వంటి వారి కలలు కన్న అఖండ భారతంగా వెలుగొందుతుంది. ఆ దేవుడి దీవెనలు ఈ కర్మభూమి మీద ఉంటాయి. కనుక నిరాశ అవసరం లేదు. అవినీతి, అరాచకాలు లేని భారతదేశం తయారవుతుందనే నేను గట్టిగా భావిస్తున్నాను.

**నిజమే, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న గొప్ప ఆశ ఇటీవలి వరకు ఉంది. పరిస్థితులు మారాయన్నది వేరే విషయం. ప్రతి బీజేపీ అభ్యర్థి గెలుపు చరిత్రాత్మకమైనదే. దీని ప్రభావం ఆంధ్ర మీద ఎట్లా ఉంది?**

ఆంధ్ర అనే కాదు, ఈ దక్షిణ భారతదేశం మొత్తం ఏదో ఒక రోజు బీజేపీ పాలనలోకి వస్తుంది. అంటే భారతదేశం మొత్తం పరిపాలిస్తాం. అతి త్వరలోనే. మాలాంటి కొత్తగా వచ్చినవారి ఆలోచనల తోడ్పాటుతో. ఎందుకంటే, మేం ప్రపంచమంతా తిరిగాం. అంగ్‌కోర్‌వాట్, విజయవర్మ వంటివారిని ఆదర్శంగా తీసుకున్నాం. బాలిలో హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి, విష్ణు ఆలయాన్ని నిర్మించాడాయన. వారు నడిచిన భూమి ఇది, ఇక్కడ పుట్టడం మన అదృష్టం. మన ధార్మిక విజయయాత్ర మరుగున పడింది. దాన్ని వెలికితీయాలి. యువతలో స్ఫూర్తి



**మీ మాటలను బట్టి ఇంకో ప్రశ్న, భారత రాజకీయాలలో ధర్మం పాత్ర ఎలా ఉంది? ఎలా ఉండాలనుకుంటున్నారు?**

వాస్తవానికి ధర్మం దెబ్బతిన్నది, అగాథపు అంచుల్లో ఉంది. దానిని కాపాడుకోవలసిన బాధ్యత మనది. మనం కళ్లు తెరిచి ధర్మాన్నీ, దేశాన్నీ, న్యాయాన్నీ కాపాడుకుంటామా లేదా అన్నదే ప్రశ్న. కేవలం 15 శాతం మంది అసెంబ్లీపై కాషాయ జెండా ఎగరనివ్వమంటూ సవాలు చేశారు సరే, అయినా 85 శాతం మంది మౌనంగా ఎందుకున్నారు? మీ హక్కుల గురించి, ధర్మం గురించి అడగరా? ప్రజలలో జాగృతిని, చైతన్యాన్ని తీసుకువచ్చేందుకే నేను రాజకీయాలలోకి వచ్చాను.



**చరిత్ర నుంచి మీరు గొప్ప స్ఫూర్తి పొందినట్టు కనిపిస్తుంది. ఇది ఎలా సాధ్యం అయింది?**

నిరంతరం నేర్చుకోవాలనే తపన. ఇంత గొప్ప జాతి నేడు తన వైభవాన్ని కోల్పోయి ఎందుకు అవమానాలకు గురవుతోందన్న ప్రశ్నకు సమాధానాల కోసం వెతుకులాట. వెతుకుతూ పోతుంటే, అనేక సంఘటనలు కనిపిస్తాయి. జలియన్‌వాలా బాగ్ ఉదంతం చూడండి! వందలాది మందిని అక్కడ చంపిన జనరల్ డయ్యర్‌ని లండన్‌లో కాల్చివేసే వరకూ నిద్రపోలేదు ఉద్దమ్‌సింగ్. ఈ గడ్డలో పౌరుషముంది. ఇప్పుడు మత్తులోకి జారుకుంది. ఇవాళ ఇందిరాగాంధీ, ప్రియాంక గాంధీ అంటున్నారు. రాణి రుద్రమదేవి వందల సంవత్సరాల కిందట ఏకధాటిగా 18 సంవత్సరాలు పాలించింది. ఇందోర్ విమానాశ్రయానికి అహల్యాబాయి హోల్కర్ పేరు పెట్టారు. బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రాగానే హైదరాబాద్ విమానాశ్రయాన్ని రాణి రుద్రమదేవి ఎయిర్‌పోర్ట్‌గా మార్చాలి. నేడు మేం అసెంబ్లీలో కూడా డిమాండ్ చేస్తున్నాం రాణి రుద్రమ స్ఫూర్తి కేంద్రాన్ని తయారు చేయాలి. ఈ రోజువరకూ కాలువలు పారుతున్నాయి, పంటలు పండుతున్నాయంటే, రాణి రుద్రమ దేవే కారణం. మన జాతే కాదు ప్రపంచమే గర్వించదగ్గ రాణి రుద్రమ.

నింపాలి. మన వీరుల గురించి తెలియచేయాలి. ఇవేవీ చెప్పకుండా మతమార్పిడులు చేస్తున్నారు. హిందూధర్మం నాలుగు చెరుగులా వ్యాప్తి కావాలి. ప్రతి ఒక్కరూ ఎవరి స్థాయికి తగ్గట్టు వారి స్థాయిలో దోహదం చేద్దాం. రాజ్యాంగ పరిధిలో పని చేస్తూ భారతదేశాన్ని పునర్నిర్మించుకుందాం.

**మీ నియోజకవర్గానికి మీ సేవలు ఎలా ఉండబోతున్నాయి?**

నా నియోజకవర్గం ఆదిమానవుల కాలంలో ఉన్నట్టు ఉందిప్పుడు. మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అనేక హత్యలు, అరాచకాలు చేసి ఒక ఆఫ్ఘనిస్తాన్‌ను తయారు చేసి వెళ్లిపోయాడు. ఇప్పుడు దాన్ని మొత్తం సరిచేసి, కిరాతకాలను తగ్గించాలి. పేదలకు చిన్న చిన్న కోరికలు రెండు గదుల ఇళ్లు, పెన్షన్లు. వారికి అవసరమైన కూడు, గుడ్డ, నీడ, వైద్యం, విద్య, ఉపాధి అందించాలి. ఒకప్పుడు విద్య, వైద్య రంగాల్లో వ్యత్యాసాలు ఎక్కువ ఉండేవి కావు. ఇప్పుడు పెరిగిపోయాయి. వాటిని తగ్గించాలి. అందుకోసం ప్రభుత్వం నా నిధుల వాటాను నాకివ్వాలి.

**ఇక మీదట సెప్టెంబర్ 17 ఎలా జరుగుతుందనుకోవచ్చు?**

అది విమోచన దినంగానే జరగాలి. పాతం నిజాం భాగాలు (కర్ణాటక, మహారాష్ట్ర) విమోచన దినం జరుపుతున్నాయి. ఇక్కడ ఎందుకు చేయరు? ఇద్దరికి భయపడతారా?

**కాళేశ్వరం ప్రాజెక్టు కింద కప్పెట్టిన సత్యాల మాటేమిటి?**

ఆరువందల సంవత్సరాల కిందట రాణి రుద్రమ గొలుసు కట్టు విధానంతో చెరువుల నిర్మించింది. వ్యవసాయానికి సమస్య లేకుండా చేసింది. కాళేశ్వరం ప్రపంచ జలవనరుల మేధావుల సాంకేతిక పద్ధతులకు వ్యతిరేకంగా కట్టారు. నిపుణులు, ఇంజినీర్లు వ్యతిరేకించారు. ఇప్పటికే సగం కూలింది. దీనివల్ల ఏం వచ్చింది?

ఐదేళ్లలో రూ.17 కోట్ల కరెంటు బిల్లు. 262లో 152 క్యూసెక్కులు రివర్స్ పంపింగ్ చేశారు. రిజర్వాయర్లు 25 లక్షల క్యూసెక్కులతో ఆరువేల ఎకరాలు పండింది. 13లక్షల పైన వ్యయం అయింది. ఈ వడ్లు తింటే ప్రపంచంలో ఏ రోగమైనా తగ్గుతుందని మార్కెటింగ్ చేయాలనుకున్నాడు కేసీఆర్. పక్క రాష్ట్రంలోలా ఈ మాజీ ముఖ్యమంత్రి మీద కూడా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.


– జాగృతి డెస్క్



2014 నుండి ఇప్పటివరకు రద్దు చేసిన కాలం చెల్లిన చట్టాల సంఖ్య 1562



# అటల్జీ ప్రత్యేకతకు మచ్చు తునక



వాజపేయి

మృత్యువును ఎవరూ రెచ్చగొట్టరు, దాన్ని సవాల్ చేయరు. కాని మన యుగపురుషుడు అటల్ బిహారీ వాజపేయి ఆ పనిచేసి చూపెట్టారు.

సన్నద్ధమైంది – మృత్యువు సన్నద్ధమైంది
కలయబడాలన్న సంకల్పం లేకుండినది
ఏ మలుపులోనో కలవాలన్న వాగ్దానము చేయలేదు
దారిలో అడ్డుగా నిలుచున్నది
జీవితం కన్నా పెద్దదయిందనిపించినది.


నిజమే! మృతువు కన్నా గొప్పదైంది ఏదీ లేదు. మృత్యువు జీవితంలో అన్నింటి కన్నా గొప్పది, దాని ముందర జీవితం మరుగుజ్జు మాత్రమే!

అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిగా వ్యవహరించినది ముచ్చటగా మూడుసార్లు ... మొదటిసారి 13 రోజులకు మాత్రమే, రెండవసారి 13 నెలలకు మాత్రమే. మూడవసారి అక్టోబర్ 13, 1999న డజన్ పార్టీల హంగ్ ప్రభుత్వ సాధనతో పూర్తి కాలం కృతకృత్యంగా దేశానికి ప్రధానమంత్రిగా సేవలందించారు.

తన సౌమ్యత, చిరునవ్వు, పదాల వైచిత్రి అల్లికలు ప్రసిద్ధి గాంచిన మహామహుడు ఆయన.

ఆయన సంస్మరణలో ఒండు –రెండు ముచ్చట్లు–

హేమామాలిని తన అందం – అభినయంలో భారతీయ వెండితెరపై బంగారంలా మెరిసిపోయిన నటి! ఆమె మాటల్లో..'అటల్‌జీతో నేనెప్పుడూ ముఖాముఖి సమావేశంకాలేదు. బీజేపీ ప్రచారానికి మాత్రం పూనుకున్నాను, వారిని కలుసుకోదలచాను. అవకాశం లభించింది. నేను ఆయన ఎదుట కూర్చున్నంత సేపూ సంకోచిస్తూనే కనిపించారు. నేను సంకోచించాల్సింది – అసలు. సహజంగా నాతో మాట్లాడుతున్నట్లనిపించడం లేదు. అక్కడే ఉన్న ఒక మహిళను అడిగినప్పుడు, 'వాజపేయి మీ గొప్ప అభిమాని–ఫ్యాన్! 1992లో వారు మీ హిందీ ఫిల్మ్ 'సీతా ఔర్ గీతా' 25 సార్లు చూసారు. అదే మీ ముందర సంకోచానికి కారణం' చెప్పారు.



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం

పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తమ 'The Turning Point, A Journey Through Challlenges' పుస్తకంలో అటల్జీ గురించి, 'జూన్ 10, 2002న ఉదయాన అన్నా విశ్వవిద్యాల యము ఒక మనోభావన వాతావరణంలో రోజూలానే 'అనుసంధాన పరియోజనల'పై ప్రొఫెసర్ల, విద్యార్థులతో నేను పనిచేస్తుండగా నా తరగతి క్షమత 60 విద్యార్థులకే ఉండగా 350 మంది విద్యార్థులు హాజరైన చోట కృతకృత్యంగా ముగించానో లేదో – వైస్ ఛాన్సలర్ ప్రొ.కళానిధి, ప్రధానమంత్రి కార్యాలయం నుండి ఫోన్ ఎన్నోసార్లు వచ్చింది, ఫోన్ యెత్తానో లేదో అటు నుండి ప్రధానమంత్రి మీతో మాట్లాడదలచారని తెలిసింది" అన్నారు.

ఆ సమయాన్నే నా గదిలో ఫోన్ మోగింది – మొబైల్‌పై చంద్రబాబు నాయుడు, 'వాజపేయి ఎంతో అత్యంత ప్రముఖమైన మాటలు మీతో మాట్లాడదలచారు. దానిని మీరు కాదనొద్దు"– అన్నారు.

అప్పుడే అటల్‌జీతో ఫోన్ కనెక్ట్ అయ్యింది. "కలాం! మీ శైక్షణిక జీవితం ఎలా గడుస్తోంది?"

నా జవాబు – "చాలా బాగా నడుస్తోందండీ?'

వారు – "మీకోసం ఒక మంచి వార్త. మా హంగ్ అందరు నాయకులతో మాట్లాడాను. అందరూ నిర్ణయించారు. రాష్ట్రపతిగా మీ అవసరం దేశానికి యెంతైనా ఉంది. అందరూ అనౌన్స్ చేయమన్నారు. ఈ రాత్రికి దీన్ని నేను ప్రకటించలేదు. దీనికై మీ సమ్మతి కావాలి గదా! దీనికి మీనుండి "ఔను" అనే జవాబే కోరతాను, 'కాదు' – 'లేదు' – 'వద్దు'– అని కాదు" అన్నారు.

ఎన్.డి.ఏ. సర్కారు రెండు డజన్ల పార్టీల కలయిక! అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకొనే అవకాశమే ఉండదు. అసమంజసంలో పడ్డ కలాం రెండు గంటల వ్యవధి అడిగారు–ఆలోచించి చెబుతానని, "సరే! మీ సమ్మతిపైనే మేము ముందు కెడతాము. ఔననే చెప్పాలి సుమా" అన్నారు అటు నుండి వాజపేయి.

కలాం హతప్రభులయ్యారు. ఆ మాటే నా మెదడులో భ్రమించసాగింది. సరే! అనుకొని నా మిత్రులైన వైజ్ఞానికులతో కొందరు ప్రశాసనిక అధికారులతో, దగ్గరి మిత్రులతో మంతనాలాడాను. వారిలో కొందరు రాజకీయ సంబంధాలు కలవారూ ఉన్నారు. నా కనిపించింది – భారతదేశ 2002 మిషన్ దేశం ముందర, లోకసభ– రాజ్యసభ పరిషత్తు ముందర పెట్టే బంగారు అవకాశం దొరికిందని, ఆ సువర్ణ అవకాశం ప్రధానమంత్రి వాజపేయి నా కందిస్తున్నారు. సరిగ్గా రెండు గంటలు కాగానే వాజపేయికి ఫోన్‌చేసి 'నేను సిద్ధంగా ఉన్నాను' అని చెప్పాను వాజపేయి 'ధన్యవాదాలు' తెలిపారు. దాని తర్వాత 15 నిమిషాల తదుపరి ఈ కబురు సమస్త దేశానికి వెల్లడైంది. తన సంరక్షణకై ఏర్పాట్లు జరిగాయి. వందల మంది గుమిగూడారు. ఆ రోజే వాజపేయి వివక్ష నేత సోనియాగాంధీతో మాట్లాడారు. 'ఆ నిర్ణయం ఫైనలేనా' అని ఆమె అడిగగా, అటల్‌జీ సకారాత్మక జవాబిచ్చారు. సోనియాగాంధీ తమ పార్టీవారితో మాట్లాడి 'సరే' నన్నారు.

మానవతా పూజారి, సహృదయ కవియైన వాజపేయి దేశం హితం కోరి ఎన్నో నిర్ణయాలు తీసుకొన్నారు.

**– శ్రీ పెరంబుదూరు నారాయణరావు**

**(హిందీ త్రైమాసపత్రిక – 'సంకల్ప్' సౌజన్యంతో)**

# కొమ్రెల్లి మల్లన్నకు

తెలంగాణలో ప్రసిద్ధ శివాలయాలలో కొమరవెల్లి మల్లన్న ఆలయం ఒకటి. కుమారస్వామి కొంత కాలం ఈ ప్రాంతంలో తపస్సు చేయడం వల్ల కుమారవెల్లి అని పేరు వచ్చి, కాలక్రమంలో 'కొమరవెల్లి'గా, వాడుకలో 'కొమ్రెల్లి'గా మారిందని చెబుతారు. ఈ క్షేత్రాన్ని అపర శ్రీశైలంగా భావిస్తారు. అక్కడికి వెళ్లలేని వారు ఈ మల్లన్నను దర్శించుకునే ఆనవాయితీ ఉంది. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారంనాడు కల్యాణోత్సవంతో మొదలయ్యే వార్షిక జాతర ఫాల్గుణ మాసం చివరి ఆదివారం (ఉగాది ముందు వచ్చే ఆదివారం) వరకు కొనసాగుతుంది. జాతర ప్రారంభం నాడే మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు మూడు నెలల తరువాత 'అగ్నిగుండాలు' అనే కార్యక్రమంతో ముగుస్తాయి.


జానపద సంప్రదాయాలకు కాణాచిగా పేర్కొనే తెలంగాణలో సంస్కృతీ సంప్రదాయాలకు కొమరవెల్లి మల్లికార్జునస్వామి జాతర మచ్చుతునక. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వహించే ఆనవాయితీ ప్రకారం, సిద్ధిపేట జిల్లాలోని మండల కేంద్రం కొమరవెల్లిలో 11వ శతాబ్దంలో ఇంద్ర కీలాద్రి అనే కొండపై పరమశివుడు మల్లికార్జున స్వామిగా వెలసినట్లు స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. మల్లన్న మామూలుగా సంప్రదాయబద్ధంగా కనిపించే లింగాకారంలో కాకుండా శిరస్సున పడగవిప్పిన నాగేంద్రుడు ఛత్రంగా, కోరమీసాలతో గంభీర రూపుడిగా, కోరమీసాలతో నిలువెత్తు విగ్రహంగా దర్శనమిస్తున్నాడు. మణి–మల్ల అనే రాక్షసులను సంహరించేందుకు పరమేశ్వరుడు మల్హాసురుగా అవతరించినట్లు బ్రహ్మాండ పురాణగాథ చెబుతుండగా, ఆయన శివుని కుమారుడని, ఎల్లమ్మకు సోదరుడని మల్లన్న జానపద కథలో వస్తుంది.

వీరశైవమతారాధకులు మాదిరాజు, మాదమ్మ దంపతులకు పుత్రుడిగా జన్మించిన పరమేశ్వరుడు తన మహిమలతో భక్తులను కాపాడాడని, కాపాడుతున్నాడని స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. శివాంశసంభూతుడు శిరస్సున నాగేంద్రుడు పడగ విప్పి కనిపిస్తాడు. మల్లన్న పరమేశ్వరుడి అవతారమైన మార్తాండ భైరవుడు అని చెబుతారు. ఆయనను మహరాష్ట్రీయులు ఖండోబా అనే పేరిట పూజిస్తారు. ఆ రాష్ట్రంలోని నాందేడ్ జిల్లా మాలెగావ్ ప్రాంతంలో ఖండోబా (మల్లికార్జున స్వామి) ఆలయపూజారికి స్వామి కలలో కనిపించి 'కొమరవెల్లి కొండ గుహలలో వెలసినట్లు' చెప్పడంతో ఆ పూజారి ఇక్కడి వచ్చి, అక్కడ శివలింగం ఉండడంతో పూజాదికాలు మొదలు పెట్టారట. కొన్నాళ్లకు ఆ శివలింగంపై పెరిగిన పుట్ట మట్టితోనే మాలెగావ్‌లోని స్వామి విగ్రహం తరహాలో ఇక్కడ మూర్తిని తయారు చేశారని తమ పూర్వికులు చెప్పినట్లు ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు. వందల ఏళ్లనాటి మృత్తికా విగ్రహం నాటి నుంచి పూజలందుకుంటున్నప్పటికీ చెక్కు చెదరకపోవడాన్ని విశేషంగా పేర్కొంటారు. మల్లన్న ఆలయాలు గ్రామ పొలిమేరల్లోనో, అడవుల్లోనో ఉంటాయి. కొత్తగా చేపట్టే ఆలయాలను ఊరి చివరే కట్టడం ఆనవాయితీ వస్తోంది. తమను అన్ని విధాల ఆదుకునే మల్లన్నను జానపదులు 'గ్రామరక్షకుడు'గా పరిగణిస్తారని పెద్దలు చెబుతారు. 'కోరిన వరాలు ఇచ్చే కొండలలో వెలసిన కొండంత దేవుడు. నమ్మిన కొలిచిన వారిని నిరంతరం వెన్నంటి ఉంటూ సదా రక్షిస్తూ ఉంటాడు' భక్తుల విశ్వాసం.




### రెండు విధాల పూజలు

మల్లన్న దేవుడు యాదవ, లింగబలిజ సామాజిక వర్గాలకు చెందిన కేతమ్మ, మేడాలమ్మలను పెళ్లాడాడని కథనం. ఆ బాంధవ్యంతోనే ఆయా సామాజిక వర్గాల వారే ఆలయంలో పూజాదికాలు



# కోటి కోటి దండాలు




నిర్వహిస్తారు. ఇక్కడ రెండు రకాలు పూజా విధానాలు ఉన్నాయి. ఒకటి వీరశైవ ఆగమ శాస్త్ర విధానం కాగా, మరొకటి ఒగ్గు పూజారులు పూజా విధానం. మార్గశిర మాసం చివరి ఆదివారం నాడు ఆలయం తోటబావి ప్రాంగణంలో జరిగే మల్లన్న కేతమ్మ మేడాలమ్మ కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. కల్యాణోత్సవాన్ని వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తారు. రెండు వంశాల వారు అంటే... పగిడన్న వంశీయులు స్వామి వారి తరపున, మహాదేవుని వంశం వారు అమ్మవార్ల తరపున పెళ్లి తంతు నిర్వహిస్తారు. ఈ వార్షిక సంబరాలు స్వామి వారి కల్యాణోత్సవంతో మొదలై అగ్నిగుండాలనే కార్యక్రమంతో ముగుస్తాయి.

**సంక్రాంతి నుంచి ఉగాది వరకు**

మకర సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాలలో మల్లన్న జాతర జరుగుతుంది. ఆ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. బోనం, 'పట్నం' అనే విశేష కార్యక్రమాలలో మొక్కుబడులు సమర్పించుకుంటారు. సంక్రాంతి తరువాతి ఆదివారాన్ని 'పట్నం' వారంగా, రెండవ ఆదివారాన్ని బోనాలను లష్కర్ వారం అంటారు. ఆ రెండు రోజులు జంటనగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా, తమ ఆడబిడ్డ మేడలాదేవిని మల్లన్న వివాహమాడినందున ఈ వారాన్ని యాదవులు అత్యంత ప్రీతికరంగా భావిస్తారు. అలంకరించిన కొత్త కుండలో అన్నం వండి స్వామివారికి నివేదించడాన్ని బోనం అంటారు. పురుషులు ఎల్లమ్మ అవతారంలో చీర, గవ్వల పట్టీలు ధరించి బోనాలు సమర్పిస్తారు.

ఆయన సోదరిగా భావించే రేణుకాదేవికి బోనాల సమర్పణకు పసుపు కుంకాలతో అలంకరించిన పాత్రలపై దీపం వెలిగించి తలపై పెట్టుకుని భక్తులు బారులు తీరుతారు. కొందరు గజ్జెల లాగులు ధరించి వీర భద్రుడి వేషంలో వస్తారు. మరి కొందరు శివసత్తుల లాగా వస్తారు. వారి పాదతాడనంతో పాపాలు నశిస్తాయని భక్తుల నమ్మకం. బోనం కుండలను శుభ్రపరచి పాలు పితకడం లాంటి నిత్యావసరాలకు ఉపయోగిస్తారు. అలా చేయడం వల్ల సంపద, ఆరోగ్యం, పశుగణాభివృద్ధి కలుగుతుందని విశ్వాపం.




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**

**సీనియర్ జర్నలిస్ట్**


జాతర చివరిలో అంటే కామదహనం (హోలీ) పండుగకు ముందు 'పెద్ద పట్నం' అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రకృతి సిద్ధమైన అయిదు రంగులతో వేసే ముగ్గులను 'పట్నం'అని, అదే పరిమాణంలో భారీగా ఉంటే 'పెద్ద పట్నం' అంటారు. విశాలమైన ముగ్గు మధ్యకి స్వామిని ఆవాహన చేసి సామూహికంగా ఒగ్గులు వాయిస్తూ స్వామిని కీర్తిస్తారు ('పట్నం'లో వాడిన ముగ్గును జాతర తరువాత సేకరించి పంటపొలాల్లో చల్లుతారు).

మహాశివరాత్రిని లింగోద్భవ వారంగా వ్యవహరిస్తారు. లింగోద్భవ సమయంలో మల్లన్నకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఒగ్గు పూజారులు 49 వరుసలతో పెద్ద 'పట్నం' (ముగ్గు) వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మల్లన్నస్వామి ఆలయానికి కొంత చేరువలో కొండపై కొలువుదీరిన రేణుకాదేవిని ఆయన సోదరిగా భావించి భక్తులు బోనాలు సమర్పిస్తారు, జాతర నిర్వహిస్తారు.

స్వామి వారి ఎడమ చేతి గిన్నెలోని భండారు (పసుపు పొడి)ను పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. ఆలయాన్ని సందర్శించే వారంతా తప్పనిసరిగా 'భండారు ప్రసాదం' స్వీకరిస్తారు.

ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు స్వామి వారి ప్రతిష్ఠ నాడే అంకుర రూపం దాల్చిందని చెబుతారు. స్వామిని దర్శించుకునే ముందు ఆ చెట్టుకు ప్రదక్షిణ చేస్తారు. మొక్కుబడిగా కొబ్బరికాయను వస్త్రంలో చుట్టి దానికి కడతారు. రావిచెట్టుకు, అక్కడి 'వరాల బండ'కు పూజలు చేస్తే సంతానం కలుగుతుందని నమ్ముతారు. ఆలయం ఎదురుగా రథం ఆకారంలో గల కట్టడాన్ని మల్లన్న రథంగా భావించి పూజిస్తారు.

ఉగాది ముందు ఆదివారం నిర్వహించే అగ్నిగుండాలతో జాతర ముగుస్తుంది. ఆ రోజు రాత్రి భారీ పరిమాణంలో సమిధలను పేర్చి మంత్రబద్ధంగా అగ్ని ప్రతిష్ఠ చేసి కణకణలాడే నిప్పుల మీదుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మూడుసార్లు దాటిస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు వారిని అనుసరించి, మల్లన్న దర్శనం చేసుకుంటారు.

గతంలో ఇక్కడ ఈ మూడునెలలో ఏడు వారాల పాటే జాతర (సత్తేటి వారాల జాతర) జరిగేదట. భక్తుల రద్దీ కూడా అంతంత మాత్రమే కావడంతో ఆలయం ఈ మాసాల్లోనే ఆలయం తెరిచి ఉండేది. రానురాను జాతర సమయంతో పాటు ఇతర సమయాల్లోనూ భక్తుల రద్దీ పెరగడంలో నిత్య పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే నీటి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 'మల్లన్న సాగం' అని పేరు పెట్టింది.

**ఎలా చేరుకోవాలి?**

హైదరాబాద్ నుంచి సుమారు 85 కి.మీ., వరంగల్ నుంచి 110 కి.మీ., సిద్దిపేట నుంచి 24 కి.మీ. దూరంలోని ఈ క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సమీపంలోని ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కొండ పోచమ్మ ఆలయానికి జాతర సమయలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. మల్లన్న ఆలయానికి సుమారు 28 కి.మీ. దూరంలోని కోటి లింగేశ్వర స్వామి, సుమారు 45 కి.మీ. దూరంలోని వర్గల్‌లోని శ్రీ విద్యా సరస్వతీదేవి ఆలయం ఉంది. తెలంగాణలో బాసర తరువాత విశేష ప్రాచుర్యం పొందిన జ్ఞాన దేవత ఆలయం ఇది. ★



**నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల మార్పు, సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో సగానికి పైగా తిరిగి టిక్కెట్‌లు ఇవ్వబోమని జరుగుతున్న ప్రచారంతో వైసీపీలో ఓటమి భయం పట్టుకుందని తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వంపై గల వ్యతిరేకతను ఎమ్మెల్యేలపై రుద్ది తాను తప్పించుకోవాలని చూస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. అసలు తామే ముఖ్యమంత్రిని మార్చాలనుకుంటున్నామని అంటున్నారు. అభ్యర్థులను చూసి ఓట్లేసే రోజులు కావివి. పార్టీ అధినేతను చూసి ఓట్లేయడం అనేది రెండు దశాబ్దాల నుంచి జరుగు తోంది. ఇందులో ఏదో ఒక పార్టీని ఉదాహరణగా చూపాల్సిన పనిలేదు. జాతీయ పార్టీల నుంచి స్థానిక పార్టీల వరకు అన్నిటి పరిస్థితి ఇంతే. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిస్థితి మరింత ఎక్కువ. ముఖ్యంగా వైసీపీ అధినేత తానే అన్నీ అయి పాలన సాగిస్తూ, ఎమ్మెల్యేలను నిమిత్తమాత్రులను చేశారు. అయిదేళ్లలో ఆయనతో పది నిమిషాలు మాట్లాడిన ఎమ్మెల్యేలు పదిమంది కూడా లేరంటే అతిశయోక్తి కాదు. వైసీపీ గెలిచిన 151 నియోజకవర్గాల్లో ఒక్కదానిలోను ఒక్క పనిచేయలేదు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో సమస్యలను పరిష్కరించలేదు. అసలు ఈ ప్రభుత్వం వీటి జోలికి పోలేదు. కేవలం నవరత్నాలనే సంక్షేమ పథకాలను ఆటూ ఇటూగా మాత్రమే అమలుచేశారు తప్పించి అభివృద్ధి మాట మరిచారు. పైగా వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చి ప్రజాప్రతినిధుల ప్రాధాన్యతను తగ్గించారు. గ్రామం నుంచి నగరం వరకు కనీసం ధ్వంసమైన రహదార్లకు మరమ్మతులు చేసుకోలేని అసహాయత ఉన్న ఎమ్మెల్యేలను ప్రజలు ఈసడించుకున్నారు.**

# వ్యతిరేక వెల్లువతో ఓటమి భీతి

ఎన్నికల ముందు ప్రజలతో కలసి తిరిగిన జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలు జరిగి, ముఖ్యమంత్రి అయ్యాక కనీసం ముఖం కూడా చూపించలేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఇబ్బందులు పెట్టారు. అన్ని వర్గాలు ఆయన పట్ల ఆగ్రహంతో ఉన్నాయి. ఈ ఆగ్రహం రెండేళ్ల క్రితమే కనిపించింది. 108 నియోజక వర్గాల్లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. అప్పుడే పార్టీ పట్ల ప్రజల అభిప్రాయం తెలిసిపోయింది. 2024 ఎన్నికల్లో ఆ పార్టీ చిత్తుగా ఓడిపోనుందని ప్రజలే బాహాటంగా చెప్పుకుంటున్నారు. అలా మాట్లాడని వారు వీరికి రెండింతలు ఉండొచ్చు. ఈ పరిస్థితుల్లో తన ఓటమి ప్రచారాన్ని విని తన తప్పిదాలకు ఎమ్మెల్యేలను బాధ్యులను చేస్తున్నారు ముఖ్యమంత్రి. ఈ నెలలో 11 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులను మార్చేశారు. రెండో జాబితా నేడో రేపో రానుందని అంటున్నారు. జనవరిలో దాదాపు సగానికిపైగా ఇన్‌ఛార్జుల మార్పు, నియోజకవర్గాల మార్పు జరుగుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు.

**బానిసలుగా చూశారు**

ముఖ్యమంత్రి తమను బానిసల్లా చూశారని ఎమ్మెల్యేలు ఆవేదనతో చెబుతున్నారు. సీఎం కాగానే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకూ దూరమయ్యా రంటున్నారు. ‘మమ్మల్ని నేరుగా కలవరు. నియోజక వర్గాల అభివృద్ధి, సమస్యల గురించి చెప్పుకొనే అవకాశమివ్వడంలేదు. ఈ నాలుగున్నరేళ్లలో సీఎంను వ్యక్తిగతంగా ఒకసారి కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు సగం మందే ఉంటారు’ అని చెబుతున్నారు. మిగిలిన సగం మందికి ఒక్కసారి కూడా సీఎంను నేరుగా కలిసే అవకాశమే రాలేదట. అతి కొద్దిమంది మాత్రమే ఆయనను తరచూ కలుస్తారట. ఒకవేళ తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లినా ఆయన దర్శనం లభించదని, తాను నియమించు కున్న ప్రతినిధులను మాత్రమే కలసి రావాల్సిందే అంటున్నారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు వెళ్లినపుడు, అసెంబ్లీ సమావేశాలు, పార్టీ కార్యక్రమాల సందర్భంగా కూడా తమకు నేరుగా కలిసే అవకాశం లేదని ఎమ్మెల్యేలు వాపోతున్నారు. ఆయన ఎదురుపడినప్పుడు దూరం నుంచి నమస్కరించడమే తప్ప నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. మహా అయితే వినతి పత్రం ఇవ్వొచ్చు. జిల్లా పర్యటన సమయంలో అయితే ముఖ్యమంత్రి అల్లంతదూరాన కనిపిస్తారు. హెలిప్యాడ్ వద్దకు ప్రొటోకాల్ ప్రకారం ఎవరెవరు రావాలో ముందుగా జాబితా విడుదల చేస్తారు. జాబితాలో పేర్లు ఉన్నవాళ్లను మాత్రమే భద్రతా సిబ్బంది పంపుతారు. మిగిలిన నేతలు ఎంతటి ప్రజాదరణ ఉన్నవారైనా, కేంద్ర మాజీ మంత్రులైనా సరే నిర్దాక్షిణ్యంగా గెంటేస్తారని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి వేదిక మీదకు వచ్చే సమయానికి నేతలు కొన్ని నిబంధనలు పాటించాలి. ఆయన వేదిక మీదకు రాకముందే కుర్చీలకు అతికించిన పేర్లను బట్టి వరుస క్రమంలో ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కూర్చోవాలట. వేదికపైనే ఉన్నామని అతి చనువు ప్రదర్శించి ఆయన దరిదాపులకు వెళ్లేందుకు ప్రయత్నిస్తామంటే కుదరదు. ఇన్ని అవమానాలు నాలుగున్నరేళ్లుగా పడ్డామని, చెబుతున్నారు.

**వలంటీర్ల కన్నా....**

వలంటీర్‌కు ఉన్న విలువ కూడా తమకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యేలు ఎన్నో సార్లు వాపోయారు. కుదిరితే దందాలు చేసుకోవడం.. లేకపోతే సైలెంట్‌గా ఉండటం మినహా వారు చేసిందేమీ లేదు. ఏం చేసినా మొత్తం అధినేతే. సంక్షేమ పథకాల విషయంలో కానీ, ఇతర అంశాల్లో కానీ ఎమ్మెల్యేల ప్రమేయం లేదు. తమకన్నా వలంటీర్లు నయమని ఎమ్మెల్యేలు అనుకునే పరిస్థితి వచ్చింది. ఓ వైపు నిధులు ఇవ్వకుండా మొత్తం అధికారాలు సీఎం వద్ద దఖలు పడగా, చిన్న చిన్న పనులు కూడా వలంటీర్లతో చేయించుకోవాల్సిన దుస్థితిలో ఉన్నారు. వాస్తవానికి జగన్మోహన రెడ్డి సీఎం కాకముందు చేసిన పాదయాత్రలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలే వెన్నంటి ఉన్నారు. జనసమీకరణ, యాత్ర ఖర్చులు భరించామని, పార్టీ అధికారంలోకి రావడానికి పార్టీ అధినేతతో పాటు తాము కూడా కారణమే కదా? అని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచాక ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గానికి రూ. కోటి ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేసిన పరిస్థితి లేదు. కాగా, బిల్లుల వస్తాయని పార్టీ నేతలతో చేయించిన పనులకు సంబంధించి, బిల్లులు మాత్రం రూ. కోట్లకు కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. తమనే కాదని, చివరికి సొంత క్యాడర్‌నూ సీఎం దివాలా




తీయించారంటున్నారు.

ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని అన్ని సర్వేలూ చెబుతున్నా, ఈ నిజాన్ని అంగీకరించేందుకు సీఎం సిద్ధంగా లేరు. పైగా ఎమ్మెల్యేలపైనే తప్ప ప్రభుత్వంపై అసంతృప్తి లేదని, ఎమ్మెల్యేలందర్నీ మార్చేస్తే వైసీపీకే తిరిగి పట్టం కడతారన్న ఆలోచనలో అధినేత ఉన్నారు. తాను గొప్ప పాలన అందిస్తున్నానని, సర్వేలో తనకు అరవై శాతానికి పైగా సానుకూలత వచ్చిందని బలవంతపు సర్వేలతో చెప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేలను ఇప్పుడు బలి పశువుల్ని చేస్తున్నారు. అభివృద్ధి చేయాల్సింది ప్రభుత్వమేనని.. రోడ్లు, నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత సీఎంపైనే ఉందని జనం అనుకుంటున్నారని, అయితే తమపై నెపం మోపాలని చూస్తున్నారని ఎమ్మెల్యేలు అంటున్నారు.

**బెడిసికొట్టిన ముందస్తు ప్రచారం**

ఓపక్క ఎలాంటి అభివృద్ధి లేక ఊళ్లు అల్లాడుతున్నాయి. ఓ రోడ్డు వేయలేదు.. ఓ మురుగుకాల్వ కట్టలేదు. వీధి దీపాలు వెలగవు. ఉద్యోగాల భర్తీ లేదు. కొత్త పరిశ్రమలు రాలేదు. కనీసం ఇంటికో నిరుద్యోగి ఉన్నాడు. సర్పంచ్‌లకు అధికారాల్లేవు.. వారి నిధులన్నీ ప్రభుత్వం ఊడ్చేసింది. ధరలు పెరిగితే అదుపు చేసే శక్తి లేదు. పలురకాల పన్నులు వేసి ప్రజలపై మరింత భారం మోపారు. ఈ పరిస్థితుల్లో గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. సంక్షేమ పథకాలు 87 శాతం ఇళ్లకు చేరినందున, 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని ముఖ్యమంత్రి ఊదరగొట్టారు. పథకాల గురించి జనాలకు వివరించి ఓట్లేయించుకోవాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలిచ్చారు. సమస్యలు పరిష్కరించకుండా జనంలోకి వెళితే నిలదీతలు తప్పవని.. ఏం సమాధానం చెప్పాలని కొందరు ఎమ్మెల్యేలు వాపోయారు. ప్రచారానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. అయితే ముఖ్యమంత్రి విధేయులు మాత్రం దానిని కొట్టి వేశారు. అయితే వారికి గ్రామాలకు వెళితే గానీ ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలియలేదు. అభివృద్ధి పనులపై మహిళలు ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలు నీళ్లునమిలే వారు. ఈ నేపథ్యంలో ఐపాక్ ఇతర సంస్థలతో చేసిన సర్వేలలో ఓటమి ఖాయమని తెలీడంతో అభ్యర్థులను మారిస్తే పార్టీ గెలుస్తుందని భావించడం వైసీపీ అధినేత అపరిపక్వత అని ఎమ్మెల్యేలు చెబుతున్నారు.

**తప్పిన మాట**

'సీపీఎస్ రద్దుచేస్తాం, ప్రత్యేక హోదా తెస్తాం. మద్యపాన నిషేధం అమలుచేస్తాం. విశాఖకు రైల్వే జోన్ తెస్తాం. విశాఖకు మెట్రో తెస్తాం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపుతాం. పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెలిగొండ, రామాయపట్నం పోర్టు పనులు పూర్తి చేస్తాం. పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్, బస్సు చార్జీలు తగ్గిస్తాం. 30 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడతాం. 2.30 లక్షల ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తాం. మెగా డీఎస్సీ వేస్తాం. ప్రతి ఏడాది జాబ్ క్యాలండర్ ప్రకటిస్తాం, ఎంత మంది పిల్లలున్నా అమ్మఒడి ఇస్తాం. వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ లు రూ.3 వేలు చేస్తాం. ఎన్ని లక్షలు అయినా ఉచిత వైద్యం అందిస్తాం. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా ప్రభుత్వ హాస్పిటల్స్ రూపొందిస్తాం. డ్వాక్రా రుణాలు మొత్తం మాఫీ చేస్తాం. సన్న బియ్యం పంపిణీ ఇస్తాం. ఎన్నికల నాటికి ఉన్న రుణాలన్నీ మాఫీ చేస్తాం. ప్రతి మండలంలో వృద్ధాశ్రమం కడతాం. ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్ కడతాం. రైతుల కోసం పగటిపూట 9 గంటల విద్యుత్ ఇస్తాం. పది రోజుల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇస్తాం. రూ.4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల నిధి ఇస్తాం. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఇస్తాం. గిట్టుబాటు ధర గ్యారంటీ ఇస్తాం. ఉచితంగా బోర్లు వేస్తాం. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తాం. ప్రతి రైతుకి రూ.12,500/- ఇస్తాం.

ప్రతి నియోజకవర్గంలోనూ డీఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీరు కల్పిస్తాం. ఇంటి నిర్మాణం మీద పావలా వడ్డీకే రుణం ఇస్తాం. పేదల ఇళ్లకు రూ.3 లక్షలు మాఫీ చేస్తాం. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ చేస్తాం. వైద్య మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం. ఏఎన్ఎంల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేస్తాం. బ్రాహ్మణ కార్పొరేషన్‌కి ఏడాదికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తాం. కాపుల కోసం ఏడాదికి రూ.2000 కోట్లు ఇస్తాం. రూ.2వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో ఉన్న చెరువులన్నీ పునరుద్ధరిస్తాం. కౌలు రైతులకు రూ. 7 లక్షల బీమా ఇస్తాం.

జిల్లాకో విమానాశ్రయం, జిల్లాకో వైద్య కళాశాల, నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడతాం. ఇలా ఇస్తాం.. చేస్తాం.. తెస్తాం..కడతాం..' అని చెప్పడం తప్ప చేసిందేమీ లేదు. ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అమలు చేయడంలో చతికిలపడింది. సీఎం చెప్పిన సంక్షేమం సంక్షోభంలో పడింది. ఇలా అన్ని వర్గాలకు హామీలిచ్చి దేనిని నెరవేర్చని వైసీపీ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ముఖ్యమంత్రి ఎందరిని మార్చినా ఓడిపోవడం మాత్రం ఖాయమనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# ప్రజాస్వామ్య విలువల

**ఇటీవలికాలంలో కొందరు పార్లమెంట్ సభ్యులు ప్రజాహిత సమస్యలపై హేతుబద్ధ చర్చకంటే సున్నిత అంశాలను లేవనెత్తడానికే ఉత్సాహపడుతున్నారు. వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్న అలాంటి పరిణామాలు అంతకంతకు పెరుగుతున్నాయి. సమావేశాలను స్తంభింప చేయడమే పరమావధిగా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. ఇది ప్రజాస్వామిక ప్రక్రియలలో ఆందోళన రేకెత్తించడమే కాదు, పార్లమెంట్ చర్చల మీద ప్రజాప్రతినిధుల నిబద్ధతను ప్రశ్నార్థకం చేస్తోంది.**

దేశభద్రత రీత్యా సున్నిత అంశాలను లేవనెత్తి అనవసర గందరగోళం సృష్టిస్తున్న వీరి వ్యవహార శైలిని ఏ విధంగా పరిగణించాలి? డీఎంకే సభ్యులు సెంథిల్‌కుమార్, తృణమూల్ కాంగ్రెస్ ఎం.పి. మహువా మెయిత్రా, మహమ్మద్ అబ్దుల్లా, బీఎస్‌పీ ఎంపీ డానిష్ అలీలు వివాదాలు సృష్టించి వార్తల్లో నిలవడం ఇందుకు తాజా ఉదాహరణ. డీఎంకే సభ్యులు హిందీ భాషపై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించడంతో వాటిని రికార్డుల నుంచి తొలగించారు. జమ్ము-కశ్మీర్ రిజర్వేషన్ అమెండ్‌మెంట్ బిల్ (2023)పై కూడా ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేసిన అభిప్రాయం కూడా వివాదం సృష్టించడంతో తరువాత క్షమాపణలు చెప్పారు.

**మహువా మొయిత్రా**

ఒక పారిశ్రామికవేత్తకు అనుకూలంగా ప్రశ్నల డిగినందుకు ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా పార్లమెంట్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ సిఫారసు మేరకు ఈ చర్య తీసుకున్నప్పటికీ, ఆమెలో తప్పుచేశానన్న భావం కించిత్ కూడా కనిపించకపోవడం గమనార్హం. పైగా పార్లమెంట్ నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ప్రజాస్వామ్యంపట్ల, పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల ఆమెకు ఎంతమాత్రం విశ్వాసం లేదన్న సత్యాన్ని నిరూపిస్తోంది. పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేసిన తర్వాత కూడా, సభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు మహువా మొయిత్రాకు మద్దతుగా నినాదాలు చేస్తూ గలభా సృష్టించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ఎథిక్స్ కమిటీ ముందు తనను తాను సమర్థించుకునే అవకాశం ఇచ్చినప్పటికీ ఆమె ఆ అవకాశాన్ని జారవిడుచుకున్నందున, పార్లమెంట్‌లో మాట్లాడటానికి స్పీకర్ ఓం బిర్లా ఆమెకు అవకాశం ఇవ్వలేదు. గత అక్టోబర్‌లో బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే మొయిత్రాపై పార్లమెంట్‌లో ఒక ఫిర్యాదు చేశారు. దీని ప్రకారం ఆమె గౌతమ్ ఆదానీ గ్రూపు లక్ష్యంగా, దర్శన్ హీరానందానీ అనే వ్యాపారవేత్తకు అనుకూలంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు సంధించారన్నది ఆయన ఫిర్యాదులోని అభియోగం. ఇందుకు ప్రతిఫలంగా ఆ వ్యాపారవేత్త నుంచి అనుచిత ప్రయోజనాలు పొందారని ఆయన ఆరోపించారు. దీనిపై విచారించేందుకు ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ విచారణలో ఈ ఆరోపణలు నిజమని తేలడంతో ఆమెను పార్లమెంట్ నుంచి బహిష్కరించడం తదనంతరం జరిగిన పరిణామం. మరి ఎథిక్స్ కమిటీలో విపక్షాల సభ్యులు



మొహువా మొయిత్రా



డానిష్ అలీ

కూడా ఉంటారు కనుక ఈ కమిటీ వివక్షా పూరితంగా వ్యవహరించిందనడానికి వీల్లేదు. కానీ మొయిత్రా మాత్రం ఎథిక్స్ కమిటీ విచారణను కూడా తప్పుపట్టారు. ఆమెకు వత్తాసుగా విపక్షాలన్నీ ఏకమవడం మరో విచిత్రం! ఇక్కడ ఒక అనైతిక పనికి పాల్పడి, దాన్ని తప్పు అని తేల్చినప్పుడు, అంగీకరించకపోవడానికి ప్రధాన కారణం ఏమిటనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. ఇక్కడ మొయిత్రా విపక్షాల అండ చూసుకొని రెచ్చిపోతుంటే, ప్రతి పక్షాలు నైతికతను పక్కన బెట్టి కేవలం ప్రభుత్వ వ్యతిరేకతే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్లడం వర్తమాన చరిత్ర.

**డానిష్ అలీ**

బీఎస్‌పీ పార్లమెంట్ సభ్యుడు డానిష్ అలీ వివాదాస్పద వైఖరితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. నిజానికి దేవెగౌడ సిఫారసుతో బీఎస్‌పీ ఆయనకు టిక్కెట్ ఇచ్చింది. ఇదే విషయం సస్పెన్షన్ లేఖలో పేర్కొన్నది కూడా. బీఎస్‌పీ ప్రస్తుతం కేంద్రం పట్ల కొంతమేర సానుకూల వైఖరితో ఉంది. పార్టీ వైఖరికి భిన్నంగా డానిష్ అలీ, త్రిపుల్ తలాఖ్, కాశ్మీర్ బిల్లు వంటి అంశాలపై ప్రభుత్వ వ్యతిరేక వైఖరిని అవలంబించారు. మొహువా మొయిత్రా బహిష్కరణను కూడా ఆయన నిరసించడమే కాకుండా లోక్‌సభ నుంచి విపక్షాలతో కలిసి వాకౌట్ చేయడం బీఎస్‌పీ నాయకత్వానికి ఆగ్రహం తెప్పించింది. ఈ నేపథ్యంలో పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయన్ను పార్టీనుంచి బహిష్కరించారు.

**మహమ్మద్ అబ్దుల్లా**

డీఎంకే సభ్యుడు మహమ్మద్ అబ్దుల్లా రాజ్యసభలో మాట్లాడుతూ, కశ్మీర్ సమస్యను ద్రవిడవాద ఉద్యమంతో పోలుస్తూ మాట్లాడటం మరో వివాదాన్ని లేవనెత్తింది. చివరకు రాజ్యసభ ఛైర్మన్ జగదీష్ ధన్‌కర్ ఆయన్ను తీవ్రంగా హెచ్చరించే వరకు వెళ్లింది. జమ్ము-కశ్మీర్ బిల్లును, 370 అధికరణాన్ని ఎత్తివేయడాన్ని ప్రశ్నిస్తూ ఆయన ఇవి కేవలం సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేవిగా ఉన్నాయంటూ వ్యాఖ్యానించడంతో రాజ్యసభలో గందరగోళం చెలరేగింది. ఆయన వ్యాఖ్యలు దేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పునే ధిక్కరించేవిగా ఉన్నాయంటూ అధికారపక్ష సభ్యులు ఎదురుదాడికి దిగారు. చివరకు రాజ్యసభ ఛైర్మన్ ధన్‌కర్ కలుగజేసుకొని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు మనమంతా కట్టుబడి ఉండాలని హితవు పలికారు. అయితే కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ లేచి, ప్రతి సభ్యుడికి తన

అభిప్రాయాన్ని చెప్పే స్వేచ్ఛ ఉన్నదంటూ డీఎంకే సభ్యుడిని సమర్థించడం ఆ పార్టీ వైఖరిని స్పష్టంగా తెలియజేస్తోంది. స్వేచ్ఛ పేరుతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం తగదని ధన్‌కర్ హితవు చెప్పినా తాను సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడం లేదంటూ తనను తాను సమర్థించుకోవడం ఎంతవరకు సమంజసం? పైగా "ప్రతి జాతికి స్వీయ నిర్ణయాధికారం ఉంటుంది" అన్న పెరియార్ వ్యాఖ్యలను ఉటంకించి వివాదాన్ని మరింత తీవ్రం చేయడం ఆయన ఉద్దేశ పూర్వక వైఖరికి నిదర్శనం. స్వేచ్ఛ పేరుతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడటమేంటి? దేశ హితాన్ని సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోకపోతే ఎట్లా?




# కు పాతర

### స్వేచ్ఛకు పరిమితులుండాలి

రాజ్యాంగంలోని 105,194 అధికరణాలు పార్లమెంట్‌లో సభ్యులకు వాక్ స్వాతంత్ర్యపు హక్కును పరిరక్షిస్తున్నాయి. అయితే ఈ హక్కును ఉపయోగించుకునే ముందు పార్లమెంట్ సభ్యులు ముఖ్యంగా మూడు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. మొదటిది, సభ నియమ నిబంధనలకు లోబడి ఉండటం, వాక్‌స్వాతంత్ర్య హక్కును ఉపయోగించుకునే సమయంలో తన వాదనకు అనుగుణంగా సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడం, ప్రజా ప్రయోజనాల అంశాలను లేవనెత్తి, వాటిపై తన వాదనను వినిపించడం. రాజ్యాంగంలోని అధికరణం 105 క్లాజ్ (1),(2)లు పార్లమెంట్‌లో ఒక సభ్యుడు మాట్లాడిన అంశం లేదా ఆయన చేసిన ఓటింగ్‌పై కోర్టుల్లో సవాలు చేయడానికి వీల్లేకుండా రక్షణ కల్పిస్తున్నాయి. కాగా రాజ్యాంగంలోని 105 అధికరణంలోని (4)వ క్లాజు బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులకున్న ప్రయోజనాలను మన పార్లమెంట్ సభ్యులకు కూడా కల్పిస్తోంది. అయితే పార్లమెంట్ సభ్యుడు తాను వాస్తవమని నమ్మిన లేదా కనీసం విచారణార్హత కలిగిన అంశాలను లేవనెత్తే స్వేచ్ఛను కలిగివుంటాడు. పార్లమెంట్ సక్రమంగా పని చేయాలంటే ప్రాథమికంగా ఇది అవసరం కూడా. ముఖ్యంగా ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, అధికార దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయని భావించినప్పుడు ఈ స్వేచ్ఛను సభ్యులు ఉపయోగించుకోవచ్చు. ఇటువంటి సందర్భాల్లో సభ్యులు సవివరమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉండదు. కానీ ఇదే కారణం, సభ్యులు హక్కుల పేరుతో స్వేచ్ఛను దుర్వినియోగం చేయడానికి దోహదపడుతోంది. నిజానికి సభ్యుల వాక్ స్వాతంత్ర్యం పార్లమెంట్ సమగ్రతను కాపాడటమే కాదు, అమాయకులపై కార్యనిర్వాహక శాఖ అణచివేత చర్యలను నిలదీయడం ద్వారా ఆ శాఖను జవాబుదారీ చేయడం సాధ్యం కాగలదన్నది ఎంత నిజమో, ఒక సభ్యుడు రాజ్యాంగం తనకు కల్పించిన హక్కులను దుర్వినియోగం చేసినట్లయితే, పార్లమెంటరీ చట్టాల ప్రకారం శిక్షార్హుడవడం కూడా అంతే నిజం.

### దేనిపై విపక్షాల పోరాటం?

ప్రస్తుతం విపక్షాలు దేశ అనైక్యత కోసం ఐక్యంగా పోరాడుతున్నట్టు పార్లమెంట్ సమావేశాలను పరిశీలిస్తున్న వారికెవరికైనా ఇట్టే అర్థమవుతుంది. కొన్ని సందర్భాల్లో పార్లమెంట్ రూల్ బుక్‌ను విసిరికొట్టడం, టేబుల్‌పై నిలబడటం వంటి సభ్యుల చర్యలను కూడా గమనిస్తున్నాం. నిజానికి ఇవన్నీ పార్లమెంట్ పవిత్రతను భగ్నం చేసే దుశ్చర్యలే. ఎందుకంటే పార్లమెంట్, ప్రజాస్వామ్యానికి దేవాలయం వంటిది. మరి ఈ పవిత్రతను కాపాడాల్సిన సభ్యులే దాన్ని దెబ్బతీసే రీతిలో ప్రవర్తిస్తుండటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. కొన్ని సందర్భాల్లో సభ్యులు తమ తప్పుడు ప్రవర్తనకు క్షమాపణలు చెప్పినా, చాలా సందర్భాల్లో వారందుకు అంగీకరించడంలేదు. తమ ప్రవర్తనను 'గొప్ప'దిగా భావిస్తుండటమే బహుశా ఇందుకు కారణమని భావించాలేమో! పార్లమెంట్ సభ్యుల ప్రవర్తన అభ్యంతరకరంగా ఉండటం, కొన్ని వివాదాస్పద అంశాలను ప్రస్తావించడం, తమ మాటే నెగ్గాలన్న పట్టుదలకు ప్రధాన కారణం. వీరిలో చాలామందికి తగిన విద్యార్హతలు లేదా విషయ పరిజ్ఞానం లేకపోవడంగా భావించాలి. విషయ పరిజ్ఞానం ఉన్నవారు తమ అర్థవంతమైన వాదనతో అధికార పక్షాన్ని నిలదీయవచ్చు. కానీ అది లేనివారు, అరుపులు కేకలతో సభకు అంతరాయం కలిగించడం ద్వారా గుర్తింపు పొందాలనుకోవడం



**జమలాపురపు విఠల్‌రావు**

దురదృష్టకరం. కొందరు వితండవాదంతో తమ వాదనను, దేశ భద్రత రీత్యా అత్యంత సున్నిత అంశాలతో సరిపోల్చి అతిచిన్న సమస్యను లేదా లేని సమస్యను కెలికి పతాక శీర్షికలకెక్కాలన్న ఉద్దేశం మరొకటి. ఇంకొందరు సభ్యులు తాము కావాలనే తప్పుడు పనులకు పాల్పడి, దాన్ని మొండిగా సమర్థించుకోవడం లేదా విచారణను ఎదుర్కొనాల్సి వచ్చినప్పుడు లేనిపోని అభాండాలు వేసి తప్పును ఎదుటివారిపైకి నెట్టేయాలని చూడటం లేదా కోర్టులను ఆశ్రయించడం, ఎప్పుడూ ప్రచారంలో ఉండాలను కోవడం కూడా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్నాయి.

### విలువలు పతనం

ప్రస్తుతం పార్లమెంట్‌లో భద్రతావైఫల్యంపై విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీ యడంలో తప్పులేదు. కానీ ఇందుకోసం అనుచితంగా ప్రవర్తించాల్సిన అవసరం లేదు. విపక్ష సభ్యుల అనుచిత ప్రవర్తన కారణంగా లోక్‌సభ నుంచి 13మంది, రాజ్యసభ నుంచి ఒక సభ్యుడు సస్పెన్షన్‌కు గురయ్యారు. పార్లమెంట్ భద్రతపై కంటే, విజిటర్స్ పాస్‌ను మంజూరు చేసింది బీజేపీ ఎంపీ కావడం విపక్షాలకు ఒక అస్త్రంగా మారింది. వీరి గొడవకు ప్రధాన కారణం ఇదే! ఇదే ఏ విపక్షపార్టీ ఎంపీనో ఇటువంటి పాస్‌లు ఇచ్చి ఉన్నట్లయితే, వారు ఇంతటిస్థాయిలో విరుచుకు పడేవారా? అన్న ప్రశ్నకు విపక్షాలు ఏం సమాధానం చెబుతాయి? ప్రస్తుతం దేశంలోని ప్రతిపక్షాలు తమవారిని కాపాడుకోవడం (తప్పు చేసినప్పటికీ), ఎదుటి వారిపై విరుచుకు పడటం అన్న పంథాను అనుసరిస్తున్నాయి తప్ప, దేశహితంపై వాటికి పెద్దగా పట్టింపు ఉండక పోవడం, విలువల పతనానికి నిదర్శనం. నిజానికి పార్లమెంట్ భద్రత, పార్లమెంట్ సచివాలయం పరిధిలోనిదని, అయినప్పటికీ ఈ సంఘటనపై విచారణ జరుగుతోందని లోక్‌సభ స్పీకర్ చెప్పి నప్పటికీ విపక్షాలు శాంతించలేదు. దేశ ప్రజలు తమను గమనిస్తున్నారని, ఎవరిది తప్పో, ఎవరిది ఒప్పో వారికి స్పష్టంగా తెలుస్తున్నదన్న సంగతిని వీరు విస్మరిస్తున్నారు. మీడియా విడమరచి చెప్పాల్సిన అవసరంలేదు. ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలే నిజానిజాలు తెలుసుకోగలుగుతున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# సాహసోపేత సుచేత

భారతీయ నారినేను
భాగ్య సుధాధారను
లలిత నవోషస్సు వోలె విలసిల్లిన బాలను
కాలచక్ర గమనములో
వేవేగము సాగిపోతి
నాగరక పథమ్మది యని
సాగిపోతి నెచ్చటికో
గగనాంగణ యొక్క మహత్
కాంతి కలితమై వెలిగెను
అవనీ స్థలి నవ చైత
న్యాంకితమై విలసిల్లెను
భారతీయ భావి భాగ్య
భానుదీప్తినైతి నేను
భారతీయ నారి నేను
భాగ్యసుధా ధారను..'

ఆ నారి – సుచేత, పుణె (మహారాష్ట్ర) ప్రాంతీయ. ఆసియా ఖండంలోనే ఎంతో పెద్దదైన గోబి ఎడారిని ఫలప్రదంగా దాటిన సాహస మహిళామణి. ఎడారిలో సాహసయానం సాగించిన ప్రథమ భారతీయగా రికార్డు సృష్టించారు.

చేతనే అంటే చైతన్యం, పరిజ్ఞానం, సూక్ష్మ దర్శనం. మన దేశ సాహసికురాలు సుచేతా కడేత్కర్‌లో మరో ప్రత్యేకత ఉంది. మిన్ను విరిగి మీద పడినా చెక్కు చెదరనంత అత్యంత దృఢమైన పట్టుదల.

స్వస్థలమైన పుణెనగరం చరిత్ర ప్రసిద్ధం. పలు శాస్త్రాల, కళల ప్రవీణులు జన్మించిన ప్రదేశం. గాంధీ చిత్రంలో కస్తూరీ బాగా నటనలో జీవించిన రోహిణీ హట్టంగడిది ఆ ప్రాంతమే. విఖ్యాత హిందుస్థానీ గాయనీ లలామ ప్రభాఆత్రేదీ ఆ ప్రదేశమే. పాశ్చాత్య వైద్యంలో పట్టా సాధించిన మొదటి భారతీయ వైద్యురాలు ఆనందీబాయిది కూడా అదే పుణె నగరం. ఆ రాష్ట్రం మొత్తం మీద రెండో పెద్ద ప్రాంతమూ అదే. ప్రధానంగా మరాఠీయుల సాంస్కృతిక రాజధాని, సంస్కృతితో పాటు విద్యారంగంలోనూ సాటిలేని మేటి.

అంతటి పేరొందిన ప్రాంతాన పుట్టిన సుచేతకు చిన్నప్పటి 'ఎడారి ప్రాంతంలో సాహసయాత్ర' చేయాలన్న ప్రత్యేక అభిలాష ఉండేది. అది అమితో పాటు అదీ పెరుగుతూ వచ్చింది.

ఎక్కడా నీటిచుక్క ఉండదు. చెట్టూ చేమా అసలే కనిపించవు. ఉండేదంతా ఇసుక. భూభాగం అంతా. అదే! ఇసుకతిన్నెల ఎడారులు కొన్ని. మంచు నిండిన ఎడారి ప్రదేశాలు మరికొన్ని.

ఇసుక ఎడారుల్లో ముందుగా చెప్పాల్సిన పేరు – సహారా. ఆఫ్రికా ప్రాంతంలోనిది. అక్కడంతా నిస్సార నేల, ఎటు చూస్తే అటు పరుచుకున్న పొడి వాతావరణం. మనుగడ అనేది ఎవరికైనా అక్కడ క్లిష్టతరం. 'గ్రేట్ ఇండియన్ డెసర్ట్'గా పేరున్న థార్ గురించీ మనకు తెలిసిందే. నాలుగైదు రాష్ట్రాలకు విస్తరించి ఉందది. ఇప్పుడు మనం తెలుసు కోవాల్సింది గోబీ ఎడారి గురించి!

పేరు మాదిరే గోబీ.... తీరు విలక్షణంగా ఉంటుంది. గోబీ పర్యావరణమే విభిన్నం. చలి భయంకరం. ఎండాకాలంలో ఎండలు భగ్గుమంటుం టాయి. జనవరి నెలలో పరిస్థితి ఊహాతీతం. సమస్తం చిత్తడి నేల. వర్షం అన్న మాటే ఉండదక్కడ. కఠినాతికఠినంగా ఉండే భూభాగం. ఇసుక తుఫానులు పరిపాటి. జనసాంద్రతను వేరే చెప్పాలా? చాలా చాలా తక్కువ. అందునా మంగోలియా దేశం కదా అది! నాలుగోవంతుపైగా ఎడారే! వేలాది కిలోమీటర్ల విస్తీర్ణం. వైరుధ్య జీవనశైలి. ఆ దిబ్బల్లో ప్రయాణించడం ఎవరి ప్రాణాలతో వారు చెలగాటం ఆడుకోవడమే. అదిగో... అటువంటి చోట పయనించారు సుచేత.


సుచేతా

ఎడారి అన్వేషణ లక్ష్యంగా ఉన్న తాను ముందుగా డెవన్‌పోర్ట్‌ను సంప్రదించారు ఐర్లండ్‌వాసి. ఆ సాహసి నుంచీ సుచేత ఎంతో కఠినతర శిక్షణానుభవం గడించారు.

మొత్తం పదహారు వందల కిలోమీటర్లకు పైగా దూరం. ఆ దూరాన్ని రెండు నెలల్లో అధిగమించా లన్నది లక్ష్యం కాగా,పదిరోజుల ముందుగానే లక్ష్యం చేరుకున్నారు. 13 మంది సభ్యుల బృందం. మార్గ మాధ్యంలో కొంతమంది అనారోగ్య పీడితులౌ, ఆ దారి నుంచి వైదొలగి తిరిగి వెళ్లిపోయారు. ఇంకొంతమంది గాయాలబారిన పడి తల్లడిల్లుతూ, యాత్ర మధ్యలోనే వెనక్కి మళ్లారు. సుచేత మాత్రం ధీరనారీమణిగా ముందుకే కొనసాగారు. గోబీ ఎడారిని జయప్రదంగా దాటగలిగారు. ఆ తర్వాత పత్రికలవారితో మాట్లాడుతూ...

'నడవటం / ప్రయాణించడమంటే ప్రాణాలకు తెగించడమే! సాహసం అనేది అక్కడి పరిస్థితుల్లో చిన్న మాట. మహా పరాక్రమం అనే చెప్పాలి. తెగువ అనంతంగా ఉంటే తప్ప, ఆ యాత్ర చేయలేం. మా

బృందం కొంగోరీన్ ఉత్తర ప్రాంతం నుంచి బయల్దేరింది. ఇంతా అంతా అసలేనంత గట్టి పట్టుదలత ముందుకు సాగాను నేను. రోజూ సగటున పాతిక కిలోమీటర్లకు పైగా నడక. పగలేమో ఎండ మండుతుండేది. రాత్రిళ్లు తీవ్రత చంపేసేది. గోబీలో ఇసుక తుపానులు సరేసరి. ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చిపడతాయో ఎవరికీ తెలియదు.'

విలేకరి : అన్ని అడ్డంకులున్న మాట!

సుచేత : అన్నీ అడ్డంకులే. ఏ మాత్రం అదరలేదు, వెరవలేదు, బెదురన్నది అసలే లేదు. అన్నింటినీ తట్టుకున్నాం. మా గురు (డెవన్‌పోర్ట్) ఇచ్చిన ముందస్తు ప్రత్యేక శిక్షణ ఎన్నో విధాలుగా ఉపయోగ పడింది. అనారోగ్య పీడ నాకూ తప్ప లేదు. త్వరగా తేరుకున్నానంటే, అందుకు మా బృంద బలమే కారణం. ధైర్య సాహసాలతో ఏదైనా సాధించగలం కదా.



సుచేత లక్ష్య సాధన సంక్లిష్టమే అయినా, ఆమె ఉడుం పట్టు అంతకంటే చాలాచాలా గొప్పది. ఉత్సాహాన్ని సొంతం చేసుకోవడంలో ఆమె సృష్టించిన చరిత్ర అంతా ఇంతా కాదు. 'గోయింగ్ ఈస్ట్'లో తన సాహసిక ప్రవృత్తి నేటికీ ఎందరెందరినో ప్రభావితం చేస్తూనే వస్తోంది. తాను యోగా ఉపధ్యాయిని. ఆ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసినవారు. మాతృభాషతో పాటు సంస్కృతంలోనూ నిపుణురాలు. సాహసక్రీడలంటే అనురక్తి.



(ఇప్పుడు ఆమె వయసు యాభైకి అయిదేళ్లలోపే. సాహసయాత్ర చేసినప్పుడు మూడున్నర దశాబ్దాల ప్రాయం. ఇప్పటికీ మనకు అనిపించేదేమిటంటే....


మూర్తి దాల్చిన పౌరుషమో! అఖండ
మైన ఆత్మవిశ్వాస మహానదమ్మొ
సాహసోత్సాహ సత్య తేజస్సు నీవు!
విశ్వసౌభ్రాత్రి, భారత వీరపుత్రి!)

సాహసిక యాత్ర చేపట్టిన సంవత్సరం 2011. ఇప్పటికి పుష్కరం. సుచేతకు మరో ప్రధాన ఆశయముంది. భూటాన్ ప్రాంతం మొదలు పాకిస్థాన్ ప్రదేశం వరకు విస్తృతి చెంది ఉన్న హిమాలయాలను అధిగమించడం! మన దేశంతో పాటు పాకిస్థాన్, చైనా, నేపాల తదితర దేశాల భౌగోళిక విస్తారంతో ముడివడి ఉంది హిమాలయం. ట్రెక్కింగ్‌కి ప్రసిద్ధి చెందింది. ఖుంబు ప్రదేశం. ఎవరెస్ట్‌కు నైరుతి దిశలో ఇక్కడ కనిపిస్తుంటుంది. పర్వత ఆరోహణకు అనువైన కాలం ఏప్రిల్‌కి ముందు, లేదా అక్టోబర్ తర్వాత. రుతుపవనాల స్థితిని అనుసరించి ఇది ఉంటుంది. అస్థిర వర్షపాతం, వరదల బెడద, ఉష్ణోగ్రతల పెరుగుదల, తరచుగా కొండ చరియలు విరిగిపడు తుండటం – పర్వత ఆరోహకులకు మరెన్నో సమస్యలు. అవన్నీ సాహస యాత్రికుల మీద ప్రభావం చూపుతూనే ఉంటాయి. వాతావరణ మార్పు చేర్పులను సమర్థంగా తట్టుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రయాణం కొనసాగించాల్సి ఉంది. గాయాలు/ వ్యాధులు పట్టి పీడిస్తున్నా జంక కుండా ముందుకే అడుగులు వేయాల్సిన అవసరముంది. సమస్తం కార్యాచరణ ప్రణాళిక అమలుపైనే ఆధారపడి ఉంటుంది.

వీటన్నింటి నేపథ్యంలో సుచేత లక్ష్య సాధన సంక్లిష్టమే అయినా, ఆమె ఉడుం పట్టు అంతకంటే చాలాచాలా గొప్పది. ఉత్సాహాన్ని సొంతం చేసుకోవడంలో ఆమె సృష్టించిన చరిత్ర అంతా ఇంతా కాదు. 'గోయింగ్ ఈస్ట్'లో తన సాహసిక ప్రవృత్తి నేటికీ ఎందరెందరినో ప్రభావితం చేస్తూనే వస్తోంది. తాను యోగా ఉపధ్యాయిని. ఆ శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేసినవారు. మాతృభాషతో పాటు సంస్కృతంలోనూ నిపుణురాలు. సాహసక్రీడలంటే అనురక్తి. బ్రహ్మముహూర్త సాధన వంటి మేటి ప్రక్రియల్లో ఆరితేరిన పడతి.

మరింత విభిన్నత ఏమిటంటే – ఆమె పుణెలోనే చరిత్ర పీజీ చేశారు. పత్రికారంగంలోనూ కొంతకాలం విధులు నిర్వర్తించారు. ఐటీ ప్రొఫెషనల్‌గా కూడా ఉద్యోగ బాధ్యత వహించారు. సాహసయాత్రలో భాగంగా ట్రెక్కింగ్, సైక్లింగ్, నదీ ప్రాంతాలు దాటడం,ఎడారి నడకల మీద ఎంతెంతో మక్కువ పెంచుకున్నారు. 2008 లోనే మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ శిక్షణ అందుకున్నారు సుచేత కదేత్కర్. సహ్యాద్రి పర్వత ప్రాంతాల్లో సైతం ట్రెక్కింగ్ కొనసాగించారామె.

యాత్ర సందర్భాల్లో పలు ఊహించని పరిణామాలు. ఒకసారి ఫ్లూ వ్యాధి దాపురించింది. మరోసారి – తన లగేజీ మోస్తున్న ఒంటె దాడికి దిగింది. ఇంకో పర్యాయం – ఇసుక తుఫానులు మీద పడ్డాయి. ఎన్ని సమస్యలు ఎదురైనా ఆ అన్నింటినీ ఎదిరించి నిలిచారు. అందుకే పురస్కారాలెన్నో తనను వరించి వచ్చాయి. ప్రభుత్వం యువసాహసికురాలిగా గుర్తించి గౌరవించింది . లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో తన పేరు చోటు సంపాదించుకుంది. స్ఫూర్తిదాయక మహిళగా సంభావించి ఎన్నెన్నో సంస్థలు పురస్కార ప్రదానం చేశాయి వీటన్నిటినీ ప్రస్తావిస్తే, బదులుగా చిరునవ్వు చిందిస్తారు సుచేత. ఆ నవ్వులో సగర్వం, మహదానందం! ★



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

1857 నాటి మొదటి స్వాతంత్ర్యోద్యమాన్ని బ్రిటిషు ప్రభుత్వం దారుణంగా అణిచివేసింది. ఆ ఉద్యమాన్ని రాచరికానికి సవాలుగా భావించింది. దాంతో ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి ఇండియాను స్వాధీనం చేసుకుంటూ ఆగస్టు 2, 1858న ఓ చట్టాన్ని తెచ్చింది. ఇక పాలన అంతా మహారాణి పేరున సాగుతుందని ప్రకటించింది. ఇది ఆయా ప్రాంతాల్లో ఉన్న యువరాజులకు ఆగ్రహం కలిగిస్తుందని భయపడి వెంటనే నష్ట నివారణ చర్యలకు దిగింది. ఇందులో భాగంగానే క్వీన్ విక్టోరియా నవంబరు1, 1858న సుదీర్ఘ ప్రకటన చేశారు. "స్థానిక ప్రభువుల హక్కులను, గుర్తింపును, గౌరవాన్ని కాపాడతాం. ఇతరుల అధీనంలో ఉన్న భారత భూభాగాలను ఆక్రమించుకునే ఉద్దేశం మాకు లేదు" అని పేర్కొన్నారు. తప్పు చేసే అలవాటు ఉన్న వ్యక్తి హఠాత్తుగా పట్టుబడినప్పుడు, మళ్లీ అలాంటి పనిచేయనని ఎలా ప్రాధేయపడతారో అలాగే ఈ ప్రకటన సాగుతుంది.




# ఆంగ్లేయుల అడుగు

మరోసారి 1857 పునరావృతం కావటం ఆంగ్లేయులకు ఇష్టం లేదు. ఇలాంటి స్థితి ఎదురు కాకుండా భారతీయులను దువ్వటం మొదలు పెట్టారు. తమ ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చు కోవటానికి భారతీయులకు ఓ దారి చూపించాలని భావించారు. ఇదే ఇండియా నేషనల్ కాంగ్రెస్ ఆవిర్భావానికి దారితీసింది. స్వయంగా బ్రిటిషర్ల ప్రోద్బలంతో వారి మార్గదర్శకత్వంలోనే అది సాగింది.

కాంగ్రెస్ తొలి అధ్యక్షుడు డబ్ల్యు సీ బెనర్జీ మాటల్లో చెప్పాలంటే, "చాలా మందికి ఈ విషయం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు మొట్టమొదట పునాది పడింది .. మార్క్విస్ ఆఫ్ డఫరిన్ అండ్ అవా భారతదేశ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు. 1885 తొలిరోజుల్లో అలెన్ రిటైర్డు ఐసీఎస్ అధికారి ఆక్టావియన్ హ్యూమ్ సిమ్లాలో డఫరిన్‌ను కలిశాడు. బ్రిటన్‌లో రాచరి కానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం ఎలాంటి పనులు చేపడుతుందో అదే విధంగా భారత్‌లో కార్యకలాపాలు నిర్వహించటానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌ను ప్రారంభించమని ఈ సందర్భంగా డఫరిన్ ఆయనకు సూచించాడు". అదే సమయంలో కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకూ తన వ్యూహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టవద్దని డఫరిన్ సూచించాడని బెనర్జీ చెప్పుకొచ్చారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రారంభమై పనిచేయటం ప్రారంభమైంది. రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంలో 1886లో దాదాభాయ్ నౌరోజి అధ్యక్షోపన్యాసం చేస్తూ "మనం ఈ రకంగా కలవటానికి వీలయ్యే ప్రభుత్వ పాలనలో ఉండటం చాలా అదృష్టం. క్వీన్ నాగరిక పాలన, ఇంగ్లండ్ ప్రజల చలవ వల్లనే మనం ఏ ఆటంకాలు లేకుండా ఇక్కడ కలవగలుగుతున్నాం, ఎలాంటి భయాలు, సందేహాలు లేకుండా స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగు తున్నాం" అని ప్రకటించారు. "ఈ సందర్భంగా నాలో రెండు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ రాజద్రోహం, తిరుగుబాటు కోసం ఏర్పాటు చేసిన శిశువిద్యాలయమా? (కాదు కాదు అని సభికుల అరుపులు)లేదా ఆ సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునాది రాయినా (అవును.. అవును)... ఈ రెండింటిలో ఏదో ఒకటి అయ్యుంటుంది. దీనికి సమాధానం మీరు చెప్పేశారు. కాబట్టి కాంగ్రెస్ పేరుతో ప్రభుత్వం మనకు అందించిన వరాలను అందుకుని దాని ప్రకారం పనిచేద్దాం" అని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ విధివిధానాలను ఎ.ఒ. హ్యూమ్, ఏప్రిల్ 30, 1888లో ప్రకటించారు. అన్ని తారతమ్యాలను వ్యత్యాసాలను విడిచి భారతదేశ ప్రజలంతా ఒకే జాతిగా మసలటం, మానసిక, నైతిక, సామాజిక, రాజకీయ కోణాల్లో ప్రజలంతా



ఎం. సుందరరామిరెడ్డి
న్యాయవాది



# జాడలలో..

పునరుజ్జీవం పొందటం, ఇంగ్లండు, భారత ప్రభుత్వం మధ్య ఏకీకరణ సాగటం.. అంటూ కాంగ్రెస్‌కు మూడు లక్ష్యాలను నిర్దేశించారు. అలాగే కాంగ్రెస్ ఏ రీతిగా తన కార్యకలాపాలను నిర్వహించాలో కూడా నిర్దేశించారు. దేశంలో ప్రజలందరికీ ప్రాథమికమైన రాజకీయ అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించటం తద్వారా బ్రిటిషర్ల పాలనలో తాము ప్రయోజనాలు పొందుతున్నామని, ప్రభుత్వానికి తాము రుణపడాలన్న భావన పెంపొందించటం, ప్రశాంతమైన ఆ పాలన కొనసాగితే దేశం సుసంపన్నం అవుతుందన్న అభిప్రాయాన్ని బలపరచటం అని సూచించారు.

హ్యూమ్ ద్వారా కాంగ్రెస్‌ను ప్రారంభించిన బ్రిటిషర్లు అదే విధానాన్ని అడుగడుగునా కొనసాగిస్తూ వచ్చారు. నవంబరు 1888లో తన ప్రసంగం మినిట్స్‌లో డఫరిన్ కాంగ్రెస్ వ్యక్తిత్వం గురించి వివరించారు. "కాంగ్రెస్ అనేది ప్రత్యక్షంగా గానీ లేదా పరోక్షంగా గానీ యూరోపియన్ విద్యావిధానం, యూరోపియన్ రాజకీయ దృక్పథం, యూరోపియన్ సాహిత్యంతో మమేకమై రూపొందిన పదార్థం. అందులో భారతీయ సమాజంలో సంపన్న కుటుంబాలకు చెందిన వారు లేరు. జనాభాలో సానుభూతి కలిగేంతగా వాళ్లకు ఎక్కువమందితో సాన్నిహిత్యం లేదు".

## కాంగ్రెస్‌కు బ్రిటిష్ నిధులు

కాంగ్రెస్ కార్యకలాపాల నిర్వహణకు ఆంగ్లేయులు నిధులు అందించేవారు. ఐసీఎస్ అధికారి సి.డబ్ల్యు బోల్టన్, బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో రాసిన లేఖలో ఈ నిధుల ప్రస్తావన చేశారు. "లండన్‌లోని బ్రిటిష్ కమిటీ కలకత్తా స్టాండింగ్ కమిటీ నుంచి ఏటా రూ. 8వేల చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. జనరల్ సెక్రటరీ ఎ.ఒ.హ్యూమ్ నుంచి లేఖ అందినా పైసా రాలేదు. 1897లో బేరార్ సదస్సులో ఒక స్మారక స్థూపం నిర్మాణం నిమిత్తం వెయ్యి పౌండ్లు వసూలు చేయాలని, అందులో 500 పౌండ్లు బెంగాల్లోనే పోగు చేయాలని నిర్ణయించారు. అది కూడా వీలు పడలేదు. జాతీయ నిధి నుంచి కాంగ్రెస్ ఏటా ఇచ్చే రూ.500లు కూడా గత మూడేళ్లలో ఇవ్వలేదు.

గోపాలకృష్ణ గోఖలే అధ్యక్షుడయిన సందర్భంగా, డిసెంబరు25, 1905లో కాంగ్రెస్ సిద్ధాంతాల గురించి చెబుతూ, "మనం ఏ రకంగా ముందుకెళ్లినా అది రాచరికం పరిధిలో ఉండాలి" అని పేర్కొన్నారు.

కాలగమనంలో, బాలగంగాధర తిలక్ వంటి జాతీయవాదులు ప్రవేశించి, స్వతంత్ర, స్వదేశీ నినాదాలను ప్రవేశపెట్టి విదేశీవస్తువులను బహిష్కరించాలని పిలుపు ఇచ్చారు. దాంతో గోఖలే వెంటనే రంగంలో దిగారు. 'బహిష్కరణ' అన్నమాటకు ప్రతికూలార్థం వస్తోందని చెప్పి దాన్ని తొలగించాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రతి కదలికపైనా బ్రిటిష్ ప్రభుత్వం దృష్టి పెట్టేది. అది బ్రిటన్ ప్రతిపక్షం.. హౌస్ ఆఫ్ కామన్స్ వలె వ్యవహరించకుండా తన పరిధిని అతిక్రమించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకునేది. కొత్తగా ఎంపికయ్యే అధ్యక్షులు తమ కనుసన్నల్లో నడుచుకునేటట్టు చూసేది. తమకు నచ్చని వారు వచ్చినప్పుడు వాళ్లను పదవీచ్యుతుల్ని చేయటానికి సిద్ధమయ్యేది. కాంగ్రెస్‌లో తిలక్ ఎదిగినప్పుడు వెంటనే బ్రిటిష్ స్పందించింది. దీనిపై మింటో నవంబరు 4, 1906లో జాన్ మోర్లేకు లేఖ రాశారు. "తిలక్ గానీ అతని వర్గం గానీ కాంగ్రెస్‌లో పట్టు సాధిస్తే బ్రిటిష్ ప్రభుత్వానికి చాలా కష్టం. గోఖలే లేఖలను చూడండి. తనెంత నిజాయతీతో ఉంటున్నాడో? భారతదేశంలో మన పాలన గొప్పతనాన్ని ఘనంగా చాటుతున్నాడు. తమ దేశంలో పౌరుల బలహీనతనూ చెబుతున్నాడు''. నవంబరు4, 1906లో రాసిన లేఖలో మోర్లేకు మింటో ఇంకో హెచ్చరిక కూడా చేశారు. " వాళ్ల విజయం అంటే బ్రిటిషు యంత్రాంగం మాయంకావటం, మరుసటి రోజు నుంచి వినాశనాన్ని కొని తెచ్చుకోవటమే". బ్రిటిష్ ఈ రకమైన వ్యూహాలతో గోఖలే ద్వారా తిలక్‌ను అడ్డుకోవటానికి ప్రయత్నించి, 1907లో సూరత్‌లో కాంగ్రెస్ చీలికకు కారణమైంది.


గోఖలే

బి.జి. తిలక్, ఎం.కె.గాంధీ, ఎన్.ఎస్.సి.బోస్ వంటి వ్యక్తులు కాంగ్రెస్‌కు ఖ్యాతి సంపాదించి పెట్టారు. దాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారు. దానిని నెహ్రూ లాంటి వ్యక్తులు హైజాక్ చేసి ఆంగ్లీకరించారు. తాము ఎక్కువ కాలం భారత్‌లో ఉండలేమని బ్రిటిషర్లకు తెలుసు. అందుకే వీలయినంత వరకూ లూటీ చేయటానికి ప్రయత్నించారు. వీలయినంతగా ఎదగటానికి, అదే సమయంలో ప్రశాంతంగా బయటకు రావటానికి కాంగ్రెస్‌ను ఒక మార్గంగా ఎంచుకున్నారు.

తన మోసపూరిత ఎత్తుగడలకు బ్రిటిషర్లు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు కృతజ్ఞత చూపారు. అందులో భాగంగానే ముక్కలు చేసిన భారత్‌ను వాళ్లకు బహుమతిగా ఇచ్చారు. బ్రిటిష్ ప్రధాని సి.ఆర్.అట్లీ, జులై10, 1947న, ఇండియన్ ఇండిపెండెన్స్ బిల్లును ప్రవేశపెడుతూ గొప్పగా ఓ మాట చెప్పారు. "ఎప్పుడూ అంతగా పట్టించుకోని ఓ విషయాన్ని గురించి ఇక్కడ చెప్పదలుచు కున్నాను. బ్రిటిషు దురాక్రమణ నుంచి విముక్తికి భారత్ కట్టుబడినట్టే, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనేది మన జాతి ప్రేరణతో స్థాపించబడింది, ప్రేరణ పొందింది".

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పుట్టుక, దాని జన్యువుల గురించిన వివరాలివి. ఇలాంటి పార్టీకి సోనియా అధ్యక్షురాలు కావటం ఆశ్చర్యం కలిగించదు. ఒక విత్తనం నాటితో మరోరకం చెట్టు మొలకెత్తటం సాధ్యం కాదు. ఇది దాని ఆత్మకు దగ్గరగా ఉండే పరిణామం అని చెప్పక తప్పదు.

**అను: డాక్టర్ పార్థసారథి చిరువోలు**

**ఆధునిక ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న పర్యావరణ కాలుష్యపు విషాన్ని తగ్గించేందుకు దేశాలు మార్గాలను అన్వేషిస్తుండగా, భారత్ సంప్రదాయ మార్గాలను అనుసరించేందుకు ప్రయత్నిస్తోంది. శతాబ్దాల కిందటే చోళులు మన నావికా శక్తిని ప్రపంచపటంలో అగ్రాన ఉంచడమే కాదు, సుదూర తీరాలకు మన వ్యాపారాన్ని, వాణిజ్యాన్ని, సంస్కృతిని వ్యాపింపచేసిన విషయం మనకు తెలుసు. ఆ పద్ధతిలోనే సముద్రమార్గం ద్వారా వాణిజ్యాన్ని శక్తిమంతం చేసేందుకు గత దశాబ్ద కాలంగా భారత్ యత్నిస్తోంది. నౌకాదళ శక్తిని, ఓడరేవుల సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా వాణిజ్యాన్ని పెంపొందించాలని భారత్ తీసుకుంటున్న చొరవలు ప్రశంసనీయంగా ఉంటున్నాయి. ముఖ్యంగా మారిటైం ఇండియా విజన్ (ఎంఐవి) 2030 ప్రకటన అన్నది స్థిరమైన పద్ధతులను అవలంబించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు రక్షణ కవచంగా ఉంటూ రేవులను అభివృద్ధి చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.**

వందల సంవత్సరాల క్రితమే తూర్పును, పశ్చిమాన్ని అనుసంధానం చేస్తూ సిల్క్ రూట్‌గా చెప్పుకునే మార్గం ప్రపంచ వాణిజ్యాన్ని ఉత్తేజితం చేసింది. ప్రపంచంలోని పలు దేశాల అభివృద్ధిలో అది కీలకపాత్ర పోషించింది. ఇదే పంథాలో భారతదేశ చొరవతో భారత్-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ నిర్మాణానికి అంగీకరించారు. ఈ అడుగు 21వ శతాబ్దిలో ప్రపంచ నౌకా రవాణా పరిశ్రమను పరివర్తనకులోను చేయనుంది. ఇందులో భాగంగానే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గ్లోబల్ మారిటైమ్ ఇండియా సదస్సు 2023ని ప్రారంభించారు.

ముంబైలో జరిగిన దేశంలోని అతి పెద్ద నౌకా రవాణా సదస్సు మూడో ఎడిషన్ గ్లోబల్ మారిటైమ్ ఇండియా సదస్సు 2023ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత నౌకారవాణా రంగం కోసం బ్లూ ఎకానమీ బ్లూ ప్రింట్ "అమృత్ కాల్ విజన్ 2047"ని ఆవిష్కరించారు. భవిష్యత్ ప్రణాళికతో అనుసంధానం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.23,000 కోట్ల విలువ గల ప్రాజెక్టుల్లో కొన్నింటికి శంకుస్థాపన చేసి, కొన్నింటిని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులన్నీ భారత సాగర నీలి ఆర్థిక వ్యవస్థ కోసం 'అమృత్ కాల్ విజన్ 2047' తో అనుసంధానమై ఉన్నాయి.

ప్రధాని మోదీ ఈ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ, అధిక శాతం ప్రపంచ వాణిజ్యం సముద్రమార్గంలోనే సాగిందని ప్రతీ ఒక్కరికీ తెలుసునన్నారు. కరోనా అనంతరం నేడు యావత్ ప్రపంచానికి విశ్వసనీయమైన, అందరికీ ఉపయోగకరమైన సరఫరా వ్యవస్థలు కీలకంగా మారాయని, భారత సాగర రవాణా సామర్థ్యాలు ఎంత బలంగా ఉంటే దేశం, ప్రపంచం కూడా అంత భారీగా ప్రయోజనం పొందాయనేందుకు చరిత్ర సాక్షి ఆయన పేర్కొన్నారు.

భారతదేశం చొరవతో భారత-మధ్యప్రాచ్య-యూరప్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణానికి ప్రపంచ సమాజం అంగీకరించింది. ఈ కారిడార్‌తో వాణిజ్య వ్యయాలు తగ్గడమే కాదు, సదుపాయాలు కూడా విస్తరిస్తాయి. ఈ కారిడార్ నిర్మాణం అనంతరం పర్యావరణానికి హాని అతి తక్కువగా ఉంటుంది. భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

వచ్చే 25 సంవత్సరాల కాలంలో అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న ప్రణాళికతో నేడు భారతదేశం కృషి చేస్తోంది. సముద్ర రవాణా ద్వారా వాణిజ్యాన్ని సరళతరం చేయడం లక్ష్యంగా భారతదేశం ఆ రంగంలో పలు విప్లవాత్మక మార్పులు తెస్తోంది. యావత్ నౌకారవాణా మౌలిక వసతులు పటిష్టం చేసేందుకు ఎంతో శ్రమించి చర్యలు తీసుకుంటోంది. గత దశాబ్ద కాలంలో భారత ప్రధాన ఓడరేవుల సామర్థ్యం రెట్టింపయింది. కంటైనర్ నౌకల రవాణా సమయం 2014లో 42 గంటలుండగా 2023 నాటికి 24 గంటలకు తగ్గింది. పోర్టులతో అనుసంధానత పెంచేందుకు వేలాది కిలోమీటర్ల కొత్త రోడ్లు నిర్మించారు. సాగర్‌మాల ప్రాజెక్టుద్వారా కోస్తా ప్రాంతాల్లో మౌలిక వసతులు పటిష్టం చేస్తున్నారు.

సుసంపన్నత, పురోగతికి ఓడరేవులు అన్న భారత ప్రభుత్వ దృష్టికోణానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో మార్పు సుస్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాల ఫలితంగానే ఓడరేవుల సామర్థ్యం పెరిగింది. గత దశాబ్ద కాలంలో కోస్తా సరుకు ట్రాఫిక్ రెట్టింపై తక్కువ ధరల్లో లాజిస్టిక్స్ అందుబాటులోకి వచ్చాయి. పదేళ్ల కాలంలో జాతీయ జలమార్గాల ద్వారా వస్తు రవాణా కూడా నాలుగు రెట్లు పెరిగింది. దేశీయంగా నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ భారతదేశ సామర్థ్యం, శక్తికి నిదర్శనమని మోదీ అన్నారు. రాబోయే దశాబ్దాల్లో భారతదేశం ప్రపంచంలో అయిదో పెద్ద నౌకా నిర్మాణ దేశంగా మారనుంది. నౌకా రవాణాలో భాగస్వాములందరినీ ఒక్కటి చేసే దిశగా ప్రభుత్వం సంఘటిత వైఖరిని అనుసరిస్తోంది. రాబోయే సంవత్సరాల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో నౌకా నిర్మాణ, మరమ్మత్తు కేంద్రాలు నిర్మించే ప్రణాళికలు కూడా ఉన్నాయి. సాగర రవాణా వ్యవస్థలో నెట్ జీరో కార్బన్ వ్యూహం కోసం భారతదేశం కృషి చేస్తోంది.

ప్రపంచంలోని పెద్ద నౌకారవాణా నిర్వాహకు లందరూ భారతదేశానికి వచ్చి ఇక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపు ఇచ్చారు. గుజరాత్‌లోని ఆధునిక గిఫ్ట్ సిటీ షిప్ లీజింగ్‌ను పెద్ద పెట్టుబడి సేవగా ప్రవేశపెట్టింది. భారతదేశానికి విస్తారమైన కోస్తా ప్రాంతం, బలమైన నదీ వ్యవస్థ, సమున్నత సాంస్కృతిక వారసత్వం ఉన్నాయి. ఇవన్నీ సాగర పర్యాటకానికి కొత్త అవకాశాలు అందుబాటులోకి తెస్తాయి. దేశంలో సాగర జలాల ఆధారిత పర్యాటకరంగాన్ని ప్రోత్స హించడంలో భాగంగా ప్రపంచంలోనే అతి పెద్ద

# రెట్టింపయిన



రివర్ క్రూయిజ్ సర్వీస్‌ను ప్రారంభించారు. దేశంలోని విభిన్న పోర్టుల్లో ఇందుకు సంబంధించిన పలు పథకాల అమలుకు భారతదేశం కృషి చేస్తోంది. ముంబైలో కొత్త అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ నిర్మిస్తున్నారు. అలాగే విశాఖపట్నం, చెన్నైలలో ఆధునిక క్రూయిజ్ టెర్మినల్స్ నిర్మాణంలో ఉన్నాయి. అత్యాధునిక మౌలిక వసతులతో ప్రపంచ క్రూయిజ్ హబ్‌గా మారే దిశగా భారతదేశం ముందుకు సాగుతోంది.

మారిటైమ్ సదస్సులో నీటి రవాణా నుంచి మెరైన్ టూరిజంలో పెట్టుబడుల వరకు పలు అంశాలపై చర్చలు చోటు చేసుకున్నాయి.

రూ.23,000 కోట్ల విలువ గల ప్రాజెక్టుల్లో కొన్నింటికి శంకుస్థాపన చేయడంతో పాటు మరి కొన్నింటిని జాతికి అంకితం చేశారు. గుజరాత్‌లోని దీన్ దయాళ్ పోర్ట్ అథారిటీలో అన్ని వాతావరణ పరిస్థితులకు దీటైన తునా టెక్రా డీప్ డ్రాఫ్ట్ టెర్మినల్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు.

– పిపిపి విధానంలో నూతనంగా అత్యాధునిక టెర్మినల్‌ను నిర్మించనున్నారు. భారత్–మధ్యప్రాచ్య–యూరప్ ఎకనామిక్ కారిడార్ (ఐఎంఇఇసి) ద్వారా భారత వాణిజ్యానికి ఇది ముఖద్వారంగా ఉంటుంది.

– సముద్ర రవాణా రంగంలో ప్రపంచ, జాతీయ భాగస్వామ్యాల కింద చేపట్టే రూ.7 లక్షల కోట్లకు పైగా విలువ గల 300 అవగాహన పత్రాలను (ఎంఒయు) జాతికి అంకితం చేశారు.

– దేశంలోనే అతి పెద్దదైన సాగర సదస్సుకు యూరప్, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా (సెంట్రల్ ఆసియా, మధ్యప్రాచ్యం, బిమ్ స్టెక్ ప్రాంతాలు సహా) దేశాలకు చెందిన మంత్రులు హాజరయ్యారు.

ఈ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలకు చెందిన సిఇఒలు, వ్యాపార దిగ్గజాలు, పెట్టుబడిదారులు, ఎగ్జిక్యూటివ్‌లు, ఇతర భాగస్వాములు కూడా ఎన్నికయ్యారు.

– మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో భవిష్యత్ ఓడరేవులు, డీకార్బనైజేషన్, కోస్తా నౌకాయానం, అంతర్గత జల రవాణా, నౌకా నిర్మాణం, మరమ్మతులు, పునర్వినియోగం (రీసైక్లింగ్), ద్రవ్యం, పెట్టుబడి, బీమా, మధ్యవర్తిత్వం, సాగర భద్రత, సాగర పర్యాటక ఆధారిత భద్రత వంటి భిన్న అంశాలపై చర్చించారు.

– తొలి మారిటైమ్ ఇండియా శిఖరాగ్రం 2016లో ముంబయిలో జరిగింది. రెండో శిఖరాగ్ర సదస్సు 2021లో వర్చువల్ గా జరిగింది.

**భారతీయ సముద్ర రంగం దూకుడు**

వరల్డ్ బ్యాంక్ లాజిస్టిక్స్ పెర్ఫార్మెన్స్ ఇండెక్స్ (ఐ–పిఐ –ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ పనితీరు సూచీ) నివేదిక–2023 ప్రకారం కంటైనర్ నిరీక్షించే సగటు కాలం 3 రోజుల స్థాయిని భారత్ సాధించింది. ఇది యుఎఇలో , దక్షిణాఫ్రికాలో 4 రోజులు కాగా, యుఎస్‌లో 7రోజులు, జర్మనీలో 10 రోజులుగా ఉంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం కింద 2014 నుంచి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు దేశంలోని ఓడరేవులు, షిప్పింగ్ రంగంలో పెట్టిన పెట్టుబడులు ఇప్పుడు ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయి. ఓడరేవులు ఉత్పాదకత, డిజిటలీకరణ ద్వారా సరఫరా లంకె దృగ్గోచరతను మెరుగుపరిచేందుకు దేశం చేపట్టిన సంస్కరణల ఫలితంగా భారతీయ సముద్ర రేవుల వద్ద అతి తక్కువ కాలం నిరీక్షణ ఉంటుంది.

# రేవుల సామర్థ్యం





అభివృద్ధి, జనాభా శక్తి, ప్రజాస్వామ్యం, డిమాండు అన్నింటి సమ్మేళనంగా నిలిచే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో భారతదేశం ఒకటి. **2047** నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తున్న సమయంలో అందరికీ ఇది సువర్ణావకాశం. భారతదేశానికి వచ్చి, అభివృద్ధి పథంలో భాగస్వాములుగా చేరాలని ప్రపంచ పెట్టుబడిదారులు అందరినీ నేను మరోసారి ఆహ్వానిస్తున్నాను.

– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

పిఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద సమన్వయ ప్రణాళిక, అమలు ద్వారా లోతట్టు ప్రాంతాలకు అనుసంధానతను మెరుగుపరచడంపై, సముద్రయాన రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాలపై దృష్టి పెట్టడం వల్ల అంతర్జాతీయ షిప్‌మెంట్స్ విభాగం ప్రపంచ ర్యాంకింగ్‌లో భారతదేశం 22వ స్థానానికి ఎదిగింది. దేశపు లాజిస్టిక్స్ పనితీరు సూచీ స్కోర్ ప్రకారం 38వ స్థానంలో నిలిచింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనిక నాయకత్వం కింద విధాన సంస్కరణలు, నూతన సాంకేతికతలను ప్రవేశపెట్టడం, అధిక ప్రభుత్వ ప్రైవేటు భాగస్వా మ్యాల ద్వారా రేవు సామర్థ్యాన్ని, ఉత్పాదకతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టి, ప్రోత్సాహాన్ని ఇచ్చారు. టర్న్ అరౌండ్ టైమ్ (ఓడలు రేవులో సరుకును దించే ప్రక్రియకు పట్టే సమయం) విషయంలో భారతీయ రేవులు భారీ మెరుగుదలను నమోదు చేశాయి.

ప్రపంచ బ్యాంకు లాజిస్టిక్స్ పనితీరు సూచీ (ఐ–పిఐ) నివేదిక– 2023లో ప్రచురించిన టర్న్ అరౌండ్ టైమ్ కొలమానంపై భారతీయ రేవులను ప్రపంచ స్థాయిలో పోల్చి చూస్తే, యుఎస్ఎ (1.5 రోజులు) , ఆస్ట్రేలియా (1.7 రోజులు), బెల్జియం (1.3 రోజులు) కెనడా (2.0 రోజులు), జర్మనీ (1.3 రోజులు), యుఎఇ (1.1 రోజు) సింగపూర్ (1.0 రోజు) రష్యన్ సమాఖ్య (1.8రోజులు), మలేషియా (1.0 రోజులు) ఐర్లాండ్ (1.2 రోజులు), ఇండొనేషియా (1.1రోజు) న్యూజిల్యాండ్ (1.1రోజు), దక్షిణాఫ్రికా (2.8 రోజులు) కంటే మెరుగ్గా భారతీయ రేవులలో టర్న్ అరౌండ్ టైమ్ 0.9 రోజులుగా ఉంది.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి

కథ

సునీతకు పట్టుదల ఎక్కువ. అనుకున్నది సాధించేంత వరకు నిద్రపోదు. కొన్నాళ్లు ఉద్యోగం చేసింది. షిఫ్టుల్లో పనిచేయాల్సి రావడంతో మానేసింది. ఇంటి దగ్గరే ఉంటుంది. పరీక్ష చేయించుకుంటే మూడోనెల అన్నారు. వీరబాబు చాలా సంతోషించాడు. ఎత్తుకుని తిప్పాడు. ముద్దులు కురిపించాడు. అత్తారబత్తంగా చూసుకుంటున్నాడు.

సునీతకు కొన్ని రోజులుగా నిస్సత్తువ...నీరసం...




# గీత తప్పిన అక్షరం

దాట్ల దేవదానం రాజు

ఒకటే తలపులు... పుట్టింటి తలపులు... అమ్మా నాన్నా, అన్నా... బాల్య స్మృతులు పదే పదే వెంటాడు తున్నాయి... కుటుంబ బంధాలు దూరమైతే అదో గొప్ప వెలితి.

సునీతలో ముందు నుంచీ ఒక తెగింపు ఉంది. లెక్కలేనితనం ఉంది. అందుకే ప్రేమించిన వాడిని వదులుకోలేదు. అమ్మానాన్నలను విడిచిపెట్టింది. తెలియని మత్తు ఏదో ఆవహించిన క్షణాలు అవి.



ఫలితంగా వీరబాబుతో బంధాన్ని ముడివేసుకుంది. మరో ధ్యాస లేకుండా తమదే లోకం అన్నట్లుగా ఒకరికొకరు పుట్టినట్లుగా సాగుతోంది జీవితం.

ఉన్నట్టుండి తండ్రి గారాబం గుర్తొచ్చింది. అమ్మ ప్రేమ గుర్తొచ్చింది. ఆడి పాడిన ఇల్లు గుర్తొచ్చింది. బంధువుల ఆప్యాయతలు గుర్తుకొచ్చాయి. ఊరి జనం మదిలో మెదిలారు.

సాయంత్రం వీరబాబు రాగానే పుట్టింటికెళ్లాలనే అభిలాషను అతని ముందు పెట్టింది. వీరబాబు వెంటనే ఒప్పుకోలేదు. సునీత నచ్చ చెప్పడానికి ప్రయత్నించింది.

"నీకు తెలీదు. లోకం అలా లేదు. మనం అనుకున్నంత మార్పు సమాజంలో రాలేదు. ఎన్ని వార్తలు వినడం లేదూ... సుఖాన ఉన్న ప్రాణం దుఃఖానికి పెట్టుకోడం అవసరమా? ఎందుకు ఆపద కొని తెచ్చుకోవడం?" అన్నాడు వీరబాబు. సునీత కళ్లంట నీళ్లు తిరిగాయి. ఆమెను దగ్గరకు తీసుకుని తలను ఒడిలో పెట్టుకుని చేతితో నిమిరాడు. ముంగురులు వెనక్కి సర్దాడు. గమ్మత్తుగా బుగ్గ మీద చిటికె వేశాడు. సునీత అందంగా నవ్వింది. ఆమె కళ్లు మిలమిలా మెరిశాయి.

వీరబాబు చిరు గడ్డాన్ని వేళ్లతో పట్టుకుని లాగింది మురిపెంగా. మెడ చుట్టూ రెండు చేతులతో దగ్గరకు లాక్కుని పెదాలపై ముద్దు పెట్టుకుంది. కాసేపు ఇద్దరికే చెందిన ప్రపంచంలో తేలియాడారు. ఆ సమాగమమే అందమైన అలసటై నుదుటన చిరుచెమటల సాక్షీభూతమైంది.

అంతా అయ్యాక – "మరి ఇప్పుడేమంటావ్?" అంది సునీత చిరునవ్వులు చిందిస్తూ.

"ఈపాటికి మావోళ్లు చల్లబడే ఉంటారు. ఎన్నాళ్లిలా? మనిద్దరం వెళ్లి కలుద్దాం. ఏం చేస్తారు? చంపేయరు కదా...!" అంటూ పుట్టింటికి వెళ్లాలనే తలంపును మరోసారి బయట పెట్టింది.

"కొన్నాళ్లు ఆగుదాం. కాదూ కూడదూ అంటే నీ ఇష్టం..." అన్నాడు వీరబాబు.

"ఇద్దర్నీ తప్పక అంగీకరిస్తారు. అది నా నమ్మకం. సంవత్సరంగా కన్నవాళ్లను కలవలేదు. ముఖాలు కూడా చూసుకోలేదు. ఇదెంతో బాధాకరం కదా" అంది.

"నీవెప్పుడంటే అపుడు కలసే వెళదాం... సరేనా..." అన్నాడు వీరబాబు సన్నగా.

సునీత చిన్నాన్న కొడుకు రామం వచ్చాడు. ఊహించలేదు. అదొక గొప్ప వేళావిశేషం.

సునీతలో సంభ్రమాశ్చర్యాలు. ఆపాద మస్తకం పులకింత. దయాసముద్రంతో నిండిన ఆత్మీయ పలకరింపులు గొప్ప శక్తినిచ్చే టానిక్. కరస్పర్శలు ఆప్యాయ తరంగాల మెత్తని చూపులు. చిరు మందహాసపు జల్లులు సాంత్వన కలిగించే దివ్యౌషధం.

మనసు రాగరంజితమైంది. మర్యాద మన్ననలకు లోటు చేయలేదు. దాదాపు సంవత్సరం తర్వాత ఒక కుటుంబ సభ్యుడ్ని కలిసిన సమయం. ఎంతో హాయి తీరని దాహమేదో తీరినట్టు మరెంతో సంతోషం.

సునీత సంతోషానికి అవధులు లేవు. స్వీటు, హాటు, కాఫీ...

రామంతో మాట్లాడుతున్నంత సేపు పరిసరాలు మరచింది. కుటుంబ క్షేమ సమాచారాల్ని ఆరా తీసింది. చిన్ననాటి ముచ్చట్లు జ్ఞాపకం తెచ్చుకుంది. నవ్వుల పువ్వులు పూయించింది. కొండంత బరువు దించుకున్న అనుభూతి. మారిన మనుషుల జాడకు ఆనందం పరవళ్లు తొక్కింది. కలల పంట గురించి చెప్పింది. రామం చిత్రంగా నవ్వి భుజం తట్టాడు.

"సునీతా... మీ నాన్న నిన్ను కలవరిస్తున్నాడు. చూడాలని గోల పెడుతున్నాడు. ప్రస్తుతానికి మాకేమీ కోపాలు లేవు. ఇష్టపడ్డారు...దూరంగా వెళ్లి పెళ్లి చేసుకున్నారు. ఇపుడు బిడ్డను కూడా కనబోతున్నావు. ఇలాంటివి ఇపుడు మామూలు అయిపోయాయి. జరిగిపోయింది అక్కడితో సరి. రక్త సంబంధం ఎక్కడికి పోతుంది? వెంటనే బయలుదేరు. అందుకే వచ్చాను" కుర్చీ లోంచి లేచి అటూ ఇటూ తిరుగుతూ ఫ్రేములో వీరబాబు– సునీతల ఛాయా చిత్రాన్ని చూస్తూ అన్నాడు రామం.

సునీత వెంటనే సమాధానం చెప్పలేకపోయింది.

కాసేపు ఆలోచించి – "వీరబాబు రావడం ఈవేళ ఆలస్యం అవుతుంది. ఎలా? మేం ఇద్దరం కలసి వస్తాం లే...అన్నా..."

"అలా కాదు, సునీతా... మనం వెంటనే వెళ్లాలి. పెదనాన్న ఎదురు చూస్తుంటాడు. ఈవేళ కచ్చితంగా తీసుకొస్తానని మాట ఇచ్చాను. ఆయన ఆరోగ్యం అంత బాగో లేదు. ఎందుకు చెబుతున్నానో... విను" అంటూ ఆగిపోయాడు రామం. ఇలా అనడంలో చెప్పరానిదేదో ఉన్నట్టు ధ్వని ఉంది.

తండ్రి ఆరోగ్యం పట్ల కీడు శంకించింది. వెంటనే వీరబాబుకు ఫోను చేసింది. కలవలేదు. నెట్వర్కు సమస్య. బయటకు వెళ్లి ప్రయత్నించింది. ఎట్టకేలకు ఫోను పనిచేసింది. విషయం చెప్పింది.

వీరబాబు ముందు వెనుకలు ఆలోచించకుండా వెంటనే వెళ్లడం పట్ల అభ్యంతరం చెప్పాడు. మర్నాడు ఇద్దరం కలసి వెళదామని చెప్పాడు. సునీత ఒప్పుకోలేదు. బతిమాలింది. ప్రాధేయపడింది. సునీత గొంతులో తారాడుతున్న సన్నని వణుకు గమనించాడు. ఇక వద్దని అనలేకపోయాడు. అయిష్టంగానే జాగ్రత్తలు చెప్పి వెళ్లమన్నాడు. వెళ్లిన వెంటనే ఫోను చేయమన్నాడు.

తల్లిదండ్రుల ఎడబాటు కలిగించిన శూన్యత లోంచి బయటపడి జ్ఞాపకాల్ని వెలిగించుకుంటూ రామంతో వెళ్లడానికి సిద్ధపడింది సునీత. నిజానికి పుట్టింటికి వెళ్లాల్సివస్తే వీరబాబుతో కలిసి మాత్రమే వెళ్లాలనుకుంది.

ఇంటికి తాళం వేసి గేటు తీసుకుని బయటకు వచ్చింది. ఏదో మరచి పోయినట్టు మళ్లీ మరోసారి తాళం తీసుకుని వంటింట్లోకి వెళ్లి వీరబాబుకు ఇష్టమైన పాకంగారెను కనపడేలా పెట్టింది. బెడ్ రూంలోకి వెళ్లి చిన్న కాగితం మీద కొన్ని అక్షరాలు

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన**

రాసి తలగడపై ఉంచింది.

రామం బుల్లెట్టు బైకు మీద వచ్చాడు. కొత్తగా నిగనిగలాడుతూ యముని మహిషంలా ఉంది. పెద్ద కండచీమను జూమ్ చేసి చూస్తున్నట్టుగా ఉంది.

"అంత దూరం దీనిమీద వెళ్లాలా? కారో బస్సో బావుంటుంది కదా" అంది బుల్లెట్టును తేరిపారి చూస్తూ

"విమానంలో వెళుతున్నంత హాయిగా మనం వెళ్లొచ్చు... అడ్డదారిలో గమ్మున ఊరు చేరిపోతాం. కంగారుపడకు"

అన్న భుజం మీద చేయేసి భయం భయంగా కూర్చుంది సునీత.

కిక్కిరిసిన నగర జనసందోహంలో ప్రయాణం నెమ్మదిగా సాగుతోంది. పట్టణ పొలిమేర దాటిం తర్వాత తన చోదక ప్రావీణ్యాన్ని చూపిస్తున్నాడు. వేగం పుంజుకుంది. అనాదరణకు గురైన రోడ్డు మార్గం. గతుకులమయంగా ఉంది. ఖరీదైన వాహనం కావడం వల్ల కుదుపులు లేవు. సౌకర్యం గానే ఉంది. బుల్లెట్ బండి లోంచి లయాత్మకంగా వెలువడే ధ్వని లబ్‌డబ్ గుండె చప్పుడులా చెవుల్లో సంగీతంలా వినబడుతోంది.

రామం తదేక దీక్షతో బండి నడుపుతున్నాడు. అతని చూపు సూటిగా గమ్యం వైపు ఉంటే మనసు మాత్రం అనేక ఊహలతో గింగిరాలు కొడుతోంది. మాటిమాటికి తల విదిలిస్తున్నాడు. జుట్టును ఒక చేత్తో వెనక్కి లాక్కుంటున్నాడు.


గోదారి వంతెన వచ్చింది. కుడివైపు ఏటిగట్టుకు తిప్పాడు. చల్లని గాలి రివ్వున వీస్తోంది. కుడివైపు నిండు గోదావరి. ఉరకలేస్తూ సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. వరద సమయం. ఏటిగట్టు అంచు వరకు నీరు చేరింది. రోడ్డు మార్గం అనేక వంకర్లతో ఉన్నప్పటికీ ఒకే వేగంతో పోనిస్తున్నాడు. లంకల్లోంచి తోలుకొచ్చిన పశువుల మందను చెట్ల కింద నీడల్లో కట్టారు.



గోదారి వంతెన వచ్చింది. కుడివైపు ఏటిగట్టుకు తిప్పాడు. చల్లని గాలి రివ్వున వీస్తోంది. కుడివైపు నిండు గోదావరి. ఉరకలేస్తూ సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. వరద సమయం. ఏటిగట్టు అంచు వరకు నీరు చేరింది. రోడ్డు మార్గం అనేక వంకర్లతో ఉన్నప్పటికీ ఒకే వేగంతో పోనిస్తున్నాడు. లంకల్లోంచి తోలుకొచ్చిన పశువుల మందను చెట్ల కింద నీడల్లో కట్టారు.

రామం సినిమాలు చూస్తాడు. కథలు చదువుతాడు. అప్పటికప్పుడు కథలు అల్లి చెబుతాడు కూడా. కుర్రకారు సినీ హీరోల్లా జుట్టూ గెడ్డం పెంచాడు. జీన్ ఫాంటు...టీ షర్టులతో ఉంటాడు. చలాకీగా ఉండే అందమైన పాతికేళ్ల కుర్రాడు రామం.

"అన్నా... కొంచెం స్పీడు తగ్గించు. ఇపుడు పులసల సీజను అనుకుంటాను. బాగా దొరుకు తున్నాయా?" గోదారి వైపు చూస్తూ సునీత అడిగింది. ఆగస్టు, సెప్టెంబరు లలో గోదారి చూస్తే ఈ ప్రాంతవాసులకు పులసలే గుర్తుకొస్తాయి. వరద తగ్గుముఖం పడితే గానీ పులసలు దొరకవు. అదే చెప్పాడు.




ఏటిగట్టున జనసంచారం లేదు. మనిషి జాడ లేదు. గోదారి ఉధృతంగా సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. కనుచూపు మేర తూర్పున సూర్య కిరణాల్లో బంగరు ఛాయతో మెరుస్తూ కలకనీరు.

''పులస గురించి చెప్పనా? ఒక ఆడపులస మధుర జలాల గోదారి గొప్పతనం గురించి తన అమ్మమ్మ, నానమ్మల ద్వారా వింది. వాళ్లు అప్పటికే రెండుసార్లు గోదారి నీళ్లలో తనివితీరా ఈది మునకలేసి గంపెడు సంతానంతో తిరిగొచ్చాయి. పదేపదే ఊరిస్తూ చెబుతూ ఉండటంతో తనూ బయలుదేరింది. ఆస్ట్రేలియా నుండి ఖండాంతరాలు దాటి హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం కడకు గోదారీ సముద్రం సంగమ స్థలికి చేరింది. పిల్లల్ని కని వెనక్కి వెళదా మనుకుంది. అదెంత ఆపదో ఊహించుకోలేదు.

అక్కడ చమురు సంస్థల తీవ్ర సవ్వడుల ప్రకంప నాలుంటాయి. దాటాలి. గోదారి వేటగాళ్ల చేతుల్లో తమకోసమే ప్రత్యేకంగా అల్లిన ఖరీదైన వలలుంటాయి. తప్పించుకోవాలి. ఈ సుదూర ఈత ఎంతో సాహసకృత్యం. అనుభవంలోకి వస్తే గానీ కొన్ని సమస్యలు తెలియవు. పులస రుచికి మాంసప్రియులు నాలుకలు చాపుకుని ఎదురు చూస్తుంటారు. జిహ్వా చాపల్యంగల ముసిలోళ్లు జీవితంలో చివరిసారిగా తిని తీరాలనుకుంటారు. సెన కలిగిన ఆడ పులసంటే మరీ ఇష్టపడ తారు. వాళ్లకు పులస తినడం నలుగురిలో పరువుకు సంబంధించిన విషయం. ఆ పరువు కోసం పుస్తెలైనా అమ్ముతారు.. ఆస్తులైనా అమ్ముకుంటారు ఎంతకైనా తెగిస్తారు. పట్టుబడిన ఆడపులసకు సంతానోత్పత్తి కలలు నెరవేరవు. నాలాంటివాడు సాగనీయడు. అది ఎలాగంటే..." అంటూ ఏటిగట్టు అంచు వరకు బులెట్ పోనిచ్చి గభాలున బలంగా సునీతను గోదారిలోకి నిర్దాక్షిణ్యంగా తోసేశాడు. కనురెప్ప మూసి తెరిచేంతలో జరిగిపోయింది. లిప్తలో సునీత వరద గోదారిలోకి జారిపోయింది.

"వంశ ప్రతిష్ఠ గురించి ఆలోచించక్కర్లేదా...పైగా కులభ్రష్టత్వంతో కనడానికి కూడా సిద్ధపడతావా?" అనుకుంటూ కసిగా తిట్టుకుంటూ బుల్లెట్టును వెనక్కి తిప్పాడు. విజయగర్వంతో దారి మరల్చాడు.

వీరబాబు సాయంత్రం నుంచీ సునీతకు ఫోన్ చేస్తూనే ఉన్నాడు. పలకలేదు.

భయం...భయంతో పాటు కలల సౌధం కూలినట్లుగా ఆలోచనలు... వెనకాముందూ ఆలోచించకుండా అడగ్గానే పంపినందుకు గుండెల్లో వణుకు మొదలైంది. జరగరానిదేదో జరిగి పోతున్నట్టుగా అయోమయంతో నిస్సహాయంగా

నిలుచుండిపోయాడు. సకల అవరోధాలు... ఆటంకాలు... ఎదురవుతాయని తెలిసే గాఢంగా ప్రేమించాడు. కుల తారతమ్యాల్ని పట్టించుకోకుండా ఇద్దరూ ఒక రకంగా సాహసమే చేశారు.

ఒకరికొకరు అన్నట్టుగా బతకాలనే అనుకున్నారు. కలల పంట పండుతున్న సమయంలో తప్పు చేశానేమోనని అపరాధభావంతో సర్వం కోల్పోయినట్లుగా కళ్లనీళ్ల పర్యంతమై ఏడ్చేశాడు వీరబాబు. వెంటనే సునీత తల్లిదండ్రుల దగ్గర కెళ్లడానికి నిశ్చయించుకున్నాడు. లోలోపల అలజడి...ఉద్వేగ సంరంభం...

ఊరు చేరేటప్పటికి రాత్రి పదకొండు గంటలయ్యింది. సునీత ఎంతో ఇష్టపడే ఇల్లు అది. ఎదురుగా నిలుచున్నాడు. ఏ విధమైన అలికిడి లేదు. ధైర్యంగా గేటు దూకి కాలింగ్ బెల్ నొక్కాడు. ఎవరూ వస్తున్న జాడ లేదు. పదేపదే బెల్ నొక్కడం తలుపు గట్టిగా కొట్టడం చేస్తున్నాడు. కాసేపటికి తలుపు తెరుచుకుంది.

రాఘవరావు కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నాయి. వచ్చినవాడిని పోల్చుకున్నాడు. వీరబాబును చీదరగా కోపంగా చూశాడు. లోపలికి రావడానికి వీల్లేదంటూ గుమ్మానికి అడ్డంగా నిలబడ్డాడు.

"ఎందుకొచ్చావ్?" తీవ్రంగా చూస్తూ అడిగాడు.

"సునీత ఎక్కడ?" అంటూ తోసుకుని లోపలకి అడుగేశాడు వీరబాబు.

"ఏయ్...ఆగు..." అన్నాడు. వినిపించుకోలేదు. ఈలోపు రాఘవరావు కొడుకు రవి పరిగెట్టుకుని వచ్చాడు. రాగానే వీరబాబు కాలరు పట్టుకున్నాడు. పిడిగుద్దులు గుద్దాడు. వీరబాబు మాట్లాడే ప్రయత్నాన్ని సాగనీయలేదు.

"ఆఫ్ట్రాల్ పనిమనిషి కొడుకువి... పెద్దింటి పిల్ల కావాల్సి వచ్చిందా? తిన్నింటి వాసాలు లెక్కపెట్టే దొంగ నా కొడుకా...నీ పని చెబుతానుండు" అంటూ గదిలోకి లాక్కెళ్లి తలుపు గడియ పెట్టేశాడు రవి.

రాఘవరావు తలుపు తీయమని బతిమాలినా తీయలేదు.

"సునీత కోసం అంటున్నాడు. ముందు సునీత ఏమైందో కనుక్కో ...ఎదవని"

లోపల్నుండి అరుపులు, బూతులు, కొట్టుకుంటున్న దభేల్మనే చప్పుళ్లు వినిపిస్తున్నాయి. రవికి ఆవేశం ఎక్కువ. మొండివాడు. విచక్షణాజ్ఞానం లేనివాడు. ఎవర్నీ లెక్క చేయడు. గదిలో ఏం జరుగుతుందో...

కాసేపటికి గదిలోంచి మూలుగులు. ఆ తర్వాత అవీ ఆగిపోయాయి.

మండువాలోగిలిలోని గోడ మీద పులిని చంపి తుపాకీతో తీయించుకున్న ఫొటోలో రాఘవరావు ముత్తాత విజయ గర్వంతో నవ్వుతున్నాడు.

మురళి దిగ్గున లేచాడు. తీక్షణంగా చూశాడు.



**ఒక్కసారిగా నా కాలరు పట్టుకుని గుంజాడు. కళ్లజోడు కింద పడిపోయింది. చొక్కా బొత్తం ఊడిపోయింది. అక్కడితో ఆగలేదు. చెంప చెళ్లుమనిపించాడు. జుట్టు పట్టుకుని లాగాడు. పిడిగుద్దులు గుద్దడానికి సిద్ధపడుతున్నాడు. ఏం చేయబోతున్నాడు? ఎందుకంత కోపం?**

కళ్లల్లో రోషాగ్ని జ్వాలలు. ముఖంలో రంగులు మారాయి. కోపంతో ఊగిపోతున్నాడు. హఠాత్తుగా అతనిలోని మార్పు ఎందుకొచ్చిందో ఊహించలేక పోతున్నాను. భయం కలిగింది. నేనూ లేచి నిలబడ్డాను.

ఒక్కసారిగా నా కాలరు పట్టుకుని గుంజాడు. కళ్లజోడు కింద పడిపోయింది. చొక్కా బొత్తం ఊడిపోయింది. అక్కడితో ఆగలేదు. చెంప చెళ్లుమనిపించాడు. జుట్టు పట్టుకుని లాగాడు. పిడిగుద్దులు గుద్దడానికి సిద్ధపడుతున్నాడు. ఏం చేయబోతున్నాడు? ఎందుకంత కోపం?

నిర్ఘాంతపోయాను. కథ ఇచ్చాను. చదివాడు. అంతే కదా...అపరిచితుడిలా ఎందుకు మారాడు?

"నీవు రాసింది మా బంధువు సత్తిరాజు కూతురు శారద గురించే కదా. నీకసలు బుద్ధీ జ్ఞానం ఉందా? శారద ప్రేమ... పుట్టింటికి బయలుదేరడం...ఆ బుల్లెట్టూ... గోదారి గట్టూ... వరద...నీళ్లలో పడటం... అక్కడి వరకు నిజమే. తర్వాత జరిగిందేమిటి? నీకు తెలియదా? ఎందుకిలా చేస్తారు మీ రచయితలు... అసలు జరిగిన వాస్తవం ఏమిటి? ప్రాణాలొడ్డి రక్షించిన ఆ చేపలు పట్టే వాళ్ల గురించి ఎందుకు రాయలేదు? సత్తిరాజు ఇద్దర్నీ అక్కున చేర్చుకున్నాడు కదా. జీవితం సుఖాంతమై ఇరువైపులా అందరూ హాయిగా చక్కగా ఉన్నారు కదా" మురళి స్వరంలో తీవ్రత పెరిగింది. బిగ్గరగా అరుస్తూ ... ఆవేశంతో కదను తొక్కుతున్నాడు.

"మరి... మరి... కథన్నాక ఒక సంఘర్షణ...ఒక సంచలనం... ఉండాలని..." నసిగాను.

"నోర్ముయ్... ఏం సందేశం ఇస్తున్నావురా... పనికిమాలిన రాతలు... చెత్త నా కొడుకా... సందేహంలేదు. నీవు మావాళ్ల కథే రాశావు. గొప్పకి నాచేత చదివిస్తున్నావు. శుభ్రంగా సంసారం చేసుకుంటున్న వాళ్లను చంపేయ డమేమిట్రా... నీ అక్షరాలు గురి తప్పాయి. ధ్వంస రచన ఇది. చేతనైతే కాలం గెలుస్తుందనీ ప్రేమలూ గెలుస్తాయని రాయండి రా... మన కుటుంబ వ్యవస్థ, జీవన నేపథ్యం ఎలాంటిది? కాలాన్ని గౌరవించి చక్కగా వాళ్లిద్దరికీ సాంప్రదాయంగా పెళ్లి చేసినట్టుగా ముగింపు ఇవ్వొచ్చు కదా. కంపుకొట్టే రాతలు రాస్తే పాఠకుడు తిరుగుబాటు చేస్తాడు నాలా. జాగ్రత్త..." అంటూ మురళి తన చేతిలోని కాగితాల్ని పరపరా చింపేసి ఉండచుట్టి బయటకు విసిరేశాడు.

**వచ్చేవారం కథ..**

**ఛాయచిత్ర కథనం - విజయార్కె**




పుస్తక సమీక్ష

# సూర్యకిరణం

ఆర్ఎస్ఎస్ ప్రముఖులంతా అనుయాయుల మీద గాఢమైన ముద్ర వేస్తారు. అది కూడా చిరకాలం ఉండిపోయే ముద్ర. వారి వ్యక్తిత్వాలు, ఆచరణ, జీవితం ఆదర్శనీయంగా ఉండడమే ఇందుకు కారణం. కృ.సూర్యనారాయణ రావుగారి జీవితం కూడా అలాంటిదే. ఆయన జీవిత చరిత్ర 'ఎత్తరి, నేర్పరి, కూర్పరి: మన సూరూజీ'. కృష్ణప్రసాద్ బది కన్నడ మూలానికి (ఉత్తుంగ) ఇది సింగిరెడ్డి బ్రహ్మానందరెడ్డి తెలుగు అనువాదం. ఈ పుస్తకంలో ఏడు అధ్యాయాలు ఉన్నాయి.

ఆర్ఎస్ఎస్ దేశ వ్యాప్తంగా బలపడిందంటే అందుకు కారణం ఆయా ప్రాంతాలలో దైవ సంకల్పం అన్న రీతిలో బాధ్యతలు స్వీకరించిన కొందరు వ్యక్తులే. అలాంటి వారిలో సూర్యనారాయణరావుజీ ఒకరు. కర్ణాటక ప్రాంతం నుంచి ఆయన వచ్చారు. సూరూజీ తమిళనాడులో ప్రచారక్‌గా ఎక్కువకాలం పనిచేశారు. గురూజీ నుంచి డాక్టర్ మోహన్ భాగవత్ వరకు అందరితో కలసి పనిచేసిన సూరూజీ 'పరిపూర్ణత విషయంలో లేశమాత్రపు రాజీ లేదు' అనేవారు. 1946 నుంచి 2016 వరకు ఆయన సంఘం కోసం పనిచేశారు. ఇంతటి దీర్ఘకాలం, మహోన్నత సేవ అందించినవారు సంఘంలోనూ తక్కువే. ఆర్ఎస్ఎస్ ఎదుర్కొన్న మూడు నిషేధాల అనుభవం ఎలాంటిదో తెలిసినవారాయన. తన డెబ్బయ్ ఐదో ఏట సంఘ పెద్దలకు లేఖ రాసి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆ లేఖలో ఆయన రాసిన వాక్యాలే ఆయన ఎంతటి ఆశావాదో (ఐదో అధ్యాయం) అర్థమవుతుంది. వయసు వచ్చిందంటే సహచరులకు భారం కావాలని అర్థంకాదు, కొత్తతరం వారికి అవకాశాలు ఇవ్వాలి అని రాశారు. పైగా కొత్తతరం వారు మనకంటే సృజనశీలురని రాయడం ఆయన ఔన్నత్యానికి నిదర్శనం. అలాంటి వారి కార్యశైలిని పరిచయం చేయడమే ఈ పుస్తకం ఉద్దేశం.



**ఎత్తరి, నేర్పరి, కూర్పరి: మన సూరూజీ**
**కన్నడ మూలం:** కృష్ణప్రసాద్ బది,
**అను:** హైందవి
**ప్రతులకు: సాహిత్య నికేతన్,** హైదరాబాద్ – విజయవాడ.
**వెల:** రూ.200, పేజీలు 190

1924లో జన్మించిన సూర్యనారాయణ రావుజీకి ఆ పేరు పెట్టడం వెనుక ఉన్న గాథ చదివిన తరువాత దేహం పులకిస్తుంది. సూర్యనారాయణరావుజీ తండ్రి కృష్ణప్పగారు. వారి పినతండ్రి పేరు సూర్యనారాయణరావు. ఆ పేరే పెట్టారు. ఈయన కాశీలో ఇచ్ఛామరణం పొందారు. ఈ పుస్తకం చదువుతుంటే ఒక జీవిత చరిత్ర చదువుతున్న అనుభూతి కంటే, ఒక జీవితం సృజనాత్మక రచనగా మన ముందుకు వచ్చిందనిపిస్తుంది. సూరూజీ జీవితంలోని ఘట్టాలతోనే, వాటిని యథాతథంగా అక్షరబద్ధం చేయడం ద్వారానే వారి జీవితాన్ని మనకు సుబోధకం చేశారని అనిపిస్తుంది. రెండో అధ్యాయంలో వివేకానంద సభలు ఇందుకు ఒక ఉదాహరణ.


సూరూజీ మీద వివేకానందుల ప్రభావం అపారమనిపిస్తుంది. ఆఖరి అధ్యాయం ('సూర్య'కిరణాలు)లో శివమొగ్గలో సూరూజీ 1978లో ఇచ్చిన ఉపన్యాసం ప్రచురించారు. అది చదవడం ఒక మంచి అనుభూతి. అంతకు ముందు కూడా కర్ణాటకలో జరిగిన సభలో, ఒక హిందువు మతం మారాడంటే, ఒక శత్రువు తయారయ్యాడనే అర్థం అన్న వివేకవాణి సూరూజీ నోట విన్న రామకృష్ణ మఠం పెద్ద కూడా పరవశించిపోయిన ఉదంతం కనిపిస్తుంది. ఈ పుస్తకంలోని ప్రతి వాక్యం ప్రేరణాత్మకమే. అందుకు కారణం సూరూజీ జీవిత ఔన్నత్యం. దానికి ఉన్న భిన్నత్వం. ఆయన చింతనలోని వైవిధ్యం కూడా కారణమే. కాబట్టి ఈ పుస్తకం ప్రతివారు చదవాలి.

– కల్హణ

# ఇంటి పేరు అమరత్వం

ఒక రాష్ట్రం రెండుసార్లు ఆవిర్భావ దినోత్సవం చేసుకోవటం విచిత్రమైన విషయం. ఆంధ్రప్రదేశ్ విషయంలో ఇది జరిగింది. మొదటిసారి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర ప్రాంతం విడివడింది. ఆంధ్రులు ఆరంభశూరులు కారని తన మరణంతో నిరూపించి, ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి, దానితో పాటు దేశమంతటా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు కారణభూతుడు అయిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. వారి సంక్షిప్త జీవిత చిత్రణ ఈ 'అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ'.

'పొట్టి శ్రీరాములు వంటి నిస్వార్థపరులైన దేశభక్తులు పది పన్నెండుమంది ఉంటే స్వరాజ్యాన్ని ఏనాడో సాధించి ఉండేవాడిని' అంటూ గాంధీజీ నుండి ప్రశంసలందుకున్న వ్యక్తి. గాంధీ తత్వాన్ని గాంధీజీకంటే ఎక్కువగా ఆచరించి చూపిన గాంధేయవాది. ముప్పై ఏళ్ల చిన్న వయసులోనే తన వారందరినీ పోగొట్టుకుని మానసికంగా సన్యాసం స్వీకరించిన వ్యక్తి. ఉద్యోగమా? స్వాతంత్ర్య పోరాటమా? తేల్చుకోవలసి వచ్చినపుడు మంచి భవిష్యత్తు ఉన్న రైల్వే ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలివేసిన త్యాగశీలి. సామాజిక సమరసత కోసం ఒంటరిగా పోరాడిన ధైర్యశాలి. 1952లో ప్రభుత్వం నిర్వహించిన సమావేశానికి హాజరైై పదహారు రూపాయల భత్యం తీసుకునే అవకాశం ఉన్నా రూపాయిన్నర మాత్రమే ఖర్చయిందని, అంతే స్వీకరించిన ఆదర్శవాది. గాంధీజీ ఆదేశాల మేరకు బిహారు భూకంప బాధితులకు సేవలందించిన సేవామూర్తి.



**అమరజీవి**
**పొట్టి శ్రీరాములు పోరాట జీవిత గాథ**
**రచన:** డా. నాగసూరి వేణుగోపాల్
**ప్రతులకు:** కల్యాణలక్ష్మి నిలయం, బ్యాంక్ ఆఫ్ ఇండియా లేన్, నల్లకుంట, హైదరాబాద్ – 500044
**సెల్:** 9032428526

హరిజనుల దేవాలయ ప్రవేశం కోసం మొదటి నిరసన దీక్ష చేశారు. 'హరిజన సేవా దినోత్సవం కోసం రెండుసార్లు నిరాహారదీక్ష చేశారు. 1952లో చివరిగా చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష వారి ఆత్మార్పణతో ముగిసింది.

ఖాదీ ప్రచారం, వెల్లి కార్మికుల ఇక్కట్లు, మద్యపాన నిర్మూలన, జైళ్ల సంస్కరణలు, విద్యార్థుల సమస్యలు, హిందూ ముస్లిం ఐక్యత వంటి సమస్యలపై వారు కృషి చేశారు. తొంభై నాలుగు పేజీల ఈ చిన్న పుస్తకంలో వీలైనంత ఎక్కువ సమాచారం ఇచ్చే ప్రయత్నం చేశారు. రచయిత డా॥ నాగసూరి వేణుగోపాల్. ఆకాశవాణిలో వివిధ హోదాలలో పనిచేసి ఉద్యోగ విరమణానంతరం అనేక గ్రంథాలు వెలువరించే ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి, దానితో పాటు దేశమంతటా భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు కారణభూతుడు, క్రమంలో ఉన్నారు.

ఈ పుస్తకం తెలుగు రాష్ట్రాల చరిత్ర గురించి అధ్యయనం చేయాలనుకునే వారికి కరదీపికగా ఉపయోగపడుతుంది.

– వింజనంపాటి రాఘవరావు

# భారత టెన్నిస్ దిగ్గజాలకు అరుదైన గౌరవం!



అమృత్ రాజ్



లియాండర్

వేర్వేరు తరాలకు చెందిన ఇద్దరు భారత టెన్నిస్ దిగ్గజాలకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ టెన్నిస్ ' హాల్ ఆఫ్ ఫేమ్' లో చోటు లభించింది. రాయల్ గేమ్ టెన్నిస్‌లో భారత దిగ్గజ ఆటగాళ్ళు విజయ్ అమృత్ రాజ్, లియాండర్ పేస్ తమకంటూ ఓ ప్రత్యేకస్థానం, గుర్తింపు, గౌరవం దక్కించుకొన్నారు. టెన్నిస్ క్రీడకు పలు విధాలుగా విశిష్ట సేవలు అందించిన క్రీడాకారులను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య 'హాల్ ఆఫ్ ఫేమ్' పురస్కారాలతో గౌరవిస్తూ వస్తోంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఓసారి వివిధ విభాగాలలో హాల్ ఆఫ్ ఫేమ్ కోసం ఆన్ లైన్ ఓటింగ్‌ను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య నిర్వహిస్తూ ఎంపిక చేస్తూ వస్తోంది.

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్యలో 200కు పైగా దేశాలకు సభ్యత్వం ఉన్నా ఇంత వరకు కేవలం 28 దేశాలకు చెందిన క్రీడాకారులకు మాత్రమే హాల్ ఆఫ్ ఫేమ్ గౌరవం దక్కింది. లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌ల అసాధారణ ప్రతిభ, అంకితభావంతో ఈ పురస్కారం పొందిన 28వ దేశంగా, ఆసియా ఖండంలో మొట్టమొదటి దేశంగా భారత్ నిలిచింది. వీరిద్దరికి ముందు 27 దేశాలకు చెందిన 264 మంది 'హాల్ ఆఫ్ ఫేమ్' పురస్కారం అందుకున్నారు. వారిలో ప్రపంచ మేటి క్రీడాకారులు మార్టీనా నవ్రతిలోవా, కిమ్ క్లిస్టర్స్, జాన్ మెకెన్రో, జోర్న్ బోర్గ్, మార్టీనా హింగిన్ ఉన్నారు. లియాండర్ పేస్, అమృతరాజ్‌లతోపాటు ఇంగ్లండ్‌కు చెందిన విఖ్యాత టెన్నిస్ పాత్రికేయుడు రిచర్డ్ ఇవాన్స్‌ను ఎన్నిక చేసినట్లు అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య ప్రకటించింది.

**పేస్ మూడుదశాబ్దాల ఆటకు గుర్తింపుగా...**

లియాండర్ పేస్ తన జీవితంలో మూడొంతుల సమయాన్ని టెన్నిస్ కోసమే వెచ్చించిన ఘనుడు. మూడుదశాబ్దాల తన టెన్నిస్ జీవితంలో పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 37 వారాలపాటు ప్రపంచ నంబర్ వన్ ర్యాంకు ఆటగాడిగా, 462 వారాలపాటు ఏటీపీ డబుల్స్ టాప్ –10 జాబితాలో కొనసాగాడు. డబుల్స్ విభాగంలో 55 టైటిల్స్ గెలుచుకొన్నాడు. ఇందులో 18 గ్రాండ్ స్లామ్ డబుల్స్ టైటిల్స్ సైతం ఉండటం విశేషం.

ఇక.. డేవిస్ కప్ చరిత్రలో 45 డబుల్స్ మ్యాచ్‌లు సహా 57 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. వరుసగా ఏడు ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్ సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత తొలి ఏకైక ప్లేయర్‌గా నిలిచాడు. అత్యధిక మిక్సిడ్ డబుల్స్ టైటిల్స్ సాధించిన రికార్డును దిగ్గజ ప్లేయర్ మార్టీనా నవ్రతిలోవాతో కలసి పంచుకొన్నాడు. పేస్ సాధించిన మొత్తం 18 గ్రాండ్ స్లామ్ ట్రోఫీలలో 10 మిక్సిడ్ డబుల్స్, 8 డబుల్స్ టైటిల్స్ మాత్రమే ఉన్నాయి.

**ఇది శతకోటి భారతీయులకు అంకితం ..**

తన విజయాలు, రికార్డులకు, భారత టెన్నిస్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా దక్కిన గౌరవాన్ని వందకోట్లకు పైబడిన భారతీయులకు లభించిన పురస్కారంగా భావిస్తున్నట్లు లియాండర్ ప్రకటించాడు.

టెన్నిస్ వ్యాఖ్యానం విభాగంలో విజయ్ అమృత్ రాజ్‌కు హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. 1970 దశకంలో భారత నంబర్ వన్ టెన్నిస్ ప్లేయర్‌గా, ప్రపంచ టెన్నిస్‌లోని ముగ్గురు ప్రతిభావంతులైన (అమృత్ రాజ్, బోర్గ్ , కానర్స్) ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకొన్న విజయ్ రిటైర్మెంట్ తరువాత వ్యాఖ్యాతగా తన కెరియర్‌ను మలచుకొన్నారు. మధుర భాషణ, లోతైన విశ్లేషణలతో కూడిన కమ్మటి వ్యాఖ్యానంలో విజయ్ తనకు తానే సాటి. వయసు మీరుతున్నా తన వ్యాఖ్యాన శైలిలో ఏటికేడాది యవ్వనాన్ని, సొగసును పెంచుకొంటూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది టెన్నిస్ అభిమానులను సమ్మోహన పరుస్తూ వస్తున్నారు.

**నిజమైన దేశభక్తుడు పేస్...**

వ్యక్తిగత రికార్డుల కంటే దేశ, భారత టెన్నిస్ ప్రయోజనాలే ముఖ్యమని భావించే లియాండర్‌కు మువ్వన్నెల జాతీయ పతాకం అంటే ఎనలేని భక్తి, గౌరవం. ఇస్లామాబాద్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన డేవిస్ కప్ పోరుకు ప్రాణభయంతో పలువురు సీనియర్ ఆటగాళ్లు దూరమయ్యారు. అయితే .. 46 ఏళ్ల అతను యువఆటగాళ్లతో కలసి ఆడటానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపాడు. చివరకు తటస్థవేదికగా ఎంపికైన నూర్–సుల్తాన్ ఎముకలు కొరికే చలివాతావరణంలో భారతజట్టు తరపున బరిలో నిలచి కీలక డబుల్స్‌లో విజయం అందించాడు.

ప్రస్తుత భారత డేవిస్ కప్ శిక్షకుడు జీషన్ అలీతో కలసి.. 1990లో తన తొలి డేవిస్ కప్ మ్యాచ్ ఆడిన లియాండర్ పేస్, గత 30 ఏళ్లుగా భారత జట్టులో సభ్యుడిగా కొనసాగుతూనే ఉన్నాడు. ఈ వయసులోనూ కుర్రాడిలా రాణిస్తూ, ప్రతిభ, అంకితభావాలకు వయసుతో ఏ మాత్రం పనిలేదని చాటిచెప్పాడు. 46 ఏళ్ల వయసులో 18 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ సాధించడంతో పాటు..ఆడిన 57 డేవిస్ కప్ మ్యాచ్ ల్లో 44 విజయాలతో సరికొత్త ప్రపంచ రికార్డు నమోదు చేశాడు.

**45 దేశాల నుంచి ఇద్దరే ఇద్దరు..**

ఆసియాఖండంలో 45కు పైగా దేశాలకు చెందిన క్రీడాకారులు టెన్నిస్ ఆడుతూంటే కేవలం భారత్‌కు చెందిన ఇద్దరు క్రీడాకారులకు మాత్రమే హాల్ ఆఫ్ ఫేమ్ పురస్కారం దక్కడం భరతజాతి ఘనతగా మిగిలిపోతుంది. చైనా, జపాన్, కొరియా లాంటి మేటి దేశాల క్రీడాకారులు సాధించలేనిది వీరిద్దరు సాధించడం అపూర్వం.. అసాధారణం.

భారత క్రికెట్ చరిత్రలో సచిన్ కు ఎంత గౌరవం, గుర్తింపో...భారత టెన్నిస్‌లో లియాండర్ పేస్ అదేస్థాయి ఆటగాడు. పేస్ లాంటి మరో ఆటగాడి కోసం భారత టెన్నిస్ ఎంతకాలం వేచిచూడాలో మరి.! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# ఆత్మవిశ్వాసంతో ఆనంద జీవితం

## – దివ్యాంగుల సమ్మేళనంలో వక్తలు

**విజయవాడ :** దివ్యాంగులు ఎట్టి పరిస్థితులలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదని త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి చెప్పారు. సక్షమ్ (దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేస్తున్న అఖిల భారత సంస్థ) ఆధ్వర్యంలో విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో డిసెంబర్ 10న దివ్యాంగుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ, మనిషి జీవితంలో అన్నీ కోల్పోయినా ఆత్మవిశ్వాసంఉంటే ధైర్యంగా, ఆనందంగా గడప వచ్చని చెప్పారు. మనిషి శరీరంలో ఏదైనా లోపం ఉందని అంటే అతనిలో ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ కూడా ఉంటుందని తెలిపారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో అంధులైన పిల్లలకు క్రికెట్‌లో శిక్షణ ఇచ్చామని, వారు లండన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంధుల క్రికెట్ జట్టుతో ఆడి బంగారు పతకాలు పొందారని చెప్పారు. అంధుల కోసం వికాసతరంగిణి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక పాఠశాల, కళాశాలను స్థాపించి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

సక్షమ్ జాతీయ అధ్యక్షుడు గోవిందరాజన్ మాట్లాడుతూ దివ్యాంగుల వికాసం, సంక్షేమం, సాధికారత కోసం 2008లో ఈ సంస్థను స్థాపించామని చెప్పారు. దేశాభివృద్ధిలో దివ్యాంగులను భాగస్వామ్యం చేయడంతోపాటుగా వారిని ఆత్మ గౌరవంతో జీవించే విధంగా తమ సంస్థ వారికి అండగా ఉంటుం దన్నారు. దివ్యాంగులకు ఆరోగ్యపరమైన సేవలు అందిస్తూ, వారికి అవసరమైన పరికరాలు




సమకూరుస్తూ, వారిలో ఆత్మావిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని వివరించారు.

సక్షమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్క రించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని వెల్లడించారు. జాతీయ ఉపాధిహామీపథకం రాష్ట్ర పర్యవేక్షణ మండలి మాజీ సభ్యుడు గూట్లపల్లి సాయిజనార్దన్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం చర్చించేందుకు చట్టసభల్లో నామినేటెడ్ పోస్టులను ఇవ్వాలని కోరారు. ఆంధ్ర ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ 15 సంవత్సరాల లోపు చిన్నారులకు గుండె సంబంధిత జబ్బులకు తమ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తు న్నామన్నారు. ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ (గుంటూరు) డాక్టర్ బి.కృష్ణ వేణి, రిటైర్డ్ ఐఏఎస్ అధి కారి దాసరి శ్రీనివాసులు, పారిశ్రామిక వేత్తలు బి.మలి కార్జునరావు, కె.మోహన రెడ్డి, కె.మనో హర్ తది తరులు పాల్గొన్నారు. సభ అనంతరం సక్షమ్ క్యాలెం డర్‌ను అతిథులు ఆవిష్కరిం చారు. సభ ప్రారంభానికి ముందు దివ్యాంగులు ప్రద ర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అల రించాయి. 'మౌనం గానే ఎదగమని' అనే పాటను ఆలపించి అందరినీ వారు ఉత్తేజపరిచారు. సెల్‌ఫోన్‌వల్ల జరిగే దుష్ఫలి తాలను మైమ్ ద్వారా దివ్యాంగులు ప్రదర్శించారు.

# చేగూరులో సహకారభారతి అఖిల భారత మహిళా సదస్సు

**రంగారెడ్డి :** మహిళా సాధికారత ప్రేరణగా పని చేస్తున్న సహకార భారతి 3వ అఖిల భారత మహిళాసదస్సు 2023 డిసెంబర్ 15,16వ తేదీలలో తెలంగాణ, రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హశాంతి వనంలో జరిగింది. దేశం నలుమూలల నుండి వివిధ సహకార సంఘాల నుండి 2650 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఉత్పత్తి, మార్కెటింగ్‌లో తమ అనుభవాలను పంచుకున్నారు. వివిధ మహిళా సహకార సంఘాలవారి ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించారు. అఖిల భారత సహకార భారతి అధ్యక్షులు, కార్యదర్శి విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తు సహకార భారతి సాధించిన విజయాలను వివరించారు. సహకార భారతి అఖిల భారతీయ ఎన్.జి.ఓ. సంస్థ. సహకార రంగంలో అతిపెద్ద సంస్థ. 1979 సంవత్స రంలో స్థాపించారు. దీని ప్రధాన లక్ష్యం పారదర్శకత, అభివృద్ధి, విస్తరణ (శుద్ధి, వృద్ధి సమృద్ధి). హ్యాష్ ట్యాగ్ 'బినా సంస్కార్ నహీ సహకార్, బినా సహకర్ నహీ ఉద్ధర్'. దేశమంతటా 29 రాష్ట్రాలలో, 650 కంటే ఎక్కువ జిల్లాల్లో సేవలను విస్తరించింది. సహకార సంస్థలలోని 12రంగాలలో పని చేస్తోంది. క్రెడిట్, డెయిరీ, స్వయం సహాయక బృందాలు, హౌసింగ్, ఫిషరీస్, వీవర్స్, కన్స్యూమర్, మహిళా, బ్యాంకులు, మార్కెటింగ్, రైతు ఉత్పత్తిదారుల సంస్థ, పారిశ్రామిక సహకార సంస్థలు అందులో ఉన్నాయి. సహకార భారతి సభ్యులు, డైరెక్టర్ల బోర్డుకు శిక్షణ ఇస్తోంది. సహకార భారతి సాధించిన కొన్ని విజయాలు: 1. నిరంతర ప్రయత్నం వల్ల భారత ప్రభుత్వం సహకారం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. 2. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు బహుళ ప్రయోజన సహకార సంఘంగా అధికారం కల్పించేందుకు చట్ట సవరణ. 3. బ్యాంకులలో ఖాతాదారులకు




డిపాజిట్ బీమా కింద రూ.1 లక్ష నుండి 5 లక్షలకు పెంపు. డిపాజిట్ ఇన్సూరెన్స్ క్రెడిట్ గ్యారెంటీ పథకం. 4. రాష్ట్ర ప్రభుత్వ హామీ లేకుండా సహకార సంఘాలకు ఎన్‌సీడీసీ రుణాలు. 5. అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకులకు బ్రాంచ్ పాలసీ సరళీకరణ. 6. సహకార సంఘాల రిజిస్ట్రేషన్, కార్యకలాపాలను సులభతరం చేయడానికి బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టానికి సవరణ. 7. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బోర్డులో సహకార సంఘాల ప్రతినిధి (ప్రస్తుతం సతీష్ మరాటే సహకార సంఘాలనుండి ఆర్‌బీఐ బోర్డులో డైరెక్టర్‌గా ఉన్నారు). 8. సహకార సంఘాలకు ఆదాయపు పన్ను తగ్గింపు. 9. సహకార సంఘాల సభ్యులకు వారి వద్ద ఉన్న డిపాజిట్లపై టీడీఎస్ లేదు. 10. సహకార సంఘాల వివిధ సమస్యలపై రాష్ట్ర కేంద్ర ప్రభుత్వంతో చర్చలు.

యెక్కటి ఉపేందర్‌రెడ్డి, నాగిళ్ల కుమారస్వామి, కట్టమోని రమాదేవి తదితర అధ్యక్ష, కార్యదర్శులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ★


SURYA
MARCHING
—AHEAD WITH—
INDIA
SURYA
Integrating India with state-of-the-art products. Adding bright colours to every Indian's life.
Spearheading the league of bringing a change. Setting new landmarks. Understanding global trends in business.
Anticipating challenges. Adopting faster. Upgrading business processes. And delivering.
Just like India, an ever-growing, ever-emerging nation, Surya has been scripting an awe-inspiring growth story for the last 5 decades. No wonder, it has come a long way since its incorporation back in 1973.
I am SURYA
CELEBRATING 50 YEARS OF TRUST
DURABLE PRODUCTS FOR ALL SEGMENTS
ASSURED QUALITY
CONSUMER LIGHTING
PROFESSIONAL LIGHTING
APPLIANCES
FANS
PVC PIPES
STEEL PIPES
SURYA ROSHNI LIMITED
E-mail: consumercare@surya.in | www.surya.co.in | Tel.: +91-1147108000
Toll Free No.: 1800 102 5657
/suryalighting | /surya_roshni




తెలుసుకుందాం

# రాయచోటి వీరభద్రస్వామి ఆలయం



ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా రాయచోటి, మాండవ్య నది ఒడ్డున ఈ ఆలయం కొలువుదీరింది. భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఇక్కడ పూజలందుకుంటున్నాడు. వీరశైవుల పుణ్య క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. రాజరాజ చోళుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి.

కథ

## దురాశ ఫలితం!



ఒక ఊరిలో మధు, రంగ అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ఇద్దరూ బాగా చదువుకున్నారు. కానీ ఇద్దరికీ సంపాదన లేదు. ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించాలనుకున్నారు. దగ్గరలో ఉన్న పట్టణానికి వెళ్లి అక్కడ పని కోసం ప్రయత్నించి ధనం సంపాదించవచ్చునుకున్నారు.

పట్టణానికి బయలుదేరే ముందు రంగ "మంచి, చెడు.. ఏదైనా.. మనమిద్దరం సమానంగా పంచుకుందాం" అన్నాడు, మధుతో. దానికి మధు 'సరే' అన్నాడు.

ఇద్దరూ కాలి నడకన అడవి మార్గంలో పట్టణం వైపు వెళ్లసాగారు.

కొంతదూరం వెళ్లాక మార్గమధ్యంలో కాలిబాట పక్కనే బంగారు కానులతో నిండుగా ఉన్న ఒక సంచి రంగ కంట పడింది. వెంటనే ముందుకు దూకి ఆ సంచిని తీసుకుని, "నేను చాలా అదృష్టవంతుడిని. ఈ ధనంతో వ్యాపారం మొదలుబెడతాను. నా బీదరికం పోతుంది" అన్నాడు సంతోషంగా.

"రంగా! మనం తీసుకున్న నిర్ణయం మర్చిపోయావా! నా వాటా నాకు ఇవ్వవా?" అని అడిగాడు మధు.

"మనం మంచిచెడుల గురించి మాట్లాడుకున్నామే కాని, ధనం గురించి కాదు కదా! ఈ ధనం నాకు దక్కాల్సింది. అందుకే నా

## పద్యం

**సిరిగల వాని కెయ్యెడల చేసిన మేలది నిష్ఫలం బగున్**
**నెఱి గుఱిగాదు పేదలకు నేర్పున చేసిన సత్ఫలంబగున్**
**వఱపున వచ్చి మేఘు డొక వర్షము వాడినచేలమీదటన్**
**కురిసిన గాక అంబుధుల కుర్వగ నేమి ఫలంబు భాస్కరా!**

భావం : ధనవంతునికి మనం చేసే మేలు వ్యర్థం. పేదవానికి చేస్తే ప్రయోజనం కలుగుతుంది. వానలు లేనపుడు ఎండిపోతూ ఉన్న చేల మీద మేఘుడు వాన కురిస్తే ఫలితం ఉంటుంది కానీ, సముద్రం మీద కురిస్తే ప్రయోజనం ఉండదు కదా!

## శ్లోకం

'చోరాణాం అనృతం బలమ్...'

**దుర్బలస్య బలమ్ రాజా**
**బాలానాం రోదనం బలమ్**
**బలం మూర్ఖస్య మౌనిత్వం**
**చోరాణాం అనృతం బలమ్**

భావం : : పాలకుల అండ బలహీనులకు బలం. పసివారికి ఏడుపే బలానిస్తుంది. మూర్ఖులు నోరు విప్పకపోవడం మేలు. చోరులకు అసత్యాలే బలం.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| చంద్రబాబు నాయుడు | కాంగ్రెస్ |
| రేవంత్ రెడ్డి | బీజేపీ |
| కేసీఆర్ | టీడీపీ |
| కిషన్ రెడ్డి | బీఎస్పీ |
| ప్రవీణకుమార్ | వైసీపీ |
| జగన్మోహన్ రెడ్డి | బీఆర్ఎస్ |

సమాధానాలు : చంద్రబాబు నాయుడు–టీడీపీ రేవంత్ రెడ్డి–కాంగ్రెస్; కేసీఆర్– బీఆర్ఎస్; కిషన్ రెడ్డి–బీజేపీ; ప్రవీణ్ కుమార్–బీఎస్పీ; జగన్మోహన్ రెడ్డి – వైసీపీ.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### ప్రభుదాస్ పట్వారీ



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, న్యాయవాది, రాజకీయ నాయకుడు కూడా. **1908** సంవత్సరంలో గుజరాత్ రాష్ట్రంలో జన్మించారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. గాంధీజీ పిలుపు మేరకు **1942**లో క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో చేరారు. **1977-1980** మధ్యకాలంలో తమిళనాడు రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేశాడు. **1985**లో తుదిశ్వాస విడిచారు.

## జనరల్ నాలెడ్జ్

1. మనదేశంలో విస్తీర్ణం పరంగా అతి చిన్న రాష్ట్రం?
2. జయలలిత ఏ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు?
3. ఏపీలో ఎన్ని లోక్‌సభ స్థానాలున్నాయి?

సమాధానాలు : 1. గోవా 2. తమిళనాడు 3. 25

## మెదడుకు మేత

చిక్కటి కారడవిలో
చక్కటి దారి..
ఏమిటది?

జవాబు : తల, పాపిట

## మంచిమాట

**మనసులో మాలిన్యం ఉన్నపుడు శరీరాన్ని ఎంత శుభ్రంగా ఉంచుకుంటే ఏం లాభం? చేపలు రాత్రింబవళ్లు నీళ్లలోనే ఉన్నా వాటి వాసన పోదు కదా**



కంట పడింది. ఇందులో నీకు వాటా ఇవ్వను" అంటూ సంచిని దాచుకోబోయాడు రంగ.

అదే సమయంలో కొందరు వ్యక్తులు అటువైపు పరుగెత్తుకుని వచ్చారు. స్నేహితులిద్దరి వైపు చూస్తూ "పట్టుకోండి. వాళ్లే దొంగలు" అని అరిచారు. అది విని రంగ భయంతో వణికిపోయాడు.


"మధూ, వాళ్లు మనం దొంగలమని భావిస్తున్నారు. వాళ్ల చేతికి దొరికితే శిక్ష తప్పదు. పద పారిపోదాం!" అన్నాడు. "అవును, బహుశా వాళ్లు బంగారు కానుకలున్న సంచిని పోగొట్టుకుని ఉంటారు. ఆ సంచి నీకు దొరికింది.. కాబట్టి శిక్ష నీకే పడుతుంది" అన్నాడు, మధు.

ఏం చేయాలో పాలుపోని రంగ తప్పించుకోవడానికి ముందుకు పరిగెత్తాడు. వ్యక్తులు మధు వైపు రాకుండా రంగ వెనుక పరుగెత్తి అతన్ని పట్టుకున్నారు. ★



# వారఫలాలు

25 -31 డిసెంబర్, 2023



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అనుకోని ప్రయాణాలు. బంధుమిత్రుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతాయి. కష్టపడ్డా ఫలితం అంతగా కనిపించదు. స్థిరాస్తి వివాదాలు ఎదురవుతాయి. శారీరక రుగ్మతలు. విద్యార్థులకు కొంత శ్రమ తప్పదు. ఉద్యోగులకు స్థానమార్పులు. కళా కారులు, రాజకీయవేత్తలు, రచయితలకు విదేశీ పర్యటనలు వాయిదా. 30,31 తేదీలలో శుభవార్తలు, వాహనసౌఖ్యం. గణపతిని పూజించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

బంధువులనుంచి విలువైన సమాచారం. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. కొన్ని పాతబాకీలు వసూ లవుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాల్లో గందరగోళం తొలగుతుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు అన్నివిధాలా కలిసివచ్చే కాలం. విద్యార్థులలో కొత్త ఆశలు చిగురిస్తాయి. 26,27 తేదీల్లో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. దత్తాత్రేయస్తోత్రాలు పఠించండి. ఆశించిన ఆదాయం

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

సమకూరుతుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. సన్నిహితుల సాయంతో కొన్ని కార్యక్రమాలు చక్కదిద్దుతారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. వివాహ, ఉద్యోగ యత్నాలు కలసి వస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శన వ్యాపారులకు పెట్టుబడులు సకాలంలో అందుతాయి. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు. 25,26 తేదీల్లో దుబారా ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సందేశం. విద్యార్థులు, నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. చర్చలు కొన్ని ఫలిస్తాయి. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి. క్రీడాకారులు, రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 29,30 తేదీల్లో దూర ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రెండు మూడు విధాలుగా ధనలబ్ధి. అత్యంత విలువైన సమాచారం అందుతుంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగాలు దక్కించుకుంటారు. సేవాకార్యక్రమాలపై ఆసక్తి. వ్యాపారులు లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి. కళాకారులు, క్రీడాకారులు లక్ష్యాలు సాధిస్తారు. 27,28 తేదీల్లో అనుకోని సంఘటనలు. బంధు విరోధాలు. శివస్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. ఉద్యోగులకు ఊహించని హోదాలు. సమాజ సేవలో భాగస్వాములవుతారు. యుక్తితో సమస్యల నుంచి గట్టెక్కుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు విదేశీ పర్యటనలు. 25,26 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

తెలివిగా వ్యవహరించి కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. ప్రముఖుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వాగ్ధాటితో అందర్నీ ఆకట్టుకుంటారు. నూతన విద్యావకాశాలు దక్కుతాయి. ఉద్యోగులకు ఒక సమాచారం మరింత ఊరట. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు ఉత్సాహ వంతంగా ఉంటుంది. 27,28 తేదీల్లో దూర ప్రయాణాలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఉద్యోగయత్నాలు సఫలమవుతాయి. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. నూతన విద్యావకాశాలు దక్కించుకుంటారు. వ్యాపారులు విస్తరణ కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగులకు విధుల్లో కొత్త బాధ్యతలు దక్కుతాయి. రాజకీయ, కళారంగాల వారికి, క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుంది. 28,29 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువులతో వివాదాలు. లక్ష్మీగణపతిని పూజించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొత్త కార్యక్రమాలకు శ్రీకారం. అదనపు రాబడి ఉంటుంది. విద్యార్థుల నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. సమాజంలో ప్రత్యేక గౌరవం పొందుతారు. వ్యాపారాలు సంతృప్తికరంగా ఉంటాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు మరింత అనుకూలత. నూతన ఉద్యోగాలు దక్కు తాయి. వారం 30,31 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. దత్తాత్రేయుని పూజించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

దూరపు బంధువుల కలయిక. వేడుకలు, విందు వినోదాలలో పాల్గొంటారు. అదనపు ఆదాయం సమకూరుతుంది. సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. ధార్మిక కార్యక్రమాలపై దృష్టి.ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లభిస్తాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 26,27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్వల్ప ఆరోగ్య సమస్యలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయంతో కార్యక్రమాలు చక్కదిద్దుతారు. వివాహ, ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాల విస్తరణ యత్నాలలో పురోగతి. . పారిశ్రామికవేత్తలు, కళా కారులకు సన్మానాలు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. 27,28 తేదీల్లో ప్రయాణాలలో మార్పులు. శారీరక రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి..

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు తొలగి ఊరట చెందుతారు. ఆస్తుల వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. ఇంటి నిర్మాణాలు చేపట్టే వీలుంది. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు ఒత్తిడులు తొలగుతాయి. 28,29 తేదీల్లో వృథాఖర్చులు. బంధువులతో విభేదాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

# పదరసం-445

## ఆధారాలు

**అడ్డం**

1) విక్రమార్క సింహాసనానికి ఇరువైపులా ఉన్నబొమ్మలు (ఏకవచనంలో) (5)

5) ఆశ్రయం (2)

7) 11 అడ్డమునకు వ్యాకరణ పదం సరిగాలేదు 4)

9) వేగం (3)

10) మెరుగైనకాంతి (3)

11) విలువ లేనిదికానీ, ఇది ఒక గొప్ప భారతీయ సృష్టి (2)

13) అటు నుంచి వచ్చిన ప్రార్ధన (4)

15) ఒక గంధర్వగాయక గురుశ్రేష్టుడు తిరగబడ్డాడు(4)

17) లోభం, అత్యాశ (3)

19) చెదరిన పొట్టేలు (3)

21) నేర్పరి, గడుసుది (3)

22) తగిన సమయం (3)

24) --చాంతాడు అంటే చాలా పొడుగు అని (4)

25) గురి (2)

26) పరస్పరం ఎదుర్కొనడం (1)

27) తాటిమొలక (2)

**నిలువు**

1) సంగీత సంబంధమైన వేదం (4)

2) ఖజానా, బొక్కసం (3)

3) కన్నులతో చేసే సైగలు, వాడుక భాషలో పర్యవేక్షణ (5)

4) ఏది కొంటున్నా ఇది చెయ్యడం కద్దు (2)

6) బెల్లము కలిపిన తడిపిండి. ఆడుబిడ్డ పుట్టింటి నుంచి వెళ్ళేటప్పుడు పెట్టేది (4)

8) భారతదేశ అధ్యాత్మిక ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన యువకెరటం (7)

12) చిన్నప్పుడు అందరికీ అమ్మ తినిపించేవి (5)

14) కాడికి తగిలించిన నాగలి, మంచి ముక్కును కూడా దీనితో పోలుస్తారు (3)

16) ఒక రకమైన గడ్డి, దీనిలో తొక్కడమంటే పూర్తిగా పట్టించు కోకపోవడం (2)

18) ముక్కుతో, అస్పష్టంగా మాట్లాడబడునది (2)


20) తూకం వేసే త్రాసు (3)

22) చిన్నకుండ (3)

23) మంచాలల్లే త్రాడు (3)

24) దొంగ తపస్సు అంటే ఈ పక్షే గుర్తుకు వస్తుంది(2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**



**పదరసం - 445**

పేరు : ....................................................................................


చిరునామా: ..............................................................................

..............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..........................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2024 జనవరి 08 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యానిదే.

## పదరసం - 441 సమాధానాలు



**విజేతలు:** కొన్నే ప్రశాంత్, కె.నరిసంగ్‌రావు బోర్లం, కాశీభట్ల రామచంద్ర, ఎన్.ఫణిమంజరి, ఆర్.అంజనీదేవి, వై.సోమేశ్వరరావు, వై.రాధాకిషన్, నకిరెకంటి అనిత, రామకూరు లక్ష్మి, వి.శివలాస్య, జి.వెంకటేష్‌బాబు, కె.సత్య నారాయణ, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, ఆర్.ఎస్.పి. కౌముది, బి.ఇందుశేఖర్, యస్.లక్ష్మీదేవి, టి.వెంకయమ్మ, టి.రామలింగయ్య, వనమాల రామలింగాచారి, రాయపెద్ది అప్పాశేషశాస్త్రి, ఎమ్.వెంకటేశ్వర్లు, అల్లాడసాయి పావని లలితాదేవి, బాచిరాజు విజయలక్ష్మి.

**ఈ వారం విజేత : టి.ఎస్.ఆర్.ఆంజనేయులు, కోనసీమ జిల్లా**




అరుణ

# 'దెయ్యం' వదిలేదెప్పుడు?

తెలుగులో యేడాదికి దాదాపు రెండు వందల స్ట్రయిట్ సినిమాలు వస్తుంటే... అందులో పది శాతం సినిమాలు హారర్ జోనర్‌కు చెందినవే ఉంటాయి. గతంలో కథానుగుణంగా హారర్‌ను జొప్పిస్తే... ఇప్పుడు ప్రేక్షకులను భయపెట్టడం కోసం ఆ తరహా సినిమాలను రూపొందిస్తున్నారు. అందులో కథ అనేది బూతద్దంతో చూసినా కనిపించదు. ఇక ఈ భయపెట్టే సినిమాల్లోనే ఆ మధ్య కామెడీ హారర్ అనే సబ్ జానర్ ఒకటి ఏర్పడింది. కొన్నేళ్ల పాటు ఆ తరహా సినిమాలు రాజ్య మేలాయి. ఇప్పుడు ఆ హోరు కొంత తగ్గి పూర్తి స్థాయి హారర్ చిత్రాలు మళ్లీ ఊపందుకున్నాయి.

ఈ యేడాది తమిళ, ఆంగ్ల అనువాద చిత్రాలలో దాదాపు పది పదిహేను హారర్ జోనర్ చిత్రాలే జనం ముందుకు వచ్చాయి. అదృష్టం బాగుండి అవేవీ కమర్షియల్‌గా సక్సెస్ సాధించలేదు. కానీ తెలుగులో వచ్చిన స్ట్రయిట్ సినిమాలలో రెండు మూడు చిత్రాలకు చక్కని విజయం లభించడంతో ఈ జానర్ మీద మళ్లీ మన నిర్మాతలు ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడాది ప్రారంభంలో పూర్ణ, జయప్రద నటించిన 'సువర్ణ సుందరి' చిత్రం వచ్చింది. ఇది చారిత్రక అంశాలతో తెరకెక్కినదే అయినా... ఆత్మలతో నడిచే కథ. హారర్ కామెడీ జానర్‌లో సీనియర్ దర్శకులు రేలంగి నరసింహారావు 'ఊ అంటవా మావ ఉఊ అంటావా మావ' సినిమాను తెరకెక్కించారు. మార్చిలో 'వీరఖడ్గం' అనే మరో హారర్ మూవీ వచ్చింది. ఈ మూడు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఏ మాత్రం ప్రభావం చూపలేక పోయాయి. అయితే ఆ తర్వాత వచ్చిన 'విరూపాక్ష' కమర్షియల్‌గా మంచి విజయాన్ని అందుకుంది. సాయిధరమ్ తేజ్ సినిమాలో వందకోట్లు వసూలు చేసిన తొలి చిత్రంగా నిలిచింది. సంయుక్త మీనన్ కీలక పాత్ర పోషించిన ఈ సినిమా ప్రారంభం నుండి చివరి వరకూ భూత ప్రేత పిశాచాలు, చేతబడి, బాణామతి వంటి క్షుద్ర విద్యల చుట్టూనే సాగింది. ఆ తర్వాత వచ్చిన 'భూ' థియేటర్లో కాకుండా ఓటీటీలో సందడి చేసింది. పెద్దంత హైప్ క్రియేట్ చేయకపోయినా... విశ్వక్‌సేన్, రకుల్ ప్రీత్ సింగ్, నివేదా పేతిరాజ్, మంజిమా మోహన్, మేఘా ఆకాశ్ వంటి వాళ్లు ఉంటడంతో కాస్తంత సందడి చేసింది.

ఈ తరహా సినిమాలకు నిదానంగా కాలం చెల్లిపోతుందని అనుకుంటున్న సమయంలో వచ్చిన మరో చిత్రం 'మా వూరి పొలిమేర -2'. 'పొలిమేర'లో ఉన్నంత వయొలెన్స్, వల్గర్ డైలాగ్స్ ఇందులో లేకపోయినా... ఇది కూడా చేతబడి చేసే వ్యక్తులు, వాటి పర్యవసానం నేపథ్యంలో జరిగే కథే. 'పొలిమేర' ఓటీటీలో విడుదల కాగా దాని సీక్వెల్ థియేటర్లల్లో విడుదలై మంచి విజయం సాధించింది. దాంతో దీనికి మరో సీక్వెల్ కూడా తీసే పనిలో దర్శక నిర్మాతలు పడ్డారు. తాజాగా 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనే ట్యాగ్ లైన్‌తో 'పిండం' విడుదలైంది. పేరు పలకడానికే కాస్తంత ఇబ్బందిగా ఉండే ఈ సినిమాలో అంత భయపెట్టే అంశాలు ఏముంటాయా? అని కొందరు ఆసక్తి ప్రదర్శించారు. ఈ ట్యాగ్ లైన్‌తో ప్రేక్షకుల నుండి ఏం ఆశించాలో దానిని మేకర్స్ పొందారు. కానీ సమ్ థింగ్ స్పెషల్‌గా ఉంటుందని భావించిన ఈ సినిమా ఆ స్థాయిలో లేకపోవడం ప్రేక్షకులను నిరాశ పరచింది.

గత సంవత్సరం వచ్చిన 'మసూద' ముస్లిం ఫ్యామిలీకి సంబంధించిన హారర్ డ్రామా కాగా ఇది క్రైస్తవ కుటుంబానికి సంబంధించిన కథ. ఓ పల్లెటూరిలోని రైస్ మిల్లులో పనిచేసే ఆంథోని కుటుంబం ఊరి చివరి మేడను కొనుక్కుని అందులో నివాసం ఉంటుంది. అయితే అందులో అప్పటికే ఉన్న కొన్ని ఆత్మలు వీరిని భయపెడుతుంటాయి. ఇల్లు ఖాళీ చేసి బయటకు వెళ్లాలని వారు ప్రయత్నించినా అందుకు అవి సమ్మతించవు. ఈ విషయాన్ని అన్నమ్మ అనే తాంత్రికురాలు గ్రహిస్తుంది. ఆంథోని కుటుంబానికి ఆమె ఎలా సహకరించింది? ఇంటిలో ఉన్న నాలుగైదు ఆత్మల నుండి వారిని ఎలా కాపాడింది? అనేదే పిండం' కథ. ఓ మనిషి జీవితం కడుపులోని పిండంతో మొదలై.. అతని మరణానంతరం పెట్టే పిండంతో పూర్తవుతుంది. కాబట్టి జీవన మరణాలకు సంబంధించిన ఈ కథకు అదే సరైన టైటిల్ అని దర్శకుడు సాయికిరణ్ దైదా భావించారు. అందులో తప్పులేదు.

కానీ కథలో ఏ మాత్రం కనిపించని కొత్తదనం, ట్యాగ్‌లైన్ లో చెప్పినట్టు ప్రేక్షకులను బెదరగొట్టే అంశాలు పెద్దగా లేకపోవడంతో ఇది రెగ్యులర్ హారర్ జానర్ మూవీ కేటగిరిలోకి వెళ్లిపోయింది. ఈ చిత్రంలో కీలక పాత్రలను శ్రీరామ్, ఖుషీ రవి పోషించారు. అన్నమ్మ పాత్రను ఈశ్వరీరావు, ఆమె జీవితం గురించి అధ్యయనం చేసే వ్యక్తిగా అవసరాల శ్రీనివాసరావు నటించారు. ప్రొడక్షన్ వాల్యూస్ ఫర్వాలేదనిపిస్తాయి, నేపథ్య సంగీతమూ బాగుంది. కానీ ఏ మాత్రం లాజిక్ లేకుండా, రొద్దకొట్టుడు కథతో సినిమాను తీశారు.

పల్లె ప్రాంతాలలో క్షుద్రశక్తులు, క్షుద్ర విద్యలను నమ్మేవారు, ఆచరించే వారు కొందరు ఉండొచ్చు. కానీ వారి మూఢ విశ్వాసాలను గ్లోరిఫై చేస్తూ సినిమాలు తీయడం అనేది ఈ కాలంలో సబబుగా అనిపించదు. కొందరైతే... మర్డర్ మిస్టరీ చిత్రాలనూ హారర్ జోనర్ తరహాలో ప్రెజెంట్ చేస్తున్నారు. ఆ మధ్య వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ 'మంగళవారం' ఈ కోవకు చెందిందే. ఇలాంటి కథలలో ఎవరూ లాజిక్ చూడరు కాబట్టి... పెద్దంత కష్టపడక్కర్లేదన్నది మేకర్స్ ధీమా కావచ్చు. ఈ తరహా సినిమాలు సమాజానికి మేలు చేయకపోగా సాధారణ జనంలో లేనిపోని భయాలను కలిగిస్తాయి.వారి ఆలోచనలు వక్రమార్గం పట్టేలా చేస్తాయి. మరి తెలుగు సినిమాకు పట్టిన ఈ దెయ్యం ఎప్పటికి వదులుతుందో చూడాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# మన కాలపు కోహినూర్



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్‌ను మించిన వజ్రాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ కిరీటంలో అలంకరించారు. అదే సూరత్‌లో గిఫ్ట్ సిటీలో నిర్మించిన సూరత్ డైమండ్ బౌర్స్. ప్రపంచంలోనే అతిపెద్దది, అత్యాధునికమైన అంతర్జాతీయ వజ్రాల, నగల వ్యాపార కేంద్రం సూరత్ డైమండ్ బౌర్స్‌ను డిసెంబర్ 17న ప్రధానమంత్రి మోదీ ప్రారంభించారు. దాదాపు 67 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ కేంద్రం అమెరికాలోని పెంటగాన్ కన్నా పెద్దది కావడం విశేషం.



From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 07


# G. PULLA REDDY

## DEGREE & P.G. COLLEGE

**(Affiliated to Osmania University)**

**MEHDIPATNAM,** HYDERABAD - 28

**Ph : 23513154**

**English Medium** **Estd 1994** **Co-Education**

**(A College Striving for Excellence in Quality Education)**

## COURSES OFFERED

**B.Sc** (M.S.Cs) (M.P.Cs) (M.E.Cs)

**B.B.A**

**B.Com** (Computers Applications) (General)

**M.Sc** (Mathematics) (Physics)

**WE HAVE :** ✦ Well Equipped Labs & Library ✦ Qualified & Experienced Faculty ✦ Well Furnished Classrooms ✦ Campus Placements

**For Details contact office between *10.00 A.M. & 5.00 P.M***

**PRINCIPAL**